

కోళ్లపై వైరస్ పంజా

'పశ్చిమ'లో లక్షల్లో మృత్యువాత

పడిపోయిన కోడిగుడ్ల ఉత్పత్తి

3

ఆందోళనలో యజమానులు

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 5-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 291 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 12.36 తదుపరి నవమి; నక్షత్రం: భరణి రా. 8.33 తదుపరి కృత్తిక వర్జ్యం: ఉ. 6.55-8.26; దుర్ముహూర్తం: మ.12.06-12.51; అమృతఘడియలు: సా. 4.00-5.31; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.08 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇది జగన్ సర్కారు చేసిన 'భూగాయం!' దీనిని మాన్పేందుకు కూటమి సర్కారు నానా తంటాలు పడుతోంది. వేలకొద్దీ వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించడం ఎలాగో తెలియక తల పట్టుకుంటోంది.

కొన్నిచోట్ల అసలు యజమానులను మార్చేశారు. ఇంకొన్ని చోట్ల సర్వే నంబర్లను ఎత్తేశారు. మరికొన్ని చోట్ల విస్తీర్ణం తగ్గించేశారు. ఇదీ వైఎస్ జగన్ హయాంలో జరిగిన తంతు! తప్పులు చేసింది రెవెన్యూ సిబ్బంది! శిక్ష అనుభవిస్తున్నది.. రైతులు! సమస్య పరిష్కరించాల్సిన సర్వే, రెవెన్యూ శాఖలు ఏడు నెలలు గడిచినా మీనమేషాలు లెక్కిస్తున్నాయి. 6,880 గ్రామాల్లో సభలు నిర్వహించగా, 2.80 లక్షల ఫిర్యాదులు రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

భూమినే మాయం చేశారు



ఈ రైతు పేరు లక్కిరెడ్డి రాఘవరెడ్డి. కడప జిల్లా పాయలకుంట్ల గ్రామానికి చెందిన రాఘవరెడ్డికి వేమకుంట రెవెన్యూ.. సర్వే నంబరు 82/3, 4,6లలో 4.44 ఎకరాల భూమి ఉంది. 20 ఏళ్ల నుంచి ఆయన సాగు చేసుకుంటున్నారు. ఆయన పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు, అడంగల్, 1బీలు ఆన్‌లైన్‌లో నమోదై ఉన్నాయి. రీసర్వేలో 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఆయన భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఆ భూమిని బంజరుగా మార్చారు. సర్వే మా కొంప ముంచిందని రాఘవరెడ్డి వాపోతున్నారు. తప్పును సరి చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగన్ చేసిన భూ గాయాలు!

'జగనన్న భూ రక్ష' కాదు.. రైతులపై కక్ష

తప్పుల తడకగా సాగిన భూముల రీ సర్వే

వందేళ్ల తర్వాత సర్వే అంటూ వివాదాల ఉచ్చు

విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు తలకిందులు

అడ్డగోలుగా రికార్డుల తయారీ

సరిదిద్దుకోవడానికి రైతుల పాట్లు

బాధితులను వేధిస్తున్న కొందరు సిబ్బంది

రికార్డులు సరిచేయడానికి కాసులు డిమాండ్

పరిష్కారం చూపని అప్పీళ్ల వ్యవస్థ

దిద్దుబాటు చర్యలకు వెల్లువలా వినతులు



(అమరావతి/ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వందేళ్ల తర్వాత రీ సర్వే చేస్తున్నామని గొప్పగా చెప్పారు! వివాదాలన్నీ మటుమాయమవుతాయని ఊరించారు! 'జగనన్న భూ రక్ష' అంటూ హడావుడి చేశారు. చివరికి అది భూరక్ష కాదు... రైతులపై కక్ష అని తేలిపోయింది. హేతుబద్ధత, శాస్త్రీయత లేకుండా చేసిన భూముల సర్వేతో రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల రైతుల భూముల సరిహద్దులు, సర్వేనంబర్లు తలకిందులయ్యాయి. వాటిని పరిష్కరించేందుకు మండల స్థాయిలో అప్పీళ్ల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని జగన్ సర్కారు గొప్పలు చెప్పినా ఆచరణలో ఫలితమివ్వలేదు. తను దిగిపోయేనాటికి రీ సర్వే పూర్తి కావాలని నాడు జగన్ ఒత్తిడి తెచ్చారు. దీనిపై ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండకూడదని ఆంక్షలు పెట్టారు. అయితే, ఆయనది హడావుడిగానే మిగిలిపోయింది. సమస్యలేవీ

మిగతా 14వ పేజీలో...

ప్రజలపై ఇక భారం

మోపలేం



ఆదాయార్జన శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల, ఉన్నతాధికారులు

ఇప్పటికే వారి జీవితాల్ని దుర్భరం చేసిన వైసీపీ

కొత్త విధానాల్లో ఆదాయం పెంచుకోవాల్సిందే: సీఎం

ఆదాయార్జన శాఖల్లో పనితీరు మెరుగుపడాలి

రాష్ట్రంలో పన్ను ఎగవేతలు ఉండటానికి వీల్లేదు

అలాగని వ్యాపారులపై వేధింపులకు పాల్పడొద్దు

అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం

పీ4 విధానంలో ఏపీలో పేదరిక నిర్మూలన

ఉగాది నుంచి ప్రారంభం.. సర్వేకు ప్రత్యేక పోర్టల్

అమరావతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): "గత ప్రభుత్వ విధానాలతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయి. ఆదాయం కోసం ప్రజలపై అదనంగా భారం మోపలేం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆదాయార్జనలో మరింత మెరుగైన ఫలితాలు సాధించడం మినహా మరొక మార్గం లేదని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాలకు, అభివృద్ధి పనులకు ఆర్థికవనరులు ఎంతో కీలకమన్న ఆయన... రోజువారీ పురోగతిని చూపేలా ఆదాయార్జన శాఖల్లో అధికారులు పని చేయాలని నిర్దేశించారు. వనరులు, ఆదాయ వృద్ధిపై చంద్రబాబు మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. "గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా కుదేలైన రాష్ట్రం మళ్లీ కోలుకుని అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వంలోని ఆదాయార్జన శాఖలు ఉత్తమ ఫలితాలు రాబట్టాలి. రాష్ట్ర ఖజానాకు రాబడులు పెంచేందుకు సరికొత్త ఆలోచనలు చేయాలి. రాష్ట్రాన్ని ఆర్థిక కష్టాల్లోంచి బయటపడేసేందుకు

మిగతా 13వ పేజీలో...



ఎన్నికల సామగ్రితో పోలింగ్ అధికారులు

నేడే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

క్లైమాక్స్‌కు చేరిన హస్తిన రాజకీయ పోరు

గెలుపుపై కమలం ఆశాభావం

2

అనూహ్యంగా పుంజుకున్న కాంగ్రెస్

అధికారం నిలుపుకోడానికి ఆప్ అష్టకష్టాలు

ఈవీఎంలలో తీర్పు నిక్షిప్తం చేయనున్న ఓటర్లు

పైవాళ్లకివ్వాలి.. పదివేలు ఇవ్వండి

ప్రతి మద్యం షాపు నుంచీ మామూళ్లు

ఎక్సైజ్ కమిషనరేట్‌లోనే లంచాల పర్వం

రూ.3.3 కోట్లు లక్ష్యం.. ఇప్పటికే రూ.2 కోట్లకు పైగా వసూళ్లు

14

డైరెక్టర్ దృష్టికి మామూళ్ల వ్యవహారం

జిల్లా స్థాయి అధికారులకు వార్నింగ్

కమిషనరేట్‌లో చర్యల లేమిపై అనుమానాలు

స్వీయ ధ్రువీకరణ చాలు

భవన నిర్మాణాల అనుమతులు ఇక సులభం

ఆమోదించే అధికారం పట్టణ స్థానిక సంస్థలకే

తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవు

11

బీసీలపై వైసీపీ కత్తి!

గీత కార్మికులకు మద్యం షాపులు దక్కకుండా హైకోర్టులో పిటిషన్ల వరద

పిటిషనర్లలో ఎక్కువ మంది వైసీపీ అనుకూలురే!

మాజీ ప్రభుత్వ న్యాయవాదులతో వేయించారంటున్న టీడీపీ

మాజీ స్టాండింగ్ కౌన్సిళ్లు కూడా

జగన్ స్థానిక సంస్థల్లో బీసీ కోటాను 24 శాతానికి తగ్గించారంటున్న నేతలు

ఆయన మద్యం పాలసీతో 4 వేల కల్లుదుకాణాలు మూతపడ్డాయని వెల్లడి

బీసీలపై వైసీపీ ద్వేషానికి ఇవే నిదర్శనమంటూ ధ్వజం



అమరావతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాలంటే తమకు గిట్టదని వైసీపీ నాయకులు మరోసారి నిరూపించుకుంటున్నారు. కల్లు గీత కార్మికుల ఆర్థిక అభ్యున్నతికి టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఎలాగైనా అడ్డుకునేందుకు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. 2014-19 మధ్య రాజధాని అమరావతికి వ్యతిరేకంగా పిటిషన్ల అస్త్రాన్ని ప్రయోగించిన వైసీపీ పెద్దలు తాజాగా మరోసారి అదే బాటలో పయనిస్తున్నారు. రాష్ట్రంలోని 3,396 మద్యం షాపుల్లో

మిగతా 14వ పేజీలో...

అమరావతిపై అదే విషం

మళ్లీ ప్రపంచ బ్యాంకుకు ఫిర్యాదులు

రుణ మంజూరులో సరైన విధానం పాటించలేదని తాజాగా ఆరోపణలు

విచారణ చేపట్టిన ఇన్‌స్పెక్షన్ ప్యానెల్

అన్నీ వివరిస్తున్న టెండర్ల పర్యవేక్షక కమిటీ

అప్పులు పుట్టకుండా 4 నెలలుగా సైంధవుల దుష్ట పన్నాగాలు

13

వైసీపీ నాయకులే ఇదంతా చేస్తున్నారని ప్రభుత్వం గుర్తు!

రాహుల్ అర్బన్ నక్సల్!

దేశంపై యుద్ధాన్ని ప్రకటించారు

గుడిసెల్లో పేదలతో ఫొటోలు దిగే వాళ్లకు ఆ పేదల బాధలు అర్థం కావు

50 ఏళ్లలో 'గరీబీ హఠావో' కాలేదు

మేం పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం: మోదీ

'అద్దాల మేడ' కోసం ఎన్నికల్లో అసాధ్య హామీలు ఇస్తున్నారంటూ కేజ్రీవాల్‌పై విమర్శ

చైనా దురాక్రమణపై రాహుల్‌వి తప్పుడు ఆరోపణలు.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

రాహుల్‌పై సభాహక్కుల నోటీసు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ.. రాహుల్, కేజ్రీవాల్‌పై

మిగతా 2వ పేజీలో...



ఉత్పత్తిలో 'ఉక్కు' సంకల్పం

11

అరకొర జీతాలు.. తక్కువ మంది సిబ్బంది

ముడిసరుకు లభ్యతా అంతంత మాత్రమే


ప్రతికూల పరిస్థితుల్లోనూ అత్యధిక ఉత్పత్తి

పది నెలల్లో 31 లక్షల టన్నుల హాట్ మెటల్

2 బ్లాస్ట్ ఫర్నేస్‌లతోనే లక్ష్యాన్ని మించి ఉత్పత్తి

సప్త వాహనాలపై సప్త గిరీశుడి వైభవం

13



మంగళవారం తిరుమలలో సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడి దర్శనం

ఏఐ సెంటర్ మాకివ్వండి

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లోకేశ్ వినతి

విశాఖ డేటా సిటీకి సహకరించండి

కేంద్రం అనుమతులు సులభతరం చేయండి

సింగిల్ విండో పద్ధతిలో పర్మిషన్లు ఇవ్వండి

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం

ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం

ఎలక్ట్రానిక్స్ కంపెనీలతో యువతకు ఉపాధి

వాటి స్థాపనకు సహకారం అందించండి

కేంద్ర ఐటీ-ఎలక్ట్రానిక్స్ మంత్రికి అభ్యర్థన



కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన 'ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎడ్యుకేషన్'ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి లోకేశ్.. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ రైల్వే శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. కృత్రిమ మేధ (ఏఐ)తో రాబోతున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి రాష్ట్రం సిద్ధంగా

మిగతా 6వ పేజీలో...

డేటా చౌర్యాన్ని నిరూపిస్తే రూ.10 కోట్లు ఇస్తా

ఫోన్ వాడనని చెప్పే జగనే వాట్సాప్ గురించి మాట్లాడితే ఎలా: లోకేశ్

అమెరికా నుంచి భారత్‌కు..

205 మంది అక్రమ వలసదారులు వెనక్కి!

యుద్ధ విమానం 'సీ-17 గ్లోబ్‌మాస్టర్'లో భారతీయులను తరలిస్తున్న అమెరికా ప్రభుత్వం

నేడు అమృత్‌సర్‌లో దిగనున్న విమానం!.. నేర చరిత్ర ఉన్నవారిని అరెస్టు చేస్తాం: పంజాబ్ పోలీసులు

అమెరికాలో అక్రమంగా ఉంటున్న 18 వేల మంది భారతీయులు.. అక్రమ వలసలకు వ్యతిరేకమన్న భారత్

ట్రంప్‌తో వాణిజ్య యుద్ధానికి జిన్‌పింగ్ సై!.. అమెరికా బొగ్గు, ఎల్ఎన్‌జీ ఉత్పత్తులపై 15% సుంకం

టెక్సాస్, ఫిబ్రవరి 4: అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు ప్రారంభించింది. అమెరికా చరిత్రలోనే అతి పెద్ద బహిష్కరణ ఆపరేషన్ మొదలైంది. ఇందులో భాగంగా భారత్‌కు చెందిన అక్రమ వలసదారులను వెనక్కి పంపే ప్రక్రియను ప్రారంభించింది. అమెరికా సైన్యానికి చెందిన సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానం 205 మంది భారతీయులతో టెక్సాస్ నుంచి బయల్దేరినట్లు సమాచారం. ఈ విమానం భారత్‌కు చేరుకోవడానికి 24 గంటలు పడుతుంది. అది బుధవారం మధ్యాహ్నానికి పంజాబ్‌లోని అమృత్‌సర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో పంజాబ్ పోలీసులు అప్రమత్తమయ్యారు.



అమెరికా నుంచి వచ్చే వారిని నిర్బంధించాలన్న ఆదేశాలేవీ రాలేదని అధికారులు తెలిపారు. కానీ, అమెరికా నుంచి వచ్చే వారి పత్రాలన్నింటినీ తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. అమెరికా నుంచి తిరిగి వస్తున్న వారిలో ఎవరిపైనైనా పంజాబ్‌లో క్రిమినల్ రికార్డులు ఉన్నాయా? అనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. నేర చరిత్ర కలిగిన వారు ఎవరైనా వస్తే.. వెంటనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. మరోవైపు భారత్‌కు వస్తున్న విమానంలో ఎవరున్నారు? ఎంత మంది ఉన్నారు? వంటి వివరాలను వెల్లడించడానికి అమెరికా అధికారులు నిరాకరించారు. తమ ప్రభుత్వం అక్రమ వలసదారులపై కఠిన చర్యలు తీసుకుంటుందని మాత్రం స్పష్టం చేశారు. అక్రమంగా అమెరికాలో ఉంటున్న వారందరినీ బహిష్కరిస్తామని తెలిపారు. అమెరికాలో 18 వేల మందికి పైగా భారత అక్రమ వలసదారులు ఉన్నట్లు ఇరుదేశాలూ గుర్తించాయి. వారందరినీ అమెరికా నుంచి బహిష్కరించేందుకు

మిగతా 2వ పేజీలో...



అమెరికా నుంచి భారత్‌కు..

(మొదటి పేజీ తరువాయి)

ట్రంప్ సర్కారు సిద్ధమవుతోంది. అక్రమ వలసదారులను భారత్‌కు తిప్పి పంపిస్తామని చెప్పగా.. ప్రధాని మోదీ అంగీకరించినట్లు ట్రంప్ ఇటీవల వెల్లడించారు. కాగా, అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాలపై ఇప్పటికే భారత్ విదేశాంగ శాఖ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసి లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికా సహా ఏ దేశంలో ఉన్నా తిరిగి తీసుకొచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళ్తున్న తరుణంలో అక్రమంగా వలస వెళ్లిన భారతీయుల తొలివిడత తరలింపు జరగడం గమనార్హం. అక్రమ వలసదారులను తరలించేందుకు అమెరికా వినియోగిస్తున్న సీ-17 సైనిక విమానాలు చాలా ఖరీదైనవి. అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థ తయారు చేసిన 223 సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానాలను ఆ దేశ సైన్యం వినియోగిస్తోంది. వీటి విలువ దాదాపు రూ.6.6 లక్షల కోట్లు. ఈ మొత్తం టాంజానియా, శ్రీలంక, ఘనా, బెలారస్, ఉరుగ్వే, క్రొయేషియా వంటి దేశాల జీడీపీ కంటే ఎక్కువ కావడం విశేషం. ఇక ప్రపంచవ్యాప్తంగా 275 సీ-17 విమానాలు వినియోగంలో ఉండగా.. వాటిలో 223 విమానాలు అమెరికా ఆర్మీ వద్దే ఉండడం గమనార్హం. ఆస్ట్రేలియా, కెనడా, భారత్, కువైత్, ఖతార్, యూఏఈ, యూకే కూడా ఈ విమానాలను వినియోగిస్తున్నాయి. కాగా, గతంలో ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించడానికి భారత్ కూడా తన సీ-17 విమానాన్ని రొమేనియాకు పంపింది. మరోవైపు రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత రాజీవ్ శుక్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. అక్రమ వలసదారులుగా ముద్ర వేసి 7.25 లక్షల మంది భారతీయులను వెనక్కి పంపేందుకు అమెరికా సిద్ధమవుతోందని ఆరోపించారు. విదేశీ వ్యవహారాలపై ఏర్పాటు చేసిన పార్లమెంటు స్థాయీ సంఘం సమావేశంలో తనకీ విషయం చెప్పారన్నారు.

స్వీడన్‌లో బడిలో కాల్పులు..10 మంది మృతి

స్టాక్‌హోమ్, ఫిబ్రవరి 4: స్వీడన్‌లోని ఓ పాఠశాలలో (వయోజన విద్యా కేంద్రం)లో మంగళవారం మధ్యాహ్నం కాల్పుల కలకలం రేగింది. గుర్తు తెలియని ఓ వ్యక్తి పాఠశాలలో జరిపిన కాల్పుల్లో 10 మంది మరణించారు. కాల్పులు జరిపిన వ్యక్తి కూడా మృతుల్లో ఉన్నాడని, 15 మంది గాయపడ్డారని పోలీసులు వెల్లడించారు. స్టాక్‌హోమ్‌కు సుమారు 200 కిమీల దూరంలోని ఒరెబ్రో నగర శివారులోని పాఠశాలలో ఈ ఘటన జరిగింది. ప్రాథమిక, ఉన్నత విద్య పూర్తి చేయని 20 ఏళ్ల వయస్సు పైబడిన వారు ఈ పాఠశాలలో చదువుతుంటారు. ప్రధాన పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్ష అనంతరం పాఠశాలలోని ఓ గదిలో ఆగంతకుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. కాల్పుల ఘటనలో ఉగ్రవాద కోణం లేదని, కొంతకాలంగా దేశంలో జరుగుతున్న గ్యాంగ్‌వార్‌ల్లో భాగంగా జరిగిన ఘటనని ప్రభుత్వం భావిస్తోంది.

న్యాక్ కేసులో జేఎన్‌యూ ప్రొఫెసర్ సస్పెండ్

- గుర్తింపు ఇచ్చేందుకు 'కేఎల్' నుంచి 1.8 కోట్లు డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఉన్నత విద్యాసంస్థలకు ఇచ్చే 'నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గుర్తింపును అడ్డుపెట్టుకుని లంచాలు డిమాండ్ చేసిన కేసులో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా విధుల నుంచి సస్పెండ్ అయ్యారు. గుంటూరులో ఉన్న కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ విద్యాసంస్థకు అనుకూలంగా 'ఏ++' నివేదిక ఇచ్చేందుకు న్యాక్ పరిశీలన బృందం.. ఏకంగా రూ.1.8 కోట్లను లంచంగా డిమాండ్ చేసినట్టు సీబీఐ అధికారులు తెలిపారు. అయితే.. పలు చర్చల తర్వాత రూ.28 లక్షలకు సెటిల్ అయిందని పేర్కొన్నారు. దీనిలో పరిశీలన బృందం చైర్మన్ రూ.10 లక్షలు, సభ్యులు ఒక్కొక్కరూ రూ.3 లక్షల చొప్పున తీసుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. అదేవిధంగా ల్యాప్‌టాప్‌లు, బంగారం, సహా పరిశీలన బృందంలోని ఓ సభ్యుడి సతీమణి విదేశీ ప్రయాణానికి అయ్యే ఖర్చును కూడా లంచం కింద డిమాండ్ చేశారని తెలిపారు. ఈ వ్యవహారంపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీనిలో ఒక్క రాజీవే.. రూ.1.3 కోట్లు డిమాండ్ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

హెటెరోలో విషవాయువులు లీక్

- 12 మంది కెమిస్టులకు అస్వస్థత
- అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఘటన

నక్కపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని హెటెరో ఔషధ పరిశ్రమలో మంగళవారం రాత్రి విష వాయువులు లీకవ్వడంతో 12 మంది కెమిస్టులు అస్వస్థతకు గురయ్యారు. యూనిట్-9 పరిధిలోని హెచ్-7 బ్లాక్ వద్ద రాత్రి 8 గంటల సమయంలో రసాయనంతో కూడిన డ్రమ్ము పేలడంతో విష వాయువులు వెలువడ్డాయి. దీంతో అక్కడున్న కెమిస్టులు ఊపిరాడక ప్రాణభయంతో పరుగులు పెట్టారు. కొందరు కళ్లు మంట, ఊపిరాడక, గొంతు మంటతో స్పృహ తప్పి పడిపోయారు. బాధితులను హెటెరో అంబులెన్స్‌ల్లో నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యుల సూచన మేరకు వీరిలో ముగ్గురిని విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి బాగానే ఉందని హెటెరో ప్రతినిధులు పోలీసులకు చెప్పారు. నక్కపల్లి, అడ్డరోడ్డు సీఐలు కుమారస్వామి, రామకృష్ణ ఆస్పత్రికి చేరుకొని.. హెటెరో ప్రతినిధులు, క్షతగాత్రులతో మాట్లాడారు. అయితే ఘటనాస్థలికి వెళ్లి, పరిశీలించాకే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు పేర్కొన్నారు. కాగా, ప్రమాదంపై మాట్లాడవద్దని ఉద్యోగులను కంపెనీ ప్రతినిధులు ఆదేశించినట్లు తెలిసింది.

హోంమంత్రి, కలెక్టర్, ఎస్పీ ఆరా

హెటెరో ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ ఆరా తీశారు. స్థానిక సీఐలతో హోంమంత్రి ఫోన్‌లో మాట్లాడారు. అస్వస్థతకు గురైన వారికి ఉన్నత వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణహాని లేదని పోలీసులు చెప్పారు.

ఆదిత్యుని నిజరూప దర్శనానికి పోటెత్తిన భక్తజనం

- సూర్యనారాయణ స్వామికి ఘనంగా క్షీరాభిషేకం
- అరసవల్లిలో వైభవంగా రథసప్తమి వేడుకలు



ఆలయంలో దర్శన క్యూలైన్లలో భక్తుల రద్దీ

శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి నిజరూపాన్ని లక్షలాది మంది భక్తులు దర్శించుకున్నారు. రథసప్తమి సందర్భంగా స్వామి నిజరూప దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మంగళవారం తొలిజాము నుంచి క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం.. స్వామివారిని నిజరూప సేవను అందుబాటులోకి తెచ్చారు. రూ.500, రూ.300, రూ.100 క్యూలైన్లు.. అలాగే ఉచిత దర్శనం క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి నిరీక్షించి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించడంతో భక్తుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. మంగళవారం అర్ధరాత్రి వరకు భక్తులు తరలివస్తూనే ఉన్నారు. పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, గాయని మంగ్లీ, ఉత్తరాంధ్రకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వర్ణాలంకరణ సేవ, అనంతరం విశేష పుష్పాలంకరణ సేవ నిర్వహించారు.

రాహుల్ అర్బన్ నక్సల్!

(మొదటి పేజీ తరువాయి)



వారి పేర్లను వినియోగించకుండా.. పరోక్షంగా మండిపడ్డారు. ఢిల్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా తాము బీజేపీ, ఆరెస్సెస్‌తోపాటు.. భారత రాజ్యంపై యుద్ధం చేస్తున్నామని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.! దీన్ని మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. "కొందరు వ్యక్తులు యుద్ధాన్ని ప్రకటిస్తున్నామని బహిరంగంగా చెబుతున్నారు. అర్బన్ నక్సలైట్లలా మాట్లాడుతున్నారు. చేతిలో రాజ్యాంగాన్ని పెట్టుకుని తిరుగుతారు. అయితే.. వారికి రాజ్యాంగం అర్థంకాదు. దేశ సమైక్యత గురించి తెలియదు" అంటూ దుయ్యబట్టారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని 'బోర్' అని రాహుల్ అనడంపైనా ప్రధాని స్పందించారు. గుడిసెల్లో ఫొటో సెషన్లకు పోజులిచ్చే వారికి పేదల బాధలు అర్థంకావన్నారు. అందుకే పార్లమెంట్‌లో పేదల గురించి మాట్లాడితే.. సోనియా, రాహుల్‌కు 'బోర్'కొడుతుందని ఎద్దేవా చేశారు. అటు ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌ను కూడా మోదీ మాటలతో దునుమాడారు. "ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించే కొన్ని పార్టీలతో యువతకు 'ఆప్'ద పొంచి ఉంది. వారు అద్దాల మేడ నిర్మాణానికి అవినీతికి పాల్పడతారు" అంటూ ధ్వజమెత్తారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ పాలనపైనా దుమ్మెత్తిపోశారు. 'గరీబీ హఠావో' అనే నినాదాన్ని 50 ఏళ్లు కొనసాగించినా సాధించలేనిది తమ ప్రభుత్వం చేసి, చూపించిందని.. గడిచిన పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చామని వివరించారు. 4 కోట్ల మంది పేదలకు సొంత ఇళ్లను ఇచ్చామని, 12 కోట్ల మంది పేదలకు మరుగుదొడ్లను కట్టించామని, వారి బాధలను అర్థం చేసుకున్నాం కాబట్టే ఇదంతా చేశామని వ్యాఖ్యానించారు. రాజీవ్‌గాంధీ 21వ శతాబ్ది పేరుతో గాలిమేడలు(హవాహవాయీ) నిర్మించారే తప్ప.. పరిస్థితులు మాత్రం 20వ శతాబ్దంలోనే ఉండేవన్నారు. పేదల అభ్యున్నతిపైనా దృష్టి సారించలేదన్నారు. "అప్పట్లో కేంద్రం నుంచి గ్రామ సచివాలయం వరకు ఒకే పార్టీ పాలన ఉండేది. అయినా.. కేంద్రం ఇచ్చే రూ.1 పేదలకు అందేసరికి 15 పైసలుగా మారేది. మేం నగదు బదిలీని తీసుకొచ్చాం. కేంద్రం ఇచ్చే ప్రతి రూపాయిని లబ్ధిదారులకు చేరేలా చేశాం" అని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్‌తో పేదలందరికీ ఆరోగ్యభాగ్యాన్ని కలిగించామని, కొన్ని రాష్ట్రాలు మాత్రం ఈ పథకాన్ని వినియోగించుకోవడంలేదని విమర్శించారు. పదికోట్ల నకిలీ ఖాతాలను స్తంభింపజేశామని, ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదాచేశామన్నారు. "గతంలో తరచూ రూ.లక్షల కోట్ల అవినీతిపై వార్తలు వచ్చేవి. గడిచిన పదేళ్లలో మా సర్కారు హయాంలో ఎలాంటి అవినీతి ఆరోపణలేవు. కేంద్రంలో పదేళ్లుగా అవినీతి లేకపోవడంతో ప్రజలు లబ్ధిపొందారు" అని మోదీ వ్యాఖ్యానించారు.

రాహుల్‌పై సభా హక్కుల నోటీసు

రాహుల్ గాంధీ లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే సభాహక్కుల నోటీసు ఇచ్చారు. మంగళవారం ఆయన ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఓ లేఖను అందజేసి.. రాహుల్ గాంధీపై సభాహక్కుల తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. చైనా తమ భూభాగంలోకి చొరబడిందంటూ రాహుల్ తన వ్యాఖ్యలతో భారత్ గౌరవానికి భంగం కలిగించారన్నారు. నిస్సిగ్గుగా చారిత్రక అంశాలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు.

రాహుల్‌పై రాజ్‌నాథ్ ఫైర్

భారత భూభాగంలోకి చైనా చొచ్చుకొచ్చిందని, ఆర్మీ చీఫ్ స్వయంగా ఈ విషయం చెప్పాడంటూ లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగంపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. ఆర్మీ చీఫ్ గానీ, సైన్యాధికారులు గానీ ఆ మాట అనలేదని ఎక్స్‌లో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ తప్పుడు ఆరోపణలు చేశారని విమర్శించారు. జాతీయ ప్రయోజనాలకు సంబంధించి ఆయన బాధ్యతారహితంగా మాట్లాడడం, రాజకీయాలకు పాల్పడడం విచారకరమన్నారు. రాహుల్‌గాంధీ చరిత్రపై అవగాహన పెంచుకోవాలని హితవుపలికారు.

నేడే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు



కన్నాట్‌ప్లేస్‌లోని హనుమాన్ గుడిలో కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమయింది. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అధికార ఆమ్ ఆద్మీని ఇంటికి పంపించేందుకు బీజేపీ అన్ని అస్త్రాలను సంధించింది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా మొదలు కొని ఏపీ సీఎం చంద్రబాబు వరకు అందరినీ రంగంలోకి దించింది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన వరాలు ఆ పార్టీ అవకాశాలను మెరుగు పరిచిందన్న అభిప్రాయాలు వస్తున్నాయి. ప్రధానంగా ఆదాయ పన్ను మినహాయింపును రూ.12 లక్షలకు పెంచడంతో మధ్య తరగతి ప్రజలు తమకు అనుకూలంగా ఓటేసే అవకాశం ఉందని బీజేపీ భావిస్తోంది. ఆమ్ ఆద్మీ మాత్రం బడుగు, బలహీన వర్గాలపైనే ఆశలు పెట్టుకుంది. గత పదేళ్లలో ఆ వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, మరోసారి తమకే అధికారం అప్పగిస్తారని కేజ్రీవాల్ బలంగా విశ్వసిస్తున్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటును కూడా దక్కించుకోని కాంగ్రెస్ ఈసారి ఒకటి లేదా రెండు సీట్లను గెలిచే అవకాశం ఉందని అంచనా. అయితే, ఈ పార్టీకి ఓటు శాతం పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ కాంగ్రెస్ ఓటు శాతం పెరిగితే అది ఆమ్ ఆద్మీకి తీరని నష్టం చేసి, బీజేపీకి లాభం చేకూర్చే అవకాశం ఉంది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 699 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 13,033పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హోమ్ ఓటింగ్ సౌకర్యంతో 7,553 మంది తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఈ నెల 8న ఫలితాలు రానున్నాయి.

మేం ఒక్కరు కాదు.. ముగ్గురం: ఈసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: కేంద్ర ఎన్నికల సంఘాన్ని సీఈసీ రాజీవ్ కుమార్ నడుపుతున్నారంటూ ఆప్ నాయకులు ఎన్నికల ప్రచారం చేసిన ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. "మేం ఒక్కరు కాదు.. ముగ్గురం" అని పేర్కొంది. ఆప్ నేతలు చేసిన ఆరోపణలు ఉద్దేశ పూర్వకమని, ఈసీపై ఒత్తిడి పెంచేలా ఉన్నాయని తెలిపింది. ఈసీ అంటే ఒక్క అధికారి చేతుల్లోనే ఉందన్న ఉద్దేశాన్ని కల్పించేలా ఆప్ నేతల ఆరోపణలు ఉన్నాయని పేర్కొంది. అయితే, రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ కావడంతో సంయమనం పాటించాలని నిర్ణయించుకున్నట్టు వివరించింది.

లోకం తీరు



ఆయన.. అమిత్ షా గూండా!

- ఢిల్లీ పోలీసుపై కేజ్రీవాల్ తీవ్ర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఢిల్లీ పోలీసు అధికారిపై ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పోలీసు అధికారిని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా గుండాగా అభివర్ణించారు. "అమిత్‌షా గూండా ఒకరు పోలీసు దుస్తులు ధరించారు. బహిరంగంగానే ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అమిత్‌షా గారూ.. ఈ దేశం మీ గూండాయిజాన్ని ఏమాత్రం సహించదు" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. సంబంధిత వీడియోను ఆప్ మీడియా చీఫ్ కోఆర్డినేటర్ వికాస్ యోగి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. "నాతో పెట్టుకుంటే నువ్వు నన్నేమీ చేయలేవు. కానీ, నేను తలుచుకుంటే నువ్వు ఇబ్బందుల్లో పడతావు" అంటూ బవానా నియోజకవర్గం ఆప్ అభ్యర్థిని ఓ పోలీసు ఇన్‌స్పెక్టర్.. బహిరంగంగా బెదిరించిన వీడియోను కూడా పోస్టు చేశారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ స్పందిస్తూ.. "ఇది అమిత్‌షా గూండాగిరికి నిదర్శనం" అని అన్నారు. 'అమిత్‌షా గూండాగిరి' హ్యాష్ ట్యాగ్‌తో సోషల్ మీడియాలో ఆయన క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు.

సీఎం అతిశీపై ఎఫ్ఐఆర్

సీఎం అతిశీపై ఢిల్లీలోని గోవిందపురి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎన్నికల నిబంధనావళిని సీఎం ఉల్లంఘించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారి తన విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నారని తెలిపారు. "సీఎం అతిశీ తన అనుచరులు 50-70 మందితో 10 వాహనాల్లో వచ్చి పతే సింగ్ మార్గ్‌ను బ్లాక్ చేశారు. ఇది కోడ్‌కు విరుద్ధం" అని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. కాగా, మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘంతో కేజ్రీవాల్, అతిశీ భేటీ అయ్యారు.

దివ్యాంగులందరూ పరీక్షల్లో స్క్రైబ్‌లను ఉపయోగించుకోవచ్చు

- కేంద్రం తగిన అవకాశాలు కల్పించాలి: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దివ్యాంగ అభ్యర్థులందరూ పరీక్షల్లో జవాబులు రాసేందుకు తమకు సహాయకులుగా 'స్క్రైబ్ (లేఖరి)లను నియమించుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు తగిన సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రస్తుతం 40 శాతం మేర వైకల్యం ఉన్న అభ్యర్థులే స్క్రైబ్‌లను తోడుగా తీసుకెళ్లవచ్చు. ఇందుకు సంబంధిత అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి వారిని 'పర్సన్స్ విత్ బెంచ్‌మార్క్ డిజేబిలిటీస్' (పీడబ్ల్యూబీడీ) అభ్యర్థులుగా వ్యవహరిస్తారు. 40 శాతం ప్రామాణికత కన్నా తక్కువ వైకల్యం ఉన్న 'పర్సన్స్ విత్ డిజేబిలిటీస్' (పీడబ్ల్యూడీ) అభ్యర్థులు కూడా స్క్రైబ్‌లను వినియోగించుకోవచ్చని సోమవారం జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఆదేశించింది. దీనిని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని తెలిపింది. పరీక్షలు నిర్వహించే అన్ని సంస్థలూ దీన్ని పాటించాలని పేర్కొంది. ఇలాంటి సమస్యలు కోర్టు వరకు రాకుండా ముందుగానే పరిష్కరించేందుకు వీలుగా పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రస్తుతం ఆరు నెలలకు చెల్లుబాటు అయ్యేలా స్క్రైబ్ సర్టిఫికెట్ ఇస్తుండగా ఆ గడువును పెంచాలని ఆదేశించింది.

అటవీ విస్తీర్ణం తగ్గించే ఎలాంటి చర్యలూ చేపట్టొద్దు

- ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అడవుల విస్తీర్ణాన్ని తగ్గించే ఎలాంటి చర్యలూ చేపట్టకూడదని సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో అటవీ భూమిని వేరే అవసరాలకు మళ్లిస్తే వెంటనే ప్రత్యామ్నాయంగా మరో చోట అడవిని పెంచాలని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన వన సంరక్షణ, సంవర్ధన నిబంధనలు-2023 కారణంగా 1.97 లక్షల చ.కి.మీ. భూమిని 'అడవుల' నిర్వచనం పరిధి నుంచి తప్పించారంటూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. విశ్రాంత ఇండియన్ ఫారెస్టు సర్వీసు అధికారులు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. 'అడవి'కి ఉన్న నిర్వచనాన్ని మార్చి ఇతర అవసరాల కోసం భూమిని కేటాయిస్తున్నారని ఆ పిటిషన్‌లో ఆరోపించారు.

నిర్బంధ కేంద్రాల్లో 'వారు' ఎన్నాళ్లు?

విదేశీయులను పంపేందుకు ముహూర్తం కోసం చూస్తున్నారా?.. అసోం సర్కారుపై సుప్రీం ఫైర్

- పరాయి దేశస్థులుగా గుర్తించాక వారి దేశాలకు పంపాల్సిందే
- అడ్రస్‌లు తెలియడం లేదంటే అది మా సమస్య కాదు: సుప్రీం



ఇదీ వ్యాజ్యం..

అసోం నిర్బంధ కేంద్రాల్లో ఉన్న విదేశీయులను స్వదేశాలకు పంపాలని.. వారికి ఆహారం, వసతి తగురీతిలో లేవని.. వారిని స్వదేశాలకు అప్పగించబోతున్నట్లు రుజువు చూపేవరకు.. ఏ ఒక్కరినీ అసోం ప్రభుత్వం నిర్బంధించకుండా ఆదేశాలివ్వాలని పిటిషన్‌లో సుప్రీంకోర్టును కోరారు. దీనిపై నిరుడు మే 16న న్యాయస్థానం విచారణ చేపట్టింది. ప్రధానంగా మటియా నిర్బంధ కేంద్రంలో ఉన్న విదేశీయులను వారి దేశాలకు పంపేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. విదేశీయుల నిర్బంధానికి గల కారణాలు చెప్పాలని ఆదేశించగా..రాష్ట్రప్రభుత్వం జవాబివ్వకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: విదేశీయులుగా ప్రకటించిన వ్యక్తులను వారి స్వదేశాలకు పంపకుండా.. నిరవధికంగా నిర్బంధ కేంద్రాల్లో ఉంచడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఏదైనా ముహూర్తం కోసం చూస్తున్నారా అని అసోం ప్రభుత్వంపై మండిపడింది. ఈ వ్యవహారంలో రాష్ట్రప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని వ్యాఖ్యానించింది. ఒకసారి బందీలను పరాయి దేశస్థులుగా గుర్తించిన తర్వాత.. వారిని తక్షణమే వారి దేశాలకు పంపేయాలని స్పష్టం చేసింది. అసోంలో విదేశీయులుగా ప్రకటించినవారిని స్వదేశాలకు పంపడం.. వారున్న నిర్బంధ కేంద్రాల్లో ఆహార, వసతి సౌకర్యాలపై దాఖలైన పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన అసోం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రవి కోటాపై ప్రశ్నల వర్షం కురిపించింది. 'బందీల చిరునామాలు తెలియడం లేదంటూ వారిని ఆయా దేశాలకు పంపడానికి మీరు నిరాకరిస్తున్నారు. ఇది మా సమస్య ఎలా అవుతుంది? వారి దేశానికి వారిని పంపేయాల్సిందే. ఏదైనా శుభముహూర్తం కోసం చూస్తున్నారా? ఒకసారి ఒకరిని విదేశీయుడిగా ప్రకటించాక తదుపరి చట్టబద్ధమైన చర్యకు మీరు ఉపక్రమించాలి. శాశ్వతంగా వారిని నిర్బంధించి ఉంచలేరు. రాజ్యాంగంలోని 21వ అధికరణ ఇక్కడ ఉంది. అసోంలో చాలా నిర్బంధ కేంద్రాలు ఉన్నాయి. ఎంతమందిని మీరు విదేశాలకు పంపించారు' అని అసోం తరపు న్యాయవాదిని అడిగింది. అడ్రస్‌లు తెలియకుండా వారిని పంపలేమని ఆయన నిస్సహాయత వ్యక్తం చేయడంతో.. చిరునామాలు లేకపోయినా వారిని వెనక్కి పంపవచ్చని ధర్మాసనం తెలిపింది. 'వారి దేశ రాజధానికి పంపేయండి. ఒకవేళ ఫలానా బందీ పాకిస్థాన్‌కు చెందినవాడైతే ఆ దేశ రాజధాని ఏదో మీకు తెలుసు కదా! విదేశాల్లో వారి చిరునామా తెలియదని ఎన్నాళ్లు వారిని నిర్బంధిస్తారు? ఇలాగైతే ఎప్పటికీ అడ్రస్ తెలుసుకోలేరు. ఇన్నేళ్లు నిర్బంధంలో ఉంచి ఖజానా నుంచి ఖర్చుపెడుతున్నారు' అని వ్యాఖ్యానించింది. విదేశీయులుగా ప్రకటించి.. జాతీయతను గుర్తించిన 63 మందిని స్వదేశాలకు పంపించే ప్రక్రియను రాష్ట్రప్రభుత్వం ప్రారంభించాలని ఆదేశించింది. రెండు వారాల్లో స్థాయీనివేదికను సమర్పించాలని నిర్దేశించింది. 'మా ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం సవ్యమైన అఫిడవిట్ దాఖలు చేయాలి' అని పేర్కొంది.

వారిని బంగ్లాదేశ్ తీసుకోవడం లేదు!

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కొలిన్ గొంజాల్వెజ్ వాదనలు వినిపించారు. కొందరు బందీలను తన దేశీయులుగా గుర్తించడానికి బంగ్లాదేశ్ నిరాకరించిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 'వారు భారతీయులు కాదని భారత్ అంటుంటే.. బంగ్లా జాతీయులు కాదని ఆ దేశం అంటోంది. వారిప్పుడు అనాథలుగా మారారు' అని తెలిపారు. బందీలు రోహింగ్యాలని.. ఈ విషయంలో కేంద్రం, రాష్ట్రం కోర్టుకు నిజాలు చెప్పాలని కోరారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా జోక్యం చేసుకుని.. అసోం అఫిడవిట్‌లో లోపాలు చోటుచేసుకోవడంపై క్షమాపణ చెప్పారు. అత్యున్నత అధికారితో మాట్లాడి అన్ని వివరాలూ కోర్టుకు సమర్పిస్తానని తెలిపారు. దీంతో.. ఇంతవరకు ఎంత మంది విదేశీయులను వారి దేశాలకు పంపించారు.. ఆ దేశం వారో తెలియనివారి విషయంలో ఏం చేస్తారో కేంద్రం కూడా వివరాలు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదావేసింది.

90 రోజులు దాటినా ఎన్ఐఏ కేసుల్లో అప్పీళ్లకు అనుమతి

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చట్టం కింద నమోదైన కేసుల్లో అప్పీళ్లు చేసుకునే విషయమై మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఆదేశాలు, తీర్పులు వెలువడిన 90 రోజుల తరువాత కూడా వాటిని సవాలు చేస్తూ అప్పీళ్లు చేసుకోవచ్చని తెలిపింది. 90 రోజుల గడువు దాటిందన్న కారణంతో అప్పీళ్లను తిరస్కరించలేరని ధర్మాసనం తెలిపింది. ఎన్ఐఏ చట్టం-2008లో అప్పీళ్లకు గడువు విధించిన సెక్షన్ 21(5) రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది.

తెలంగాణలో మాదిగలకు 9 శాతం రిజర్వేషన్

- మాల, ఉప కులాలకు 5.. ఇతరులకు 1 శాతం
- 3 గ్రూపులుగా ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. షెడ్యూల్డు కులాల్లో సంఖ్యాపరంగా అధికంగా ఉన్న మాదిగ, ఉప కులాలకు 9 శాతం రిజర్వేషన్లు ఖరారు చేసింది. మాల, ఉప కులాలకు 5 శాతం; అత్యంత వెనకబడిన బుడ్గ జంగం తదితర కులాలకు ఒక శాతం రిజర్వేషన్‌ను కేటాయించింది. ఈ మేరకు ఎస్సీ వర్గీకరణపై నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నివేదికను తొలుత క్యాబినెట్‌లో, ఆ తర్వాత అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించింది. తద్వారా, సుప్రీం కోర్టు తీర్పు అనంతరం ఎస్సీలను వర్గీకరించి, రిజర్వేషన్లను ఖరారు చేయడంలో దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కమిషన్ సిఫారసు చేసినా.. వర్గీకరణలో క్రీమీలేయర్ విధానాన్ని అమలు చేయడం లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు గత ఏడాది ఆగస్టు ఒకటో తేదీన ఇచ్చిన తీర్పుపై స్పందించిన తెలంగాణ ప్రభుత్వం.. వర్గీకరణకు కట్టుబడి ఉన్నట్లు అదే రోజు ప్రకటించిన విషయం తెలిసిందే. ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరిస్తున్నట్లు అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించింది. ఆయా వర్గాలు, జనాభా, సామాజిక, ఆర్థిక, విద్య తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మొత్తం 59 కులాలను వర్గీకరించినట్లు తెలిపింది. దాని ప్రకారం.. అత్యంత వెనకబడిన 15 కులాలను గ్రూప్-1గా పేర్కొంది. ఎస్సీల్లో వారి జనాభా 3.288 శాతం. వీరికి 1 శాతం రిజర్వేషన్ కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఇక, మాదిగ, 18 ఉప కులాలను గ్రూప్-2గా పేర్కొంది. వాటి జనాభాను 62.748 శాతంగా పేర్కొంది. ఈ కులాల్లో ఒక్క మాదిగల జనాభా శాతమే 61.967 శాతం (32,33,642)గా పేర్కొంది. ఈ గ్రూపులోని మాదిగ, ఉప కులాలకు 9 శాతం రిజర్వేషన్‌ను ఖరారు చేసింది. ఇక, మాల, 26 ఉప కులాలను కలిపి గ్రూప్-3గా వర్గీకరించింది. ఎస్సీల్లో వారి జనాభాను 33.963 శాతంగా పేర్కొంది. వీరిలోనూ ఒక్క మాలల జనాభానే 29.265 శాతం (15,27,143)గా వివరించింది. మాల, ఇతర ఉప కులాలకు కలిపి 5 శాతం రిజర్వేషన్‌ను కేటాయించింది. ఎస్సీ వర్గీకరణలో భాగంగా రిజర్వేషన్‌తోపాటు క్రీమీలేయర్ విధానాన్ని కూడా అమలు చేయాలని ఏక సభ్య కమిషన్ సిఫారసును ప్రభుత్వం తిరస్కరించింది.

ట్రంప్ ట్రేడ్ వార్‌కు జిన్‌పింగ్ సై!

- అమెరికా నుంచి వచ్చే బొగ్గు, ఎల్ఎన్‌జీపై 15% సుంకం విధించనున్నట్లు చైనా ప్రకటన

బీజింగ్, ఫిబ్రవరి 4: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ట్రేడ్ వార్'కు చైనా సై అంది. అమెరికా నుంచి చైనాకు దిగుమతి అయ్యే బొగ్గు, ద్రవ రూపంలోని సహజవాయువు(ఎల్ఎన్‌జీ) ఉత్పత్తులపై 15% సుంకం విధిస్తామని ప్రకటించింది. ముడిచమురు, వ్యవసాయ యంత్రాలు, భారీ ఇంజన్లతో తయారైన కార్లపై 10శాతం టారిఫ్ విధిస్తామని తెలిపింది. అంతే కాకుండా, అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతోందంటూ టెక్ దిగ్గజం గూగుల్‌పై విచారణకు సిద్ధమైంది. పీవీహెచ్ కార్పొరేషన్, ఇల్యూమినా లాంటి సంస్థలను 'నమ్మదగిన కంపెనీలు కావు' అన్న జాబితాలో చేర్చింది. అరుదైన ఖనిజ వనరులను అమెరికాకు ఎగుమతి చేయడంపైనా ఆంక్షలు విధిస్తామని చైనా ప్రకటించింది. చైనా సరుకులపై 10% సుంకం విధిస్తామని ట్రంప్ ఇప్పటికే ఉత్తర్వులపై సంతకం చేసిన సంగతి తెలిసిందే. ఇది మంగళవారం నుంచే అమల్లోకి వచ్చింది.



నందిగామ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన మండవ కృష్ణకుమారికి ధ్రువపత్రం అందజేస్తున్న ఆర్డీవో బాలకృష్ణ, పక్కన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

ఆ 'రెండూ' కూటమి కైవసం!

- నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుపతి డిప్యూటీ మేయర్ పీఠాలు సొంతం
- నందిగామలో వైసీపీ అభ్యర్థికి మూడు ఓట్లు



తిరుపతి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్సీ మునికృష్ణ

నందిగామ/తిరుపతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సోమవారం వాయిదా పడిన రెండు స్థానాలూ కూటమికే దక్కాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మునిసిపల్ చైర్ పర్సన్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పీఠాలను టీడీపీ కైవసం చేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి ఎన్నికయ్యారు. సోమవారం జరగాల్సిన ఎన్నిక అనివార్య కారణాల వల్ల వాయిదా పడడంతో మంగళవారం నందిగామలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించారు. దీనికి 18 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యురాలి హోదాలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య హాజరయ్యారు. ఎన్నికల అధికారి, ఆర్డీవో కె. బాలకృష్ణ ఎన్నిక నిర్వహించారు. కూటమి అభ్యర్థిగా పదో వార్డుకు చెందిన మండవ కృష్ణకుమారి పేరును సౌమ్య ప్రతిపాదించారు. ఆమెకు మద్దతుగా 14 మంది కౌన్సిలర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యురాలు ఓటు వేశారు. ఆమెకు మొత్తం 15 ఓట్లు వచ్చాయి. వైసీపీ తరపున చైర్‌పర్సన్ బరిలో నిలిచిన ఓర్సు లక్ష్మికి మూడు ఓట్లు మాత్రమే వచ్చాయి. లక్ష్మి తన ఓటు తాను వేసుకోకుండా తటస్థంగా ఉండిపోయారు. మెజారిటీ సభ్యుల బలం ఉన్న మండవ కృష్ణకుమారి చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్టు ఆర్డీవో ప్రకటించారు. ఆమెకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

తిరుపతిలో..

తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికపై ఉత్కంఠకు తెరపడింది. నాటకీయ పరిణామాలు, ఉద్రిక్తతల మధ్య డిప్యూటీ మేయర్ పదవిని టీడీపీ కైవసం చేసుకుంది. మంగళవారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్లో జరిగిన ఎన్నికలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో 47 మంది కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్‌అఫిషియో సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 48 మంది ఎన్నికకు హాజరుకాగా ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఉన్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, ఒక మహిళా కార్పొరేటర్ గైర్హాజరయ్యారు. హాజరైన వారిలో 26 మంది టీడీపీ అభ్యర్థికి, 21 మంది వైసీపీ అభ్యర్థికి మద్దతు పలకగా ఒకరు తటస్థంగా ఉండిపోయారు.

కోళ్లపై వైరస్ పంజా

- 'పశ్చిమ'లో లక్షల్లో మృత్యువాత
- పడిపోయిన కోడిగుడ్ల ఉత్పత్తి
- ఆందోళనలో యజమానులు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ పరిశ్రమపై వైరస్ దాడి చేస్తోంది. రోజూ వేల సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయి. పౌల్ట్రీ పరిశ్రమను ఈ వైరస్ కోలుకోలేని దెబ్బతీస్తోంది. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో పందెం కోళ్లపై ఆర్‌డి వైరస్ దాడి చేయగా, అప్పట్లో పౌల్ట్రీల యజమానులు అప్రమత్తమయ్యారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఈ కోళ్లకు మరో వైరస్ సోకడంతో లక్షల్లో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. వైద్యుల సూచిస్తున్న మందులన్నీ వాడుతున్నా.. వ్యాధి అదుపులోకి రావడం లేదు.



తాడేపల్లిగూడెంలోని ఓ పౌల్ట్రీ వద్ద చనిపోయిన కోళ్లను పూడ్చేస్తున్న దృశ్యం

కష్టకాలం..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం, భీమడోలు, ఉంగుటూరు, కొల్లేరు ప్రాంతాల్లో పౌల్ట్రీ ఫారాలు ఉండగా, వాటిలో కోటి 30 లక్షల వరకూ కోళ్లు ఉన్నాయి. వాటిలో సుమారు 20 లక్షల కోళ్లు వైరస్‌తో చనిపోయినట్టు తెలుస్తోంది. ఇప్పటివరకూ రోజుకు కోటి ఐదు లక్షల గుడ్లు ఉత్పత్తికాగా.. ప్రస్తుతం 85 లక్షలకు పడిపోయినట్టు తెలిసింది. ఇదే పరిస్థితి కొనసాగితే పౌల్ట్రీ రంగం కుదేలవుతుందని, దీని నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పౌల్ట్రీ రైతులు కోరుతున్నారు.

పౌల్ట్రీ ఫారాల వద్ద లాక్‌డౌన్

పౌల్ట్రీ పరిశ్రమపై వైరస్ పంజా విసురుతుండటంతో పౌల్ట్రీ ఫారాల వద్ద లాక్‌డౌన్ చర్యలు చేపట్టారు. ఇందుల్లో భాగంగా బయట వ్యక్తులు, వస్తువులను పౌల్ట్రీ కాంపౌడ్‌లోకి వెళ్లనివ్వడంలేదు. ఫారం చుట్టుపక్కల 100 మీటర్ల వరకూ ఫార్మలిన్ మందును పిచికారి చేస్తున్నారు. ఫారం లోపల క్యూఫర్ ఆల్ మందు చల్లుతూ వైరస్‌ను అదుపు చేసే చర్యలు చేపడుతున్నారు. అత్యవసరంగా ఫారంలోకి వెళ్లాల్సినవారిని ప్రత్యేక కెమికల్‌లో చేతులు శుభ్రం చేసుకుంటేగానీ రానీయడం లేదు.

పౌల్ట్రీఫారాల్లోనే ఎక్కువ చనిపోతున్నాయి

- వెటర్నరీ డైరెక్టర్ దామోదరనాయుడు

అమరావతి: పెరటి కోళ్లలో కంటే పౌల్ట్రీ ఫారాల్లో కోళ్ల మరణాలే ఎక్కువగా ఉంటున్నాయని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదరనాయుడు తెలిపారు. ఏటా డిసెంబరు- ఫిబ్రవరి మధ్య కోళ్ల మరణాలు ఉండేవని, ఈ ఏడాది వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉందని చెప్పారు. ఈ ఏడాది కొల్లేరు ప్రాంతానికి వలస పక్షులు ఎక్కువగా రావడం, పౌల్ట్రీ రైతులు జీవ భద్రతా చర్యలు పాటించకపోవడం, చనిపోయినవాటిని శాస్త్రీయంగా పూడ్చిపెట్టకపోవడం, అంటువ్యాధుల వ్యాప్తితో కోళ్ల మరణాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అయితే కోడిగుడ్లు, మాంసం వల్ల ప్రాణ హాని, ఆరోగ్య సమస్యలు వచ్చిన సమాచారం లేదని చెప్పారు. ఎలాంటి అపోహలు లేకుండా ఉడికించిన కోడిగుడ్లు, మాంసం వినియోగించవచ్చని సూచించారు. పౌల్ట్రీల నిర్వహణపై యాజమానులకు అవగాహన కల్పిస్తున్నామని, చనిపోయిన కోళ్ల నుంచి నమూనాలు సేకరించి, వ్యాధి నిర్ధారణకు భోపాల్‌లోని హై సెక్యూరిటీ ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

పౌల్ట్రీ రంగానికి పునరుజ్జీవం కల్పించండి

- గత ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టేసింది
- సీఎం చంద్రబాబును కోరిన ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేలా గత ప్రభుత్వం తెచ్చిన పౌల్ట్రీ పాలసీని పునఃసమీక్షించి, రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని పునర్జీవింపచేయాలని ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేసింది. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును ఫెడరేషన్ అధ్యక్షుడు కె.సుబ్బారావు, ఉపాధ్యక్షుడు టి.కుటుంబరావు, సహాయ కార్యదర్శి పి.సుబ్బారెడ్డి, సభ్యులు జి.గంగాధరరావు, జి.సుబ్రహ్మణ్యం కలిశారు. రాష్ట్రంలో లేయర్ పౌల్ట్రీ ఫార్మర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ రంగానికి చేయూత అందించాలని కోరారు. కోళ్ల దాణాకు వినియోగించే మొక్కజొన్నపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా వినహాయించేలా కేంద్రానికి లేఖ రాయాలని, మార్కెట్‌లో కోడిగుడ్ల ధరలను తారుమారు చేసే విధానాలను నియంత్రించడానికి పౌల్ట్రీ రైతులు, గుడ్ల వ్యాపారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని, 2018-19లో పౌల్ట్రీ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.45.65 కోట్ల రాయితీ నిధులు విడుదల చేయాలని, రుణాలను ఏడాదిపాటు రీషెడ్యూల్ చేయాలని, ప్రతి జిల్లాలో కోళ్ల వ్యాధుల నిర్ధారణ, నివారణ చర్యలు చేపట్టాలని, కల్తీ మందుల నివారణ చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని సీఎంకు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

నాపై కేసులు కొట్టేయండి

- హైకోర్టులో వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిటిషన్లు

అమరావతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కావలి, వేదాయపాలెం పోలీసుస్టేషన్లలో తనపై నమోదైన రెండు కేసులను కొట్టివేయాలని కోరుతూ వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు వేశారు. ఈ కేసుల్లో తదుపరి చర్యలు నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. టీడీపీ నేతలను వదిలిపెట్టేది లేదని, పోలీసుల పాపాలు వారికి శాపాలు గా మారుతాయంటూ కాకాణి చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేత ఒంటేరు ప్రసన్నకుమార్ ఫిర్యాదు ఆధారంగా నెల్లూరు జిల్లా కావలి పట్టణ పోలీసులు కేసు నమో దు చేశారు. వెంకటాచలం ఇన్‌స్పెక్టర్ సుబ్బారావుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని పద్మయ్య ఇచ్చిన ఫిర్యాదుపై వేదాయపాలెం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ ఏపీ అధ్యక్షుడిగా వాసుపల్లి సంతోష్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా వాసుపల్లి సంతోష్‌కు అవకాశం లభించింది. ఈ మేరకు మంగళవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

'పాలకొండ చైర్‌పర్సన్' ఎన్నికపై వాదనలు పూర్తి

- తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా.. పాలకొండ నగర పంచాయితీ చైర్‌పర్సన్ ఎన్నికపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరు పక్షాల వాదనలు ముగియడంతో న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. సుజాత మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. పార్వతీపురం మన్యంజిల్లా పరిధిలోని పాలకొండ నగర పంచాయితీ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం రాష్ట్ర ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే.. దీనిని సవాల్ చేస్తూ ఎం. స్వర్ణకుమారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నగర పంచాయితీ పరిధిలోని 19వ వార్డుకు ఉప ఎన్నిక నిర్వహించేవరకు చైర్‌పర్సన్ ఎన్నిక జరపకుండా నిలువరించాలని కోరారు. ఈ వ్యాజ్యం హైకోర్టులో విచారణకు రాగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. "చైర్ పర్సన్ పదవి ఎస్టీలకు రిజర్వ్ చేశారు. 19వ వార్డుకు ఉప ఎన్నిక నిర్వహిస్తే పిటిషనర్ ఎన్నికల్లో పోటీ చేస్తారు. ఇతర సభ్యుల మద్దతుతో చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యే అవకాశం కూడా ఉంది." అని వివరించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి, స్టాండింగ్ కౌన్సిల్ వల్లభనేని శిరీష వాదనలు వినిపిస్తూ.. "వ్యాజ్యం దాఖలు చేసే అర్హత పిటిషనర్‌కు లేదు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదు. ప్రస్తుతం ఉన్న వార్డు సభ్యుల్లో ఎస్టీ మహిళ ఉన్నారు. చట్ట నిబంధనల ప్రకారం కోరం ఉన్నప్పుడు ఖాళీలతో సంబంధం లేకుండా చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించవచ్చు." అని పేర్కొన్నారు.

అచ్చన్నపాలెంలో భారీ చోరీ

నల్లజర్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంలో దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన వట్టికూటి సీతారామకృష్ణ, రామలక్ష్మి దంపతుల ఇంట్లోకి ప్రవేశించి 48 కాసుల బంగారు అభరణాలు, రూ.2 లక్షల నగదు దోచుకున్నారు. పోలీసు డాగ్ స్క్వాడ్ పసిగట్టకుండా వెంట తెచ్చుకున్న కారంపొడి గది అంతా చల్లారు. నగదు, బంగారం చోరీకి గురైనట్టు గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, క్రైం ఏఎస్పీ ఎల్.అర్జున్, సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నేడు 'అనంత'లో హార్టికల్చర్ కాంక్లేవ్

అనంతపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించే 'అనంత హార్టికల్చర్ కాంక్లేవ్' కార్యక్రమాన్ని బుధవారం అనంతపురం నగరంలో నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, వ్యవసాయం, కో-ఆపరేటివ్ సొసైటీస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతారు.



ఏఎస్‌జీ ధనంజయకు అభినందనలు తెలుపుతున్న ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్

ఏఎస్‌జీగా ధనంజయ బాధ్యతలు

అమరావతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)గా నియమితులైన సీనియర్ న్యాయవాది చల్లా ధనంజయ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు ఆయనకు అభినందనలు తెలిపారు. చల్లా ధనంజయ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం వాసి. కేంద్ర ప్రభుత్వం తరపున ఏపీ హైకోర్టులో వాదనలు వినిపించేందుకు ఆయన ఇటీవల ఏఎస్‌జీగా నియమితులయ్యారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తెలిసిన దయ్యమే కనుక, ప్రమాదం కూడా ఊహించినట్టుగానే ఉన్నది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండోరాకడతో ప్రపంచం ఇప్పటికే ఉత్పాతాలకు సిద్ధపడింది. గద్దెనెక్కగానే ఏం చేయబోతున్నానో ఆయన ముందుగానే చెప్పాడు. అమెరికాకి మళ్ళీ ఔన్నత్యాన్ని అద్దడానికి, గతకాలపు కీర్తిని తెచ్చి తలకు చుట్టడానికి ఇంటాబయటా కూడా సమూల ప్రక్షాళనకు ఒడిగడతానని ప్రమాణం చేశారాయన. అందులో భాగంగా అగ్రరాజ్యానికి తలవంపులు తెచ్చే వెకిలిపనులకు కూడా ఆయన వెనుకాడడం లేదు.

పన్నులు, సుంకాలతో ఆయన మిత్రులనూ, శత్రువులనూ ఉక్కిరిబిక్కిరి చేయడం ఆరంభించారు. అక్రమవలసదారులను కట్టకట్టి సైనిక విమానాల్లోకి తోసి సరిహద్దులను దాటించేస్తున్నారు. అనాదిగా అమెరికాతో అనుబంధం ఉన్న కెనడా, మెక్సికోలమీద పాతికశాతం సుంకాలు విధించి, శత్రుదేశం చైనామీద ప్రస్తుతానికి పదిశాతంతో సరిపెట్టాడాయన. అరవై శాతం సుంకాలతో చైనాకు ఊపిరాడకుండా చేస్తానని ఎన్నికల ప్రచారంలో చెప్పుకున్నా, ఎందుచేతనో వెనక్కుతగ్గారు. మెక్సికో దారికి వస్తున్నదనీ, సయోధ్య కుదిరితే సరేసరి, లేదంటే నెలరోజుల తరువాతైనా వాతలు తప్పవంటూ ఆ తరువాత ఆదేశాల అమలును వాయిదావేశారు ట్రంప్. అమెరికా అధ్యక్షుడి సుంకాలదాడికి ఈ మూడుదేశాలు చేతనైనమేరకు తక్షణ ప్రతీకారం తీర్చుకున్నాయి. అమెరికా తప్పుడు విధానాలమీద ప్రపంచ వాణిజ్యసంస్థలో అమీతుమీ తేల్చుకుంటానని చైనా అంటోంది. మొత్తానికి ట్రంప్ ఆరంభించిన వాణిజ్యయుద్ధం అంతర్జాతీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. చాలాదేశాల మార్కెట్ సూచీలు ఆదుర్దాగా కదులుతున్నాయి. త్వరలోనే యూరోపియన్ యూనియన్ వంతు వస్తుందని కూడా ఆయన ప్రకటించారు. అధ్యక్షుడి అంతిమలక్ష్యం మిగతాదేశాలను రాయబారానికి దించడం, లొంగివచ్చేవరకూ ఒత్తిడి పెంచడం కనుక ఈ వాణిజ్య యుద్ధానికి అంతా తయారుకాక తప్పదు. ఇప్పటికైతే భారతదేశం జోలికి రాకపోయినా, హార్లీడేవిడ్సన్ వంటి ఉదాహరణలతో, ఎత్తిపొడుపులతో, చిన్నాచితకా దాడితో ఆయన కార్యరంగాన్ని ఎప్పటినుంచో సిద్ధం చేసివుంచారు. ఆ విధానాలను కాస్తంత రుచి చూసిన అనుభవం కూడా ఉన్నది కనుక, ఏయే అంశాల్లో రాజీపడాలో, వేటిని రాజకీయంతో నెట్టుకురావాలో మనం గమనించుకోవాలి. ఈనెలలో మోదీ జరపబోయే అమెరికా పర్యటన, ఆలింగనం స్థాయికి ఎదిగిన ఇద్దరి స్నేహం ఈ విషయంలో ఎంతమేరకు ఉపకరిస్తుందో చూడాలి.

ట్రంప్ వీరంగం

ట్రంప్ సుంకాల యుద్ధానికి మిగతాదేశాలు మొదట్లో కాస్తంత తడబడినా, త్వరితంగానే తట్టుకొని నిలబడతాయి, ఎదురొడ్డిపోరాడతాయి. పెంచిన సుంకాల దెబ్బకు సరుకుల రాకడ తగ్గి, ధరలు పెరిగి సామాన్య అమెరికన్‌కు సెగ పుట్టడానికి కొంత సమయం పట్టవచ్చు. వలసజీవులమీద ఉక్కుపాదం మోపడం జనరంజకంగా ఉంటుందేమో కానీ, అమెరికా ఆర్థికాన్ని రక్షించదని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఆ శ్రామికజనం లేనిదే దేశం కదలదని ట్రంప్‌కు మాత్రం తెలియదా? రియల్ ఎస్టేట్ సహా చాలా రంగాల్లోకి తన వ్యాపారసామ్రాజ్యాన్ని విస్తరించిన ట్రంప్‌కు ఖర్చుతక్కువ కూలీలు ఏ అడ్డామీద దొరుకుతారో అవగాహన ఉండదా?

ఈ ఏరివేతలు, తరలింపులు ఎంతకాలం, ఏ స్థాయిలో సాగుతాయో తెలియదు కానీ, గద్దెనెక్కిన కొద్దిరోజులకే ట్రంప్ వీరంగం అవధులు దాటిపోతోంది. ప్రజాస్వామ్యానికీ, భావస్వేచ్ఛకు పుట్టినిల్లని చెప్పుకొనే అమెరికా పునాది విలువలను ఆయన కుదిపేస్తున్నారు. ఏ ఆదర్శాలకు, ఆశయాలకు స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ప్రతీగా నిలబడిందో వాటికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పదిహేనునెలల గాజాయుద్ధంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఎంత అమానవీయంగా వ్యవహరించారో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. అమెరికా, దాని మిత్రదేశాలు తప్ప, మిగతా ప్రపంచమంతా అక్కడ సాగిన మారణకాండకు తల్లడిల్లిపోయింది. ఈ యూదునాయకుడి ఆధ్వర్యంలో పాలస్తీనియన్ల ఊచకోతను అంతర్జాతీయ సంస్థలూ సంఘాలూ ఖండించాయి. తక్షణమే యుద్ధం ఆగాలనీ, ఆకలితో అల్లాడుతున్నవారికి అన్నం అందాలనీ ఘోషించాయి. అమెరికన్ యూనివర్సిటీల్లో గాజా ఊచకోతలకు వ్యతిరేకంగా విద్యార్థులు సాగించిన ఉద్యమం ఎలా చూసినా హద్దులు దాటిందేమీ లేదు. అమెరికా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు ప్రతీకగా ఆ దేశానికి మంచిపేరు తెచ్చిందే తప్ప, అవమానించిందేమీ లేదు. కానీ, నిరసనల్లో పాల్గొన్నవారిని స్వదేశాలకు తిరిగి పంపించేయాలన్న ట్రంప్ నిర్ణయం ఇజ్రాయెల్‌ను సంతృప్తిపరచవచ్చు, నెతన్యాహూను మెప్పించవచ్చు కానీ, అమెరికాపరువు దిగజార్చింది.

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు నిధుల కేటాయింపు సమృద్ధిగా ఉంటేనే ప్రపంచ వ్యాప్తంగా భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలు నెరవేరుతాయి. ఈ కీలక శాఖకు 2024–25 సవరించిన బడ్జెట్‌లో నిధుల కేటాయింపు రూ. 25,277 కోట్లు కాగా 2025–26లో రూ.20,516 కోట్లు మాత్రమే కేటాయించారు!

దౌత్య విధులకు నిధుల కోత!

అంకితభావం, చిత్తశుద్ధి, సహనం, జిజ్ఞాస... ఈ నాలుగు అంశాలు భారతీయులకు దేవుడు ఇచ్చిన వరం. అగ్రరాజ్యం అమెరికా మొదలు ఆఫ్రికాలోని ఇథియోపియా దాకా ప్రపంచం నాలుగు దిక్కుల్లోను భారత వైభవం పరిఢవిల్లడానికి ఆ విశిష్టతలే ఒక ప్రధాన కారణం. వైద్య రంగం, నిర్మాణ, ఐ.టి రంగాలలో ప్రపంచవ్యాప్తంగా భారత్ గౌరవాదరాలు పొందడంలో విదేశాలలోని భారతీయ యువత పాత్ర కీలకమైనది, ప్రశస్తమైనది, అభినందనీయమైనది. ఇటువంటి స్నేహ వారధి వ్యవస్థ మరే దేశానికి లేదనడంలో అతిశయోక్తి లేదు.

విశ్వ గురువు మన మాతృభూమి అని మనం సగర్వంగా చెప్పుకుంటున్నాం. అందుకు తగినట్లుగా ప్రధాని మోదీ అంతర్జాతీయ దౌత్య వ్యవహారాలలో నిరంతరం నిమగ్నమై

గల్ఫ్ లేఖ

ఉంటారు. భారత్ ప్రతిష్ఠను ఇనుమడింపచేయడానికి ఆయన చేయని ప్రయత్నాలు లేవు. దేశ ప్రతిష్ఠ, వైభవాన్ని చాటి చెబుతూ సమస్త దేశాలతోను ద్వైపాక్షిక సంబంధాలు పెంపొందించుకోవడం ద్వారా జాతి ప్రయోజనాలను సాధించుకోవాలి. ఈ రాజనీతి కర్తవ్య నిర్వహణలో ఏ దేశానికైనా దాని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కీలకమైనది. అమెరికాతో సహా అనేక అభివృద్ధి చెందిన దేశాల ప్రాబల్యం నలుమూలలలో ఉండడానికి కారణం ఆయా దేశాల విదేశీ వ్యవహారాల శాఖలు తమ జాతీయ ప్రయోజనాలు పరిరక్షించుకోవడంలో వ్యూహాత్మకంగా వ్యవహరించే తీరుతెన్నులే.

అంతర్జాతీయ దౌత్య వ్యవహారాలలోకి భారత్ కంటే చాల వెనుక వచ్చిన చైనా వ్యూహాత్మకంగా భారత్‌ను మించిపోతోంది. మన పొరుగు దేశాలు మొదలు ఆఫ్రికా రాజ్యాల దాకా చైనా పై చేయి సాధించడంలో విజయవంతమవుతోంది. ఆఫ్రికాతో భారత్ సంబంధాలు చరిత్రాత్మకమైనవి అయినా మన తర్వాత చైనా అక్కడ ప్రవేశించి విస్తరించిన తీరు అనూహ్యం. చైనా ప్రభుత్వ దూకుడుకు తోడుగా భారత్ తరహా ప్రవాస యువత ఆ దేశానికి ఉంటే ఆ కమ్యూనిస్టు రాజ్యం పలుకుబడి ప్రపంచ వ్యాప్తంగా ఎంత అధికంగా ఉండేదో ఊహించడం కూడ కష్టం.



భారత్ విదేశీ వ్యవహారాల శాఖలో ప్రతిభా సామర్థ్యాలకు కొదవ లేదు. కార్యాచరణ విషయానికి వస్తే అది మాటలకు తగినట్లుగా లేదు! గతంతో పోల్చితే గడిచిన కొన్ని సంవత్సరాలుగా బడ్జెట్‌లో విదేశీ వ్యవహారాల శాఖకు మెరుగయిన కేటాయింపులు ఉంటున్నాయి, సందేహం లేదు. అయితే ప్రభుత్వం వక్కాణించే విశ్వగురువు ప్రచారానికి అనుగుణంగా కేటాయింపులు లేవు. ప్రపంచవ్యాప్తంగా దేశ ప్రతిష్ఠను చాటాలనుకుంటున్న ప్రభుత్వం తన మొత్తం బడ్జెట్‌లో కనీసం అర శాతం కేటాయింపులు కూడ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చేయలేదు.

ఈ కీలక శాఖకు 2025–26 బడ్జెట్‌లో రూ. 20,516 కోట్లు కేటాయించగా 2024–25 సవరించిన బడ్జెట్‌లో నిధుల కేటాయింపు రూ. 25,277 కోట్లు. అంటే ఈ సారి రూ. 4,761 కోట్ల కోత విధించారు! వ్యూహాత్మక మిత్ర దేశాలలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ఉద్దేశించిన కేటాయింపులు ఏటా నిరాశా జనకంగా ఉంటున్నాయి. ఈ సారీ అదే పరిస్థితి. శ్రీలంకకు రూ.300 కోట్లు, నేపాల్‌కు రూ. 700 కోట్లు, బంగ్లాదేశ్‌కు రూ. 120 కోట్లు కేటాయించారు. అదే విధంగా ఆఫ్ఘానిస్తాన్‌కు రూ. 100 కోట్లు, ఇరాన్–ఆఫ్ఘానిస్తాన్ సరిహద్దులోని చాబహార్ రేవు కేంద్రానికి రూ.100 కోట్ల కేటాయింపు జరిగింది. ప్రస్తుతం ఆఫ్ఘానిస్తాన్‌లోని తాలిబాన్ పాలకులకు పాకిస్థాన్ సర్కారుకు పడడం లేదు. పైగా ఇటీవల దుబాయిలో ఆఫ్ఘాన్ విదేశాంగ మంత్రితో భారత్ విదేశీ వ్యవహారాల కార్యదర్శి సమావేశమైన తర్వాత కూడ ఆ దేశానికి రూ. 100 కోట్లు మాత్రమే కేటాయించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. భారత్‌కు అన్ని విధాలుగా సహకరించే భూటాన్‌కు రూ. 2150 కోట్లతో విదేశీ సహాయంలో సింహభాగం ఆ కీలక హిమాలయ రాజ్యానికి కేటాయించడం ముదావహం. భూటాన్‌లో జలవిద్యుదుత్పత్తి, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలకు భారత్ నిర్మాణాత్మకంగా సహాయం అందిస్తుంది.

ఆధునికీకరణలో భాగంగా, పాస్‌పోర్టుల జారీలో విప్లవాత్మక మార్పులను సర్కారు అమలు చేస్తోంది. ఆధార్ కార్డుతో అనుసంధానం చేస్తూ ఎలక్ట్రానిక్ చిప్‌తో కూడిన పాస్ పోర్టులు జారీ చేస్తున్నారు. ఈ దృష్ట్యా పాస్‌పోర్టులు, ఇమ్మిగ్రేషన్ కొరకు ఈ సారి రూ. 1,913 కోట్లు కేటాయించారు. విదేశాలలోని భారతీయ ఎంబసీల నిర్వహణకు ఈ సారి 4,206 కోట్లు కేటాయించారు. గత ఏడాది కేటాయింపుల (రూ.3969 కోట్లు) కంటే అధికమైనా రూపాయి విలువ పతనమైన విషయాన్ని మరిచిపోకూడదు. పైగా ప్రవాసులు నానా ఇబ్బందులు ఎదుర్కొనే కీలక గల్ఫ్ దేశాలలో భారతీయుల సహాయార్థం అదనపు సిబ్బంది నియామకాలకు అవసరమైన నిధులు కేటాయించలేదు. గల్ఫ్‌లో ఏ దేశంలోనైనా న్యాయస్థానానికి వెళ్ళి భారతీయులకు సహకరించే దౌత్య ఉద్యోగులకుగాను ఒక్క వాహనం కొనుగోలుకు సైతం నిధులు కేటాయించలేదు. బడ్జెటులో విదేశాలలో ఇబ్బందులు ఎదుర్కొనే మహిళలకు సహాయ కార్యక్రమాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినా వాటికి కనీసం ఒక కోటి రూపాయలు సైతం ఇవ్వలేదు.

విశ్వగురువు, వికసిత్ భారత్ ఆశయాలకు అనుగుణంగా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు నిధుల కేటాయింపు సమృద్ధిగా ఉంటేనే ప్రపంచ వ్యాప్తంగా భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలు నెరవేరుతాయి. దేశ ప్రతిష్ఠ పెరుగుతుంది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

పన్ను రాయితీలతో ఆర్థికాభ్యుదయమా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

పాత పార్లమెంట్ భవనంలోని రీడింగ్ రూమ్ పై భాగంలో వివిధ సంస్థానాధీశుల రాచరిక చిహ్నాలు కనపడతాయి. స్వాతంత్ర్యం రాకముందు ఈ రీడింగ్ రూమ్ సంస్థానాధీశుల ఛాంబర్‌గా ఉండేది. రాజులు పోయారు, రాచరిక చిహ్నాలు పోయాయి. స్వాతంత్ర్యం తర్వాత సామాన్యులు పార్లమెంట్‌లో ప్రవేశించడం ప్రారంభమైంది. పుచ్చలపల్లి సుందరయ్య లాంటి నేతలు సైకిల్‌పై కూడా పార్లమెంట్‌కు వచ్చేవారు. మరి ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయి? సంస్థానాధీశులకు బదులు ఇప్పుడు కోట్లకు పడగెత్తినవారు పార్లమెంట్‌లో ప్రవేశిస్తున్నారు. తెలుగుదేశం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు సైకిల్‌పై పార్లమెంట్‌కు వస్తే అది ఒక అరుదైన దృశ్యంలా కనిపిస్తోంది. అసలు సంపన్నులు కాని వారు పార్లమెంట్ సభ్యులు కావడం అరుదుగా మారింది. 18వ లోక్‌సభలో 93 శాతం మంది ఎంపీలు కోటీశ్వరులైతే, కోటీశ్వరులు కానివారు పార్లమెంట్‌కు రావడం అసాధ్యమని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ తెలిపింది. రూ.10 కోట్లకు పైగా ఆస్తులు సంపాదించిన ఎంపీలు 42 శాతం మంది ఉన్నారు. లోక్‌సభ పరిస్థితి ఈ విధంగా ఉంటే, రాజ్యసభలో సంపన్నులు కానివారు ప్రవేశించడం అతి కష్టంగా మారింది. మొత్తం రాజ్యసభ సభ్యుల ఆస్తుల సగటు విలువ రూ.87 కోట్లు దాటితే బీజేపీకి చెందిన 90 మంది రాజ్యసభ ఎంపీల ఆస్తుల విలువ రూ.37 కోట్లకు పైగా ఉంటుంది. పట్టణాల్లో నివసించేవారి సగటు ఆస్తుల విలువ కంటే ఎంపీల ఆస్తులు 27 రెట్లు ఎక్కువ ఉంటుందని ఒక అధ్యయనం పేర్కొంది.

భారతదేశంలో సంపన్నులూ–మధ్యతరగతికీ మధ్య సంపద విషయంలో వ్యత్యాసం చట్టసభల్లోనే స్పష్టంగా కనబడుతుంది. ఒకప్పుడు కేవలం రూ. 10 కోట్లతోనే దేశం మొత్తం ఎన్నికలు జరిగేవి. ఇప్పుడు వేల కోట్లు ఎన్నికల్లో ప్రవహిస్తున్నాయి. సంపన్నులకు అన్ని రకాల రాయితీలు, లక్షల కోట్ల రుణాలు, ప్యాకేజీలు, నల్లధనం పెంచుకునేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. వారు ఎన్నికలను ప్రభావితం చేసేందుకు, చట్టసభల్లో ప్రవేశించేందుకు దోహదం చేస్తుంటే, సామాన్యులను శాంతింపచేసేందుకు రేషన్‌తో పాటు రకరకాల ఉచితాలు, పథకాలు, మహిళా సమ్మాన్ యోజన వంటి తాయిలాలు ప్రకటిస్తున్నారు. ఇదీ మన దేశ రాజకీయాల్లో పరిఢవిల్లుతున్న ప్రజాస్వామ్యం!

కేవలం సైద్ధాంతిక నిర్ణయాల ద్వారా భావోద్వేగాలను రేకెత్తించి మధ్యతరగతిని ఆకట్టుకోవడం సాధ్యపడదని బీజేపీ గ్రహించినట్లు కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ చట్టం, రామమందిర నిర్మాణం వంటివి ఎన్ని జరిగినా 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి అంతగా ప్రయోజనం కలగలేదు. ఏమీ ఖర్చుపెట్టకుండానే, రకరకాల పన్నుల ద్వారా వారి జేబులకు కత్తెర వేస్తూ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ, నిత్యావసర వస్తువులు ఆకాశానికి పెరిగిపోయినా విస్మరిస్తూ ఉంటే మధ్యతరగతి ఎంతకాలం మౌనం పాటిస్తారు? మెజారిటీ జీఎస్టీ వసూళ్లు మధ్యతరగతి నుంచే లభిస్తున్నాయని ఒక అంచనా. స్కూలు ఫీజుల్లో కూడా జీఎస్టీ వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. కార్పొరేట్లు చెల్లించే పన్నులకంటే వ్యక్తిగత పన్నుల వసూళ్లు దాదాపు రూ. 2లక్షల కోట్లు ఎక్కువ. వ్యక్తిగత పన్నుల వసూళ్లు 19 శాతం పెరిగితే కార్పొరేట్ పన్ను వసూళ్లు 7 శాతమే పెరిగాయి. ఇందుకు కారణం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలే. ఉదాహరణకు 2019 సెప్టెంబర్‌లో కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారు. బ్యాంకులకు లక్షల కోట్లు ఎగ్గొట్టిన సంపన్నులను ఏమీ చేయడం లేదనే ఒక అభిప్రాయం నెలకొని ఉన్నది. కార్పొరేట్లు తాము ఆర్జించిన మొత్తాన్ని పెట్టుబడులు పెడతారని, ఉద్యోగాలు కల్పిస్తారని ప్రభుత్వం ఆశించింది కాని అది జరగలేదు సరికదా. వారు తమ ఖజానాలు నింపుకున్నారు. గత దశాబ్దంలో తీవ్రమైన ద్రవ్యోల్బణం రీత్యా మధ్యతరగతి తమ ఆదాయాలు పెరగకపోవడాన్ని గమనించారు. వచ్చిన డబ్బులన్నీ మళ్లీ ఏదో రూపేణా లాగేసుకుంటున్నట్లు వారు గమనించారు.

బహుశా అన్ని విధాల నష్టపోతున్నది మధ్యతరగతి వారేనన్న అభిప్రాయం గత కొద్ది సంవత్సరాలుగా నెలకొని ఉన్నది. ఆ మధ్యతరగతిని శాంతింపచేయడం కోసమే రెండు రోజుల క్రితం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు స్పష్టమవుతోంది. పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశంలోని మధ్యతరగతి ఆకాంక్షలను నెరవేర్చినప్పుడే ఆర్థిక ప్రగతి సుసాధ్యమవుతుందని ప్రకటించారు. 'ఈ దేశ మధ్యతరగతి ప్రజలు, పేదలకు లక్ష్మీదేవి ఆశీర్వాదం లభిస్తుందని ఆశిస్తున్నాను..' అని బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజే మోదీ మీడియాతో అన్నారు.

బీజేపీ పట్ల మధ్యతరగతిలో ఒక రకమైన ఉదాసీనత పెరుగుతూ వస్తోంది. ఈ విషయం గ్రహించినందువల్లే బీజేపీ తన మార్గాన్ని మార్చుకుంది. ఒకప్పుడు ఉచితాలను వ్యతిరేకించిన మోదీ రాష్ట్రాల ఎన్నికల్లో ఉచితాలను ప్రకటించడానికి అనుమతించారు. ఇప్పుడు మధ్యతరగతిని కూడా ఆకట్టుకోవడం తప్పనిసరి అని బీజేపీ గ్రహించింది. ఢిల్లీ ఎన్నికలను మాత్రమే కాదు, రాబోయే ఎన్నికలను కూడా దృష్టిలో ఉంచుకుని దేశ వ్యాప్తంగా తన ఆర్థిక విధానాలపై అభిప్రాయాన్ని మార్చేందుకు మోదీ ప్రయత్నాలు ప్రారంభించినట్లు స్పష్టమవుతోంది. 'నేను కూడా మనిషిని. తప్పులు చేయడం సహజం. నేనేమీ దేవుడిని కాదు..' అని జనవరి మొదటి వారంలో ఒక పాడ్‌కాస్ట్‌లో నరేంద్రమోదీ అనడంలో అంతరార్థం ఆయన తదుపరి చర్యల్లో కనపడుతోంది. గత పదేళ్లుగా లేని ఆదాయ పన్ను మినహాయింపులను ప్రకటించడం ఇందుకు నిదర్శనం. మొత్తానికి మోదీ, ఆయన బృందం తమ తప్పులు సరిదిద్దుకోవడానికి పెద్దగా సమయం తీసుకోరని, రాజకీయంగా పట్టుకోల్పోకుండా చూడడమే వారి ప్రధాన లక్ష్యమని స్పష్టంగా అర్థమవుతుంది. అందుకే గిగ్ వర్కర్లతో సహా తమ ఓటు బ్యాంకుతో ముడిపడి ఉన్న పలు వర్గాలను సంతృప్తిపరిచేందుకు త్వరితంగా చర్యలు చేపట్టేందుకు ప్రయత్నించింది. ఒక్క



బిలియనీర్ల సంఖ్య పెరిగిపోతోంది. చట్టసభల్లో సంపన్నుల సంఖ్య సైతం అధికమవుతోంది. ఈ పరిణామాలు వ్యవస్థలకూ ప్రజలకూ మధ్య అంతరాలకు సంకేతాలు కావా? కేవలం పన్ను మినహాయింపులతో ఈ అగాధాలను అధిగమించగలుగుతామా?

బీమా రంగంలో వంద శాతం పెట్టుబడులను అనుమతించడం తప్ప ఏ రంగంలోనూ విధానపరమైన మార్పులు చేయలేదు. అభివృద్ధి పగ్గాలను ప్రైవేట్ రంగానికి అప్పగించాలని ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు తయారు చేసిన ఆర్థిక సర్వే చెప్పినప్పటికీ ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం ఆచితూచి చర్యలు తీసుకుంది. ఈ సారి పన్ను చెల్లించేవారికి రాయితీలు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టంగా చెప్పారని ఫైనాన్స్ సెక్రటరీ తెలిపారు.

భారతదేశంలో మధ్యతరగతి జనాభా రోజురోజుకూ పెరుగుతుందని ఒక అంచనా. జనాభాలో 31 శాతం మధ్యతరగతి వారే కాగా వారి సంఖ్య 2031 నాటికి 38 శాతం, 2047 నాటికి 70శాతానికి చేరుకుంటుందని, దాదాపు వంద కోట్ల మేరకు మధ్యతరగతి ప్రజలే ఉంటారని పీపుల్ రీసర్చ్ ఆన్ ఇండియన్ ఎకానమీ (ప్రైస్) వంటి సంస్థలు చెబుతున్నాయి. అందుకే పాశ్చాత్య బహుళ జాతి సంస్థల యజమానులు ప్రధానంగా ఎఫ్ఎంసిజి రంగానికి చెందిన వారి దృష్టి భారతదేశంపై పడుతోంది. 2019 ఎన్నికలతో పోలిస్తే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నష్టపోవడానికి కారణం మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ఓటర్లు బీజేపీకి దూరం కావడమేనని లోక్‌నీతి– సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సిఎస్‌డిఎస్) ఎన్నికల అనంతరం నిర్వహించిన సర్వేలో తేల్చింది. తక్కువ ఆదాయవర్గాలవారు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని, మధ్యతరగతి వర్గాల ఆదాయం పెరుగుతున్న కొద్దీ వారు బీజేపీకి ఎడం అవుతున్నారని ఈ సర్వే పేర్కొంది. మధ్యతరగతి ఓట్లలో మొత్తంగా 3 శాతం తగ్గినప్పటికీ లోక్‌సభలో మెజారిటీ సాధించలేకపోయింది. బీజేపీ పట్ల బలంగా ఉన్న 11 శాతం మధ్యతరగతి ఓటు దూరమైతే ఆ పార్టీ సమస్యలో పడుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2004లో మధ్యతరగతి ఓట్లు దూరమైనందువలన అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం ఓడిపోయిందని వారి అభిప్రాయం.

అయితే పన్ను మినహాయింపులు ప్రకటించినంత మాత్రాన మధ్యతరగతి సంతృప్తి చెందుతుందా అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేము. 2024లో దేశంలో కేవలం 8.6 కోట్ల మంది మాత్రమే ఆదాయపన్నును చెల్లించారు. అయినప్పటికీ ప్రభుత్వం మధ్యతరగతి వర్గాలకు అనుకూలంగా మారిందనే అభిప్రాయం ఏర్పర్చేందుకు ఈ చర్య ఉపయోగపడింది.. అనేకమంది పేదలు మధ్యతరగతి వర్గానికి మారుతున్నారని, అందువల్ల మధ్యతరగతిని సంతోషపెట్టే చర్యలు తీసుకోవడం సరైనదేనని తెలుగుదేశం అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బడ్జెట్‌పై ఢిల్లీలో వ్యాఖ్యానిస్తూ అన్నారు. అయితే అత్యధిక సంపన్నులు అట్టడుగు వర్గాలకు చేయూతనిచ్చే మార్గాలపై చర్చ జరగాలని, జీఎస్టీని సరళీకృతం చేయాలని ఆయన సూచించారు. అదే సమయంలో సంపద సృష్టించకుండా సంపదను పంచిపెట్టే విధానాలపై చర్చించాలని ఆయన కోరారు. ఎన్డీఏలో కీలక భాగస్వామి అయిన చంద్రబాబు సూచనలను ఎన్డీఏ ప్రభుత్వం సానుకూలంగా పట్టించుకునే అవకాశాలు లేకపోలేదు.

అదే సమయంలో దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, శ్రామిక శ్రేణుల్లో నవీన నైపుణ్యాలు కొరవడడం వంటివాటిపై కూడా వాస్తవప్రాతిపదికన ఒక రోడ్ మ్యాప్ (మార్గదర్శక ప్రణాళిక) రూపొందించాల్సిన అవసరం ఉన్నది. చట్టసభల్లో సామాన్యులు, మధ్యతరగతివారు ప్రవేశించేందుకు తగిన రాజ్యాంగ సంస్కరణలు తీసుకురావాల్సిన ఆవశ్యకత కూడా స్పష్టంగా కనిపిస్తోంది. బిలియనీర్ల సంఖ్య పెరిగిపోతోంది. చట్టసభల్లో సంపన్నుల సంఖ్య సైతం అధికమవుతోంది. ఈ పరిణామాలు వ్యవస్థలకూ ప్రజలకూ మధ్య అంతరాలకు సూచికలు కావా? కేవలం పన్ను రాయితీలు, మినహాయింపులతో ఈ అగాధాలను అధిగమించగలుగుతామా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

గోవా విమోచనలో రేడియో యోధురాలు

ఈ ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా ప్రకటించిన 139 మంది పద్మవిజేతలలో లిబియా లోబో సర్దేశాయి ఉండడంతో మళ్లీ గోవా విముక్తి పోరాటానికి దన్నుగా నిలిచిన సీక్రెట్ రేడియో 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' వార్తల్లోకి వచ్చింది. 2024 మే 25న తన నూరవ పుట్టినరోజును గోవా రాజధాని పనాజీ నగరంలో జరుపుకున్న అపురూప వనిత లిబియా లోబో. గోవాలో ప్రాక్టీస్ చేసిన తొలి లాయరు మాత్రమే కాదు; స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గోవా, దమన్, దయ్యు కేంద్రపాలిత ప్రాంతానికి టూరిజం డైరెక్టరుగా కూడా ఆమె సేవలందించారు. అంతేకాదు గోవా కాలేజ్ ఆఫ్ హోమ్ సైన్స్‌ను ప్రారంభించారు. ఆమె విలక్షణంగా నెలకొల్పిన గోవా ఉమెన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఇప్పటికీ కేవలం మహిళా ఉద్యోగులతో దిగ్విజయంగా నడుస్తోంది. Voz da Liberdabe అని పోర్చుగీసు భాషలో, Goenche SodvonechoAwaz పేరుతో కొంకణి భాషలో ప్రసారాలు చేసిన సీక్రెట్ రేడియో చరిత్ర అద్వితీయం.

1961 డిసెంబరు 19న గోవాకు స్వేచ్ఛ సిద్ధించిన వేళ అత్యంత ఆశ్చర్యమనిపించే సంఘటన జరిగింది. లిబియా లోబో, వామన్ సర్దేశాయి ఇద్దరూ విమానానికి రేడియో ట్రాన్స్‌మీటర్ బిగించి, ఇంకో లౌడ్ స్పీకర్ అమర్చి, పూలూ కరపత్రాలూ చల్లుతూ గోవా స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తూ రెండు గంటలపాటు ఆకాశయాన ప్రసారం చేశారు. 1955 నవంబరు 25న వారి ఆధ్వర్యంలో మొదలైన సీక్రెట్ రేడియో 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' గోవాకు స్వాతంత్ర్యం లభించిన రోజున విజయోత్సవంలో పాల్గొని, ఆ తర్వాత ప్రసారాలు ఆపివేసి విలువైన చరిత్రగా నిలిచింది.



1961 డిసెంబరు 19న గోవాకు స్వేచ్ఛ సిద్ధించిన వేళ అత్యంత ఆశ్చర్యమనిపించే సంఘటన జరిగింది. లిబియా లోబో, వామన్ సర్దేశాయి ఇద్దరూ విమానానికి రేడియో ట్రాన్స్‌మీటర్ బిగించి, ఇంకో లౌడ్ స్పీకర్ అమర్చి, పూలూ కరపత్రాలూ చల్లుతూ, గోవా స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తూ ఒక రెండు గంటలపాటు ఆకాశయాన ప్రసారం చేశారు! 1955 నవంబరు 25న వారి ఆధ్వర్యంలో మొదలైన సీక్రెట్ రేడియో 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' గోవాకు స్వాతంత్ర్యం లభించిన రోజు ఇలా విజయోత్సవంలో పాల్గొని, ఆ తర్వాత ప్రసారాలు ఆపివేసి విలువైన చరిత్రగా మారిపోయింది.

1510లో గోవా ప్రాంతం పోర్చుగీసు స్థావరంగా మారిపోయింది. బ్రిటీషువారు భారతదేశపు చాలా భాగాలు ఆక్రమించినా పాండిచ్చేరి ఫ్రెంచి వారి చేతిలోకి వెళ్ళిపోయినట్టు గోవా, దయ్యు, డమన్ పోర్చుగీసు చేతిలో ఉండిపోయాయి. గోవాకూ, మిగతా భారతదేశానికి పెద్దగా సంపర్కం లేకుండా సాగిపోయింది. 1932లో గోవా గవర్నర్‌గా యాంటోనియో డి ఒలివీరా సలాజార్ వచ్చిన తర్వాత ఆంక్షలు పెరగడం, ప్రజల హక్కులు హరించడం మొదలైంది. భారత్–పోర్చుగల్ సంబంధాలు రెండవ ప్రపంచ యుద్ధం అనంతర పరిణామాల మీద ఆధారపడి బెడిసికొట్టాయి. 1940వ దశకం నుంచి స్వాతంత్ర్య పోరాటం గురించి ఆలోచనలు, ప్రయత్నాలు మొదలయ్యాయి. 1954లో దాద్రానగర్, హవేలీ విముక్తి పొందడం కొత్త ఆలోచనలకు ద్వారాలు తీసింది. 1954లో గోవాకు విముక్తి కావాలని సరిహద్దు ప్రాంతంలో శాంతియుతంగా ప్రవేశించిన సత్యాగ్రహులను అప్పటి పోర్చుగీస్ క్రూరంగా చంపివేసింది. దాంతో 1955లో భారత ప్రభుత్వం 'ఎకనమిక్ బ్లాకేడ్' ప్రకటించాల్సి వచ్చింది. దీని ఫలితంగా గోవా బంగాళదుంపలను నెదర్లాండ్ నుంచి; కూరలు, బియ్యాన్ని పాకిస్తాన్ నుంచి, టీని శ్రీలంక నుంచి, వైన్‌ను పోర్చుగీసు నుంచి; సిమెంటును జపాన్ నుంచి; ఉక్కును బెల్జియం నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి ఏర్పడింది. 1961లో చేపలు పట్టే భారతీయుల పడవలపై గోవా కాల్పులకు దిగడంతో పరిస్థితి తారాస్థాయికి చేరింది.

గోవా లిబరేషన్ కోసం బొంబాయి నుంచి రహస్యంగా పోరాడుతున్న నికోలోవ్ మేనెంజీస్, వామన్ సర్దేశాయి, లిబియా లోబో కలసి రెండు వైర్లెస్ రేడియో సెట్లతో రేడియో ట్రాన్స్‌మిటర్‌ను సిద్ధం చేశారు. 1955 నవంబరు 25న ఉదయం 7 గం.లకు 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' అనే సీక్రెట్ రేడియోను వంద కిలోమీటర్ల దూరంలో ఉండే అంబోలి (Amboli) అడవుల నుంచి ప్రారంభించారు. తర్వాత మేనెంజీస్ ఆ బృందం నుంచి వెళ్లిపోవడంతో ప్రసారాలు 50 కిలోమీటర్లు దూరంలో ఉండే కన్నడ ప్రాంతం క్యాజువల్ రాక్‌కు మారాయి. ట్రాన్స్‌మీటర్‌ను ఒక ట్రక్కుకు బిగించి ప్రసారాలు చేసేవారు. గోవా అధికారికంగా చేసే ప్రాపగాండాను వమ్ము చేస్తూ నడిచిన ఈ సీక్రెట్ రేడియో ప్రసారాలకు భారతదేశంతోపాటు ఇతర దేశాల నుంచి కూడా మద్దతు లభించేది. ఆసియా, ఆఫ్రికా ఖండాలలో వలస పాలనకు వ్యతిరేకంగా నడిచే ఉద్యమాల వార్తలను కూడా ఇచ్చేవారు. ఈ విషయంలో గోవా ఒంటరి కాదనే భావం కలిగించి, ధైర్యం నూరిపోయడానికి వారి వార్తల పరిధిని పెంచారు. ఈ రేడియో ఇండియా భూభాగం నుంచి ప్రసారం అయ్యేది కనుక గోవాలో జరిగే పోరాటానికి మద్దతు ఇస్తూ భారతీయ నాయకుల ప్రసంగాలు కూడా ప్రసారం చేశారు. 1956 జూలై 15న వినోబాభావే తన రేడియో ప్రసంగంలో శాంతియుతంగా గోవాను వదిలి వెళ్ళిపొమ్మని పోర్చుగీసు వారిని కోరారు. భారత పార్లమెంటులో, ఇతర దేశాలలో ఈ విషయంపై జరిగే చర్చల సారాంశాలను కూడా శ్రోతలకు ఎప్పటికప్పుడు అందించేవారు.

1961 డిసెంబరులో ఆపరేషన్ విజయ్ మొదలయ్యాక 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' బృందం అడవుల నుంచి బెల్గాం ప్రాంతానికి వచ్చింది. ఆ సమయం నుంచి ప్రతి గంటకూ ప్రసారాలు చేశారు. గోవా ఆర్మీని ఉద్దేశించి భారత రక్షణమంత్రి వి.కె. కృష్ణ మీనన్ 1961 డిసెంబరు 15న ఈ సీక్రెట్ రేడియోలో ప్రసంగిస్తూ చర్చలకు ఆహ్వానించారు. భారత సైన్యం లోపలికే రాకుండా గోవా ఆర్మీ డిసెంబరు 17న బ్రిడ్జిని కూల్చివేసింది. సుమారు 36 గంటలు వాయు, సముద్ర, భూ తలాలపై కూడా భీకర పోరాటం నడిచింది. తర్వాత డిసెంబరు 19న గోవా ప్రాంతం భారత భూభాగంలో కలసిపోయింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం నుంచి 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' రేడియో బృందం గోవా విముక్తి వార్తను ఆకాశ మార్గం గుండా ప్రకటించింది.


1924 మే 25న పనాజీ నగరానికి దగ్గరలో ఉన్న పోర్వోరి గ్రామంలో లిబియా లోబో జన్మించింది. ఆమె కుటుంబం బొంబాయి తరలి వెళ్ళింది. అంబేడ్కర్ ప్రారంభించిన సిద్ధార్థ కళాశాల నుంచి డిగ్రీ పొందిన లిబియా లోబో రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఇటలీకి చెందిన కారాగారవాసుల ఉత్తరాలను చదివి పరిష్కరించేవారు. ఆల్ ఇండియా రేడియో, బొంబాయి కేంద్రంలో స్టెనోగానూ, లైబ్రేరియన్‌గానూ సేవలందించిన ఆమెకు కవి నిజీమ్ ఎజ్కిల్ ద్వారా ఎం.ఎన్.రాయ్ పరిచయమవడం విశేషం. గోవా విమోచన మూడవ వార్షికోత్సవం అంటే 1964 డిసెంబర్ 19న వామన్ సర్దేశాయి, లిబియా లోబో వివాహం చేసుకున్నారు. వామన్ సర్దేశాయ్ 1992లో పద్మశ్రీ పొందగా, లిబియా లోబో 2025లో ఆ అవార్డు పొందారు. 1994లో వామన్ సర్దేశాయి మరణించిన తర్వాత ఆయన పేరిట పేదలకు చేయూతనిస్తూ వేదాంత ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించిన లిబియా లోబో ప్రస్తుతం పనాజీలో ఉంటున్నారు.

■ డా. నాగసూరి వేణుగోపాల్

చిరస్మరణీయులు డా. చెరియన్

హృద్రోగ శస్త్రచికిత్సా రంగంలో జాతీయ, అంతర్జాతీయంగా పేరొందిన వ్యక్తి డా. కె.ఎం.చెరియన్. 1975లో పెరంబూర్ (చెన్నై) రైల్వే ఆసుపత్రిలో దేశంలోని ప్రప్రథమంగా గుండె బైపాస్ శస్త్రచికిత్స చేశారు. పసిపాపలకు, పిల్లలకు కష్టసాధ్యమైన శస్త్రచికిత్సలు నిర్వహించారు. అనేక మంది ప్రాణాలను కాపాడడమే గాక, ఆ రంగంలో అనేక మందిని తయారు చేశారు. సాంకేతికంగా ఎన్నో కొత్త విధానాలను ఆవిష్కరించారు.

కొత్తూరుతు మామెన్ చెరియన్ 1942, ఆగస్టు 3న కేరళలోని అలప్పులాలో జన్మించారు. 1964లో ఎంబీబీఎస్, మంగుళూరులోని కస్తూర్బా మెడికల్ కాలేజీలో 1970లో ఎంఎస్ చేశారు. వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో సర్జరీ లెక్చరర్‌గా పనిచేశారు. ఆస్ట్రేలియా వెళ్లి 1973లో కార్డియోథొరాసిక్ సర్జరీలో శిక్షణ పొంది ఎఫ్ఆర్ఏసిఎస్ డిగ్రీ పొందారు. న్యూజిలాండ్‌లోనూ పనిచేశారు. విద్య పూర్తిచేసుకున్నాక అమెరికాలోని బర్మింగ్‌హాం (అలబామా) లోను, ఒరెగాన్ విశ్వవిద్యాలయంలోను ప్రముఖ సర్జన్ల వద్ద శిక్షణ పొందారు.



ఫ్రాంటియర్ లైఫ్‌లైన్ ఆస్పత్రిని స్థాపించి 1995లో మన దేశంలోనే రెండవ గుండె మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. దేశంలో ప్రథమంగా చిన్న పిల్లల్లో గుండె శస్త్ర చికిత్సను, గుండె–ఊపిరితిత్తుల మార్పిడి శస్త్ర చికిత్సను చేశారు. 1992లో డా. చెరియన్ ఫిజిషియన్ అసిస్టెంట్లకు శిక్షణనిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం 1991లో డా. చెరియన్‌కు పద్మశ్రీ అవార్డును బహూకరించింది. 1990–93 సంవత్సరాల్లో భారత రాష్ట్రపతి గౌరవ సర్జన్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. 2005లో హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో చెరియన్‌ను 'మెడికల్ ఎక్సలెన్స్' అవార్డుతో సత్కరించారు. 2008లో గ్రీస్‌లో జరిగిన అంతర్జాతీయ కార్డియోథొరాసిక్ సర్జన్స్ సమావేశం సందర్భంగా ముగ్గురు భారతీయ సర్జన్ల పేర్లను రాతిపై చెక్కారు, అందులో చెరియన్ ఒకరు. 2010లో అంతర్జాతీయ కార్డియోథొరాసిక్ సొసైటీ అధ్యక్షునిగా ఎన్నికైన తొలి భారతీయుడు ఆయన.

చెన్నైలోని మద్రాస్ మెడికల్ మిషన్ (ఎం.ఎం.ఎం.) ఆసుపత్రి వ్యవస్థాపక డైరెక్టర్‌గా పనిచేశారు. కేరళలోని 'పరుమల'లో చెరియన్ ధార్మిక సంస్థ పెద్ద హృద్రోగ కేంద్రాన్ని, అంతర్జాతీయ స్థాయిలో సీబీఎస్ఈ స్కూలును నడుపుతున్నది. చెన్నై గన్నూరులో 2021లో అధునాతన పరికరాలతో కె.ఎం. చెరియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆస్పత్రిని నిర్మించారు. వీరి కుమారుడు సంజయ్ చెరియన్ తండ్రి అడుగుజాడల్లో హృద్రోగ శస్త్రచికిత్సా నిపుణునిగా సేవలందిస్తున్నారు. జనవరి 25న బెంగుళూరులో మృతి చెందిన డా. చెరియన్ భారత ప్రజలకు, వైద్యులకు గర్వకారణమైన వ్యక్తి, చిరస్మరణీయులు.

—డా. పాటిబండ్ల దక్షిణామూర్తి, సీనియర్ ఫిజిషియన్

భారతీయ రైల్వేలు

మహా కుంభమేళా 2025 ప్రత్యేకం

13,479కు పైగా రైలు ట్రిప్పులు

వయా ప్రయాగ్‌రాజ్ & సంగం ఏరియా

మరియు 3450కు పైగా ప్రత్యేక రైలు ట్రిప్పులు

రైలు సం.	స్టేషన్	గమ్యస్థాన స్టేషన్	బయలుదేరే తేది	బయలుదేరే సమయం
01033	CSMT, ముంబయి	మౌ జంక్షన్	05.02.25, 22.02.25, 26.02.25	11.30
01034	మౌ జంక్షన్	CSMT, ముంబయి	06.02.25, 23.02.25, 27.02.25	23.50
01217	నాగ్‌పూర్	దానాపూర్	05.02.25, 09.02.25, 23.02.25	10.00
01218	దానాపూర్	నాగ్‌పూర్	06.02.25, 10.02.25, 24.02.25	16.00
01455	పూణె జంక్షన్	మౌ జంక్షన్	06.02.25, 08.02.25, 21.02.25	10.10
01456	మౌ జంక్షన్	పూణె జంక్షన్	07.02.25, 09.02.25, 22.02.25	23.50
01661	రాణీ కమలాపతి (భోపాల్)	బనారస్	06.02.25, 17.02.25, 20.02.25	11.10
01662	బనారస్	రాణి కమలాపతి (భోపాల్)	07.02.25, 18.02.25, 21.02.25	14.45
01801	వీరంగన లక్ష్మీబాయి ఝాన్సీ	సుబేదార్‌గంజ్	08.02.25, 09.02.25, 15.02.25, 16.02.25, 22.02.25, 23.02.25	6.10
01802	సుబేదార్‌గంజ్	వీరంగన లక్ష్మీబాయి ఝాన్సీ	08.02.25, 09.02.25, 15.02.25, 16.02.25, 22.02.25, 23.02.25	14.45
02417	సుబేదార్‌గంజ్	ఢిల్లీ జంక్షన్	07.02.25, 08.02.25, 14.02.25, 15.02.25, 21.02.25, 22.02.25, 28.02.25	21.35
02418	ఢిల్లీ జంక్షన్	సుబేదార్‌గంజ్	08.02.25, 09.02.25, 15.02.25, 16.02.25, 22.02.25, 23.02.25, 01.03.25	9.30
03021	హౌరా	తుండ్ల జంక్షన్	05.02.25, 07.02.25, 14.02.25, 21.02.25 26.02.25	19.35
03022	తుండ్ల జంక్షన్	హౌరా	07.02.25, 09.02.25, 16.02.25, 23.02.25, 28.02.25	11.20
03023	హౌరా	తుండ్ల జంక్షన్	16.02.25, 17.02.25, 18.02.25, 20.02.25	0.30
03024	తుండ్ల జంక్షన్	హౌరా	17.02.25, 18.02.25, 19.02.25, 21.02.25	11.20
03025	హౌరా	తుండ్ల జంక్షన్	28.02.25	5.45
03026	తుండ్ల జంక్షన్	హౌరా	01.03.25	11.20
03029	హౌరా	తుండ్ల జంక్షన్	06.02.25, 20.02.25	19.35
03030	తుండ్ల జంక్షన్	హౌరా	08.02.25, 22.02.25	3.00
03031	హౌరా	భింద్	19.02.25	0.30
03032	భింద్	హౌరా	21.02.25	3.30
03219	పాట్నా జంక్షన్	ప్రయాగ్‌రాజ్ జంక్షన్	07.02.25, 08.02.25, 09.02.25, 10.02.25, 15.02.25, 16.02.25, 17.02.25, 18.02.25, 20.02.25, 22.02.25, 23.02.25, 24.02.25, 25.02.25, 27.02.25, 28.02.25	14.25
03409	మాల్డా టౌన్	ప్రయాగ్‌రాజ్ రాంబాగ్	06.02.25, 08.02.25, 15.02.25 20.02.25, 22.02.25	20.45
03689	గయా జంక్షన్	ప్రయాగ్‌రాజ్ జంక్షన్	07.02.25, 08.02.25, 09.02.25, 10.02.25, 15.02.25, 16.02.25, 17.02.25, 18.02.25, 20.02.25, 22.02.25, 23.02.25, 24.02.25, 25.02.25, 27.02.25, 28.02.25	2.20
04065	ఫాఫమౌ జంక్షన్	ఢిల్లీ జంక్షన్	09.02.25, 17.02.25, 28.02.25	23.30
04066	ఢిల్లీ జం.	ఫాఫమౌ జంక్షన్	08.02.25, 16.02.25, 27.02.25	23.25
04145	సుబేదర్‌గంజ్	ఢిల్లీ జంక్షన్	06.02.25, 13.02.25, 20.02.25, 27.02.25	21.35
04146	ఢిల్లీ జంక్షన్	సుబేదార్‌గంజ్	07.02.25, 14.02.25, 21.02.25, 28.02.25	9.30
04153	కాన్పూర్ సెంట్రల్ జంక్షన్	భాగల్పూర్	10.02.25, 17.02.25	14.00
04154	భాగల్పూర్	కాన్పూర్ సెంట్రల్ జంక్షన్	11.02.25, 18.02.25, 21.02.25	8.40
04315	ఫాఫమౌ జంక్షన్	డెహ్రాడూన్	10.02.25, 17.02.25, 24.02.25	6.30
04316	డెహ్రాడూన్	ఫాఫమౌ జంక్షన్	09.02.25, 16.02.25, 23.02.25	8.10
04525	ఫాఫమౌ జంక్షన్	భటిండా జంక్షన్	09.02.25, 19.02.25, 23.02.25	6.30
04526	భటిండా జంక్షన్	ఫాఫమౌ జంక్షన్ (ప్రయాగ్‌రాజ్)	08.02.25, 18.02.25, 22.02.25	04.30
04527	ఫాఫమౌ జంక్షన్ (ప్రయాగ్‌రాజ్)	అంబ్ అందౌరా	10.02.25, 16.02.25, 24.02.25	22.30
04528	అంబ్ అందౌరా	ఫాఫమౌ జంక్షన్ (ప్రయాగ్‌రాజ్)	15.02.25, 23.02.25	22.05
04661	ఫాఫమౌ జంక్షన్ (ప్రయాగ్‌రాజ్)	అమృత్‌సర్ జంక్షన్	08.02.25	6.30
04662	అమృత్‌సర్ జంక్షన్	ఫాఫమౌ జంక్షన్	06.02.25	20.10
05611	కామాఖ్య జంక్షన్	తుండ్ల జంక్షన్	08.02.25, 22.02.25	5.30
05612	తుండ్ల జంక్షన్	కామాఖ్య జంక్షన్	10.02.25, 24.02.25	3.00
05811	సహార్లగున్	తుండ్ల జంక్షన్	08.02.25, 22.02.25	14.30
05812	తుండ్ల జంక్షన్	సహార్లగున్	10.02.25, 24.02.25	11.20
06001	పురట్చి తలైవర్ డా. M.G.R సెంట్రల్, చెన్నై	గోమతి నగర్	05.02.25, 19.02.25, 26.02.25	14.20
06002	గోమతి నగర్	పురట్చి తలైవర్ డా. M.G.R సెంట్రల్, చెన్నై	08.02.25, 22.02.25, 01.03.25	3.45
06003	కన్యాకుమారి	బనారస్	17.02.25	20.30
06004	బనారస్	కన్యాకుమారి	20.02.25	18.05
06007	తిరువనంతపురం నార్త్	బనారస్	18.02.25	14.00
06007	తిరువనంతపురం నార్త్	బనారస్	25.02.25	19.30
06008	బనారస్	తిరువనంతపురం నార్త్	21.02.25, 28.02.25	18.05
06019	మంగళూరు సెంట్రల్	వారణాసి జంక్షన్	15.02.25	4.15
06022	గయా జంక్షన్	తిరువనంతపురం నార్త్	07.02.25	23.55
06062	వారణాసి జంక్షన్	మంగళూరు సెంట్రల్	18.02.25	18.20
06071	పురట్చి తలైవర్ డా.M.G.R సెంట్రల్, చెన్నై	గోమతి నగర్	15.02.25, 01.03.25	14.20
06072	గోమతి నగర్	పురట్చి తలైవర్ డా.M.G.R సెంట్రల్, చెన్నై	18.02.25, 04.03.25	3.45
06207	మైసూరు జంక్షన్	దానాపూర్	15.02.25, 01.03.25	5.10
06208	దానాపూర్	మైసూరు జంక్షన్	18.02.25, 04.03.25	23.00
07081	గుంటూరు జంక్షన్	ఆజంగఢ్	14.02.25	23.00

రైలు సం.	స్టేషన్	గమ్యస్థాన స్టేషన్	బయలుదేరే తేది	బయలుదేరే సమయం
07082	ఆజంగఢ్	విజయవాడ జంక్షన్	16.02.25	19.45
07083	మచిలీపట్నం	ఆజంగఢ్	05.02.25	22.00
07084	ఆజంగఢ్	మచిలీపట్నం	07.02.25	19.45
07085	కాకినాడ టౌన్ జంక్షన్	ఆజంగఢ్	20.02.25	20.10
07086	ఆజంగఢ్	విజయవాడ జంక్షన్	22.02.25	19.45
07087	మౌలా అలీ	బనారస్	17.02.25	23.55
07088	బనారస్	మౌలాలీ	19.02.25	19.15
07089	మౌలా అలీ	గయా జంక్షన్	15.02.25	17.50
07090	గయా జంక్షన్	మౌలాలీ	17.02.25	19.45
07091	వికారాబాద్ జంక్షన్	గయా జంక్షన్	18.02.25	15.45
07092	గయా జంక్షన్	వికారాబాద్ జంక్షన్	20.02.25	19.45
07093	విజయవాడ జంక్షన్	గయా జంక్షన్	05.02.25	19.20
07094	గయా జంక్షన్	విజయవాడ జంక్షన్	08.02.25	19.45
07095	కాకినాడ టౌన్ జంక్షన్	గయా జంక్షన్	08.02.25	14.30
07096	గయా జంక్షన్	విజయవాడ జంక్షన్	10.02.25	14.15
07099	హజూర్ సాహిబ్ నాందేడ్	పాట్నా జంక్షన్	13.02.25	23.00
07100	పాట్నా జంక్షన్	హజూర్ సాహిబ్ నాందేడ్	15.02.25	15.30
07101	ఔరంగాబాద్	పాట్నా జంక్షన్	19.02.25, 25.02.25	19.00
07102	పాట్నా జంక్షన్	ఔరంగాబాద్	27.02.25	15.30
07103	కాచిగూడ	పాట్నా జంక్షన్	22.02.25	16.45
07104	పాట్నా జంక్షన్	కాచిగూడ	24.02.25	11.30
07105	సికింద్రాబాద్ జంక్షన్	పాట్నా జంక్షన్	07.02.25	17.00
07106	పాట్నా జంక్షన్	సికింద్రాబాద్ జంక్షన్	09.02.25	15.30
07107	తిరుపతి	బనారస్	08.02.25, 15.02.25, 22.02.25	20.55
07107	బనారస్	విజయవాడ జంక్షన్	10.02.25, 17.02.25, 24.02.25	17.30
07707	మౌలాలీ	ఆజంగఢ్	21.02.25	23.55
07708	ఆజంగఢ్	మౌలాలీ	23.02.25	19.45
08253	బిలాస్‌పూర్ జంక్షన్	వారణాసి జంక్షన్	22.02.25	8.15
08254	వారణాసి జంక్షన్	బిలాస్‌పూర్ జంక్షన్	24.02.25	10.50
08313	తుండ్ల జంక్షన్	టిట్లాగఢ్	08.02.25, 22.02.25, 01.03.25	5.00
08314	టిట్లాగఢ్	తుండ్ల జంక్షన్	06.02.25, 20.02.25, 27.02.25	17.00
08418	తుండ్ల జంక్షన్	పూరి	19.02.25	3.00
08425	భువనేశ్వర్	తుండ్ల జంక్షన్	05.02.25, 19.02.25, 26.02.25	12.30
08426	తుండ్ల జంక్షన్	భువనేశ్వర్	07.02.25, 21.02.25, 28.02.25	3.00
08529	పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జంక్షన్	విశాఖపట్నం	08.02.25, 22.02.25, 01.03.25	20.10
08530	విశాఖపట్నం	పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జంక్షన్	06.02.25, 20.02.25, 27.02.25	17.35
08561	గోరఖ్‌పూర్ జంక్షన్	విశాఖపట్నం	19.02.25	14.20
08562	విశాఖపట్నం	గోరఖ్‌పూర్ జంక్షన్	16.02.25	22.20
08791	దుర్గ్	వారణాసి జంక్షన్	16.02.25	13.50
08792	వారణాసి జంక్షన్	దుర్గ్	10.02.25	10.50
09017	వాపి	గయా జంక్షన్	07.02.25, 14.02.25, 18.02.25, 22.02.25	8.20
09018	గయా జంక్షన్	వాపి	08.02.25, 15.02.25, 19.02.25, 23.02.25	22.00
09019	వల్సాద్	దానాపూర్	08.02.25, 15.02.25, 19.02.25, 26.02.25	8.40
09020	దానాపూర్	వల్సాద్	09.02.25, 16.02.25, 20.02.25, 27.02.25	23.30
09029	విశ్వామిత్రి (వడోదర)	బల్లియా	17.02.25	8.35
09030	బల్లియా	విశ్వామిత్రి (వడోదర)	18.02.25	23.30
09031	ఉద్నా జంక్షన్ (సూరత్)	ఘాజీపూర్ సిటీ	16.02.25	6.40
09032	ఘాజీపూర్ సిటీ	ఉద్నా జంక్షన్ (సూరత్)	18.02.25	0.30
09371	డా. అంబేద్కర్ నగర్	బల్లియా	08.02.25, 22.02.25	13.45
09372	బల్లియా	డా. అంబేద్కర్ నగర్	09.02.25, 23.02.25	23.45
09403	అహ్మదాబాద్ జంక్షన్	జంఘై జంక్షన్	05.02.25, 14.02.25, 15.02.25, 18.02.25, 19.02.25, 26.02.25	21.15
09404	జంఘై జంక్షన్	అహ్మదాబాద్ జంక్షన్	07.02.25, 16.02.25, 17.02.25, 20.02.25, 21.02.25, 28.02.25	8.30
09413	సబర్మతి (అహ్మదాబాద్)	బనారస్	05.02.25, 09.02.25, 14.02.25, 18.02.25	11.00
09414	బనారస్	సబర్మతి (అహ్మదాబాద్)	06.02.25, 10.02.25, 15.02.25, 19.02.25	19.30
09537	రాజ్‌కోట్ జంక్షన్	బనారస్	06.02.25, 15.02.25, 19.02.25	6.05
09538	బనారస్	రాజ్‌కోట్ జంక్షన్	07.02.25, 16.02.25, 20.02.25	19.30
09555	భావ్‌నగర్ టెర్మినస్	బనారస్	16.02.25, 20.02.25	5.00
09556	బనారస్	భావ్‌నగర్ టెర్మినస్	17.02.25, 21.02.25	19.30
09592	బనారస్	వేరావల్	24.02.25	19.30
09801	సోగారియా (కోటా)	బనారస్	07.02.25, 14.02.25, 18.02.25, 21.02.25	8.15
09802	బనారస్	సోగారియా (కోటా)	08.02.25, 15.02.25, 19.02.25, 22.02.25	14.45
03690	ప్రయాగ్‌రాజ్ జంక్షన్	గయా జంక్షన్	07.02.25, 08.02.25, 09.02.25, 10.02.25, 15.02.25, 16.02.25, 17.02.25, 18.02.25, 20.02.25, 22.02.25, 23.02.25, 24.02.25, 25.02.25, 27.02.25, 28.02.25	11.00
03220	ప్రయాగ్‌రాజ్ జంక్షన్	పాట్నా జంక్షన్	07.02.25, 08.02.25, 09.02.25, 10.02.25, 15.02.25, 16.02.25, 17.02.25, 18.02.25, 20.02.25, 22.02.25, 23.02.25, 24.02.25, 25.02.25, 27.02.25, 28.02.25	22.35



భారతీయ రైల్వేలు

www.indianrailways.gov.in

మమ్మల్ని అనుసరించండి

@RailMinIndia



పులపర్తి రామాంజనేయులు | కూన రవికుమార్ | వేగుళ్ల జోగేశ్వరరావు

అసెంబ్లీ ఫైనాన్స్ కమిటీలకు చైర్మన్లు ఖరారు

» పీఏసీకి పులపర్తి, పీఎస్‌యూసీకి కూన, ఎస్టిమేట్స్‌కు వేగుళ్ల

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మూడు ఆర్థిక కమిటీలకు చైర్మన్లను ఖరారు చేస్తూ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నోటిఫికేషన్ జారీ చేశారు. జనసేనకు చెందిన పులపర్తి రామాంజనేయులు ప్రజా పద్దుల కమిటీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ - పీఏసీ) చైర్మన్‌గా నియమితులుకాగా... టీడీపీకి చెందిన కూన రవికుమార్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ కమిటీ(పీఎస్‌యూసీ) చైర్మన్‌గా, అదే పార్టీకి చెందిన వేగుళ్ల జోగేశ్వరరావు ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. మంగళవారం ఈమేరకు నోటిఫికేషన్ విడుదలైంది. శాసనసభలో వైసీపీకి కేవలం 11 మంది ఎమ్మెల్యేల బలం మాత్రమే ఉండటంతో పీఏసీ అధికార పార్టీ ఖాతాలో పడింది.


24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 24 నుంచి నిర్వహించాలని నిర్ణయించారు. తొలి రోజు గవర్నర్ ప్రసంగం ఉంటుంది. 25న బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. 26న మహాశివరాత్రి సెలవు. 27 నుంచి సమావేశాలు యథావిధిగా కొనసాగుతాయి. సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలన్న అంశాన్ని బీఏసీలో నిర్ణయిస్తారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరిని హత్య చేసిన నక్సల్స్

» పోలీస్ ఇన్‌ఫార్మర్లకు ఇదే గతి అంటూ హెచ్చరిక లేఖ

చింతూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరించారంటూ ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు వ్యక్తులను మావోయిస్టులు హత్య చేశారు. తమ సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్న వారందరికీ ఇదే శిక్ష పడుతుందంటూ ఓ హెచ్చరిక లేఖను సంఘటనా స్థలంలో వదిలివెళ్లారు. బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీసు స్టేషన్ పరిధి బుడిగిచెర్వు గ్రామంలో ఈ ఘటన జరిగింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సాయుధ మావోయిస్టులు బుడిగిచెర్వు చేరుకున్నారు. గ్రామానికి చెందిన కారం రాజు(32), మడ్వి మున్నా(27)లను వారి ఇళ్లనుంచి గ్రామ శివారుకు తీసుకెళ్లి హత్య చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలంలో మావోయిస్టుల లేఖ

ఛత్తీస్‌గఢ్‌లో పేలిన ప్రెషర్ బాంబు

» ముగ్గురు జవాన్లకు గాయాలు

చింతూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు పేలిన ఘటనలో ముగ్గురు జవాన్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం బీజాపూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దులో చోటుచేసుకుంది. డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్స్, సీఆర్‌పీఎఫ్ జవాన్లు మంగళవారం కూంబింగ్‌కు వెళ్లారు. ఈ క్రమంలో మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబ్‌పై ఇద్దరు జవాన్లు అడుగు వేయడంతో అది పేలింది. ఆ ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. మరో జవాను మావోయిస్టులు అమర్చిన బూబీ ట్రాప్‌పై అడుగు వేయడంతో గాయపడ్డాడు. గాయపడ్డ జవాన్లను రాయపూర్ ఆస్పత్రికి తరలించారు.

'ఏఐ సెంటర్' మాకివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఉందని, ఇందుకు కేంద్రం చేయూతనివ్వాలని విన్నవించారు. విశాఖపట్నంలో తాము ఏర్పాటు చేసే డేటా సిటీకి సహకరించాలని కోరారు. మంగళవారమిక్కడ రైల్ భవన్‌లో కేంద్ర మంత్రితో సమావేశమయ్యారు. ఆయన్ను మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించారు. రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యధికంగా కేటాయింపులు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, నూతన పాలసీల గురించి కేంద్ర మంత్రికి వివరించారు. ఏఐ విప్లవంతో డేటా సిటీలకు పెద్దఎత్తున డిమాండ్ రాబోతోందని.. కృత్రిమ మేధ రంగంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ డేటా సిటీల ఏర్పాటుకు అవసరమైన ప్రత్యేక పాలసీల రూపకల్పన, సింగిల్ విండో పద్ధతిలో కేంద్రం నుంచి అనుమతులు సులభతరం చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. 'డేటా సిటీలు, ఎలక్ట్రానిక్స్ కంపెనీల ఏర్పాటుతో ఏపీ యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు వస్తాయి. 2047కి 30 ట్రిలియన్ డాలర్లకు దేశ ఆర్థిక వ్యవస్థ చేరాలన్నది ప్రధాని మోదీ లక్ష్యం. కేంద్ర సహకారంతో ఏఐ రంగంలో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకుని వికసిత్ భారత్ లక్ష్యంలో ఏపీ భాగస్వామి అవుతుంది. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ కంపెనీల ఏర్పాటుకు కేంద్రం సహకరించాలి. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేందుకు త్వరితగతిన అనుమతులు ఇవ్వడమే కాకుండా.. ప్రాజెక్టులు త్వరితగతిన ఏర్పాటయ్యేవిధంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు చర్యలు తీసుకుంటున్నాం' అని లోకేశ్ తెలిపారు. కాగా.. మంగళగిరిలో ఎన్నో ఏళ్లుగా 800 నిరుపేద కుటుంబాలు నిరుపయోగంగా ఉన్న రైల్వే భూముల్లో నివసిస్తున్నారని.. మానవతా దృక్పథంతో ఆ భూములను రాష్ట్రప్రభుత్వానికి కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. వారికి అక్కడ శాశ్వత ఇళ్ల పట్టాలు అందజేస్తామని చెప్పారు.



ఢిల్లీలో మంత్రి లోకేశ్‌తో సమావేశమైన కేంద్ర మంత్రులు రామ్మోహన్, శ్రీనివాసవర్మ, కూటమి ఎంపీలు

సమష్టి కృషితోనే రాష్ట్రానికి మేలు

కలిసికట్టుగా ఉండడం వల్లే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలిగామని, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇక ముందు కూడా ఇదే పంథా కొనసాగిద్దామని లోకేశ్ అన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, టీడీపీ ఎంపీలు, బీజేపీ నేతలు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. 7 నెలల్లోనే సమష్టి కృషితో విశాఖ రైల్వే జోన్, అమరావతి, పోలవరం, స్టీల్ ప్లాంట్‌కు నిధులు తెచ్చుకోగలిగామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర మంత్రులు, ఎంపీలు చేస్తున్న కృషిని అభినందించారు. అతి తక్కువ కాలంలో విశాఖ స్టీల్ సహా అనే సమస్యలు పరిష్కారం కావడం తనకెంతో సంతోషాన్నిచ్చిందని చెప్పారు.

లోకేశ్‌తో ప్రశాంత్ కిశోర్ భేటీ!

» తెలంగాణలో పార్టీ బలోపేతంపై చర్చ!?

» 1-జన్‌పథ్‌లో గంటపాటు సమావేశం

న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్(పీకే) టీడీపీ యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయ్యారు. ఢిల్లీలోని ముఖ్యమంత్రి నివాసం 1-జన్‌పథ్‌కు మంగళవారం పీకే వచ్చారు. అక్కడ దాదాపు గంటకు పైగా లోకేశ్‌తో చర్చలు జరిపారు. ఈ సమావేశ వివరాలపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కానీ... తెలంగాణలో టీడీపీ బలోపేతంపై వీరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. బిహార్‌తోపాటు దేశ రాజకీయ పరిస్థితులపైనా చర్చించుకున్నట్లు సమాచారం. తెలంగాణలో టీడీపీ బలోపేతంపై పీకే ఇప్పటికే కొన్ని ప్రణాళికలను టీడీపీ పెద్దల ముందు ఉంచినట్లు తెలుస్తోంది. ఏపీలో 2019 ఎన్నికల్లో పీకేకు చెందిన ఐప్యాక్ వైసీపీ తరఫున పనిచేసింది. ఆతర్వాత ఐప్యాక్ నుంచి ఆయన బయటకు వచ్చేశారు. బిహార్‌లో 'జన్ సురాజ్' పేరుతో సొంతంగా పార్టీ ఏర్పాటు చేశారు.

డేటా చౌర్యాన్ని నిరూపిస్తే రూ.10 కోట్లు ఇస్తా: లోకేశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వాట్సాప్ పాలన ద్వారా డేటా చౌర్యం జరుగుతోందని నిరూపిస్తే రూ.10 కోట్లు స్వయంగా కానుకగా అందిస్తానని మంత్రి లోకేశ్ వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. వైఎస్ జగన్ ఫోన్ వాడరని, ఆ విషయాన్ని ఆయనే చెప్పారని.. ఇప్పుడు వాట్సాప్ గురించి మాట్లాడితే ఎలాగని ప్రశ్నించారు. అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోనే లేని వ్యక్తికి వాట్సాప్ గురించి ఎలా తెలుస్తుందని ఎద్దేవా చేశారు. గతంలో తాను ఐటీ మంత్రిగా ఉన్న సమయంలో డేటా చోరీ జరిగిందని ఆరోపణలు చేసిన వైసీపీ.. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఎందుకు నిరూపించలేకపోయిందని నిలదీశారు. జగన్ హయాంలో పనికిమాలిన కేసులు పెట్టారని, దొంగ కేసులో చంద్రబాబును 53 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఒకటే రాజధాని అని, అయితే అభివృద్ధి వికేంద్రీకరణ అనేదీ ఎన్డీయే ప్రభుత్వ నినాదమని రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా కియ మోటర్స్ అనంతపురానికి వచ్చిందని, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ చిత్తూరుకు, ఆర్సెలార్ మిట్టల్ ఉత్తరాంధ్రకు, ఐటీ కంపెనీలు విశాఖపట్నానికి వస్తున్నాయని తెలిపారు. విశాఖ, తిరుపతికి వచ్చి, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను చూడాలని కేంద్ర మంత్రిని కోరామని, త్వరలోనే ఆయన రాష్ట్ర పర్యటనకు వస్తారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రం నుంచి అనేక పరిశ్రమలను తరిమేసిందని, తాము అధికారంలోకి వచ్చిన ఏడు నెలలలోనే అనేక పరిశ్రమలను తీసుకొచ్చామని చెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్‌ను కేంద్ర మంత్రి అభినందించారని, దానికి సంబంధించి కొన్ని సలహాలు సూచనలు ఇచ్చారని.. అందరి నుంచి, వాట్సాప్ నుంచి కూడా రాయల్టీ వసూలు చేయాలని కేంద్ర మంత్రి సలహా ఇచ్చారని లోకేశ్ తెలిపారు. డిజీలాకర్‌లో అన్ని ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి చెప్పారని, తాను అంగీకరించానని, త్వరలో ఎంవోయూ చేసుకుంటామని అన్నారు. విశాఖలో టీసీఎస్ కార్యాకలపాలు మరో 2 నెలల్లో ప్రారంభమవుతాయని తెలిపారు. బుధవారం కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఉక్కు మంత్రి కుమారస్వామిని కలుస్తానని చెప్పారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ నిర్ణయంపై పిల్

» రాజకీయ కారణాలతో బెంచ్ ఏర్పాటు చట్టవిరుద్ధం

» రాజధాని కేసులో విస్తృత ధర్మాసనం తీర్పునకు విరుద్ధం

» బెంచ్‌ల ఏర్పాటుపై కమిషన్ సూచనలు పరిగణనలోకి తీసుకోలేదు

» న్యాయశాఖ కార్యదర్శి లేఖపై చర్యలన్నీ నిలిపేయండి

» హైకోర్టును అభ్యర్థించిన పిటిషనర్లు

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. హైకోర్టు న్యాయవాదులు తాండవ యోగేష్, తురగా సాయి సూర్య ఈ పిల్ దాఖలు చేశారు. హైకోర్టు బెంచ్‌లు ఏర్పాటు విషయంలో జస్టిస్ జస్వంత్ సింగ్ కమిషన్ 1985లో ఇచ్చిన నివేదిక, వర్చువల్ హియరింగ్, ఆన్‌లైన్ ఫైలింగ్ వంటి సౌకర్యాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం స్థానిక ప్రజల భావోద్వేగాలు, రాజకీయ కారణాలతో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి నిర్ణయించడం చట్టవిరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజధాని అమరావతి కేసులో హైకోర్టు విస్తృత ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు కూడా ఈ నిర్ణయం విరుద్ధమన్నారు. బెంచ్ ఏర్పాటుకి సంబంధించిన రికార్డులను రద్దు చేయాలని, అమరావతిలో ఉన్న ప్రిన్సిపల్ బెంచ్‌ను రాష్ట్రానికి ఏకైక హైకోర్టుగా ప్రకటించాలని కోరారు. బెంచ్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు హైకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ ఈ నెల 6న కర్నూలులో పర్యటించబోతోందన్నారు. ఈ నేపథ్యంలో న్యాయశాఖ కార్యదర్శి గతేడాది అక్టోబరు 28న రిజిస్ట్రార్ జనరల్‌కు రాసిన లేఖ ఆధారంగా తీసుకునే తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. 'హైకోర్టును విభజించి, బెంచ్ ఏర్పాటు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం బెంచ్ ఏర్పాటు ప్రతిపాదన హైకోర్టు సీజే నుంచి రావాలి తప్ప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కాదు. తిరుపతి, శ్రీకాళహస్తి, చిత్తూరు వంటి ప్రాంతాల నుంచి విజయవాడకు మంచి రవాణా సౌకర్యం ఉంది. కర్నూలులో బెంచ్ ఏర్పాటుకు అంగీకరిస్తే విశాఖలో కూడా బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ వస్తుంది. కర్నూలు రాయలసీమ ప్రాంతానికి మధ్యలో లేదు. తెలంగాణ సరిహద్దుకు కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు నిర్ణయాన్ని రద్దు చేయండి' అని పిటిషన్‌లో కోరారు.

ఐటీకి 196 కోట్ల ప్రోత్సాహకాలు

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమలకు రూ.196 కోట్ల ప్రోత్సాహకాలను అందించాలని రాష్ట్ర ఐటీ శాఖ నిర్ణయించింది. ఈమేరకు ఐటీశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మంగళవారం ఉత్తర్వు జారీ చేశారు.

చిత్రజ్యోతి

SINCE 1965

పాన్ ఇండియా విజయాన్ని అందుకుంటాం

ఏ.ఎం.రత్నం



పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో నిర్మాత ఎ.ఎం.రత్నంకు ఎంతో అనుబంధం ఉంది. వీరి కలయికలో గతంలో 'ఖుషి', 'బంగారం' సినిమాలు వచ్చాయి. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో మూడో చిత్రం 'హరి హర వీర మల్లు' రూపొందుతోంది. పవన్ కల్యాణ్ మొదటి పాన్ ఇండియా సినిమా ఇదే కావడం విశేషం. ఇందులో పవన్ కల్యాణ్ పోరాట యోధుడిగా నటిస్తున్నారు. కాగా, మంగళవారం ఏ.ఎం.రత్నం పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'హరి హర వీరమల్లు' పాన్ ఇండియా స్థాయిలో విడుదలై ఘన విజయం సాధిస్తుందని అన్నారు. పవన్ అభిమానుల అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా, ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందే గొప్ప చిత్రంగా నిలుస్తుందని తెలిపారు.

త్వరలో కలుసుకుందాం...

జూనియర్ ఎన్టీఆర్



తనను కలుసుకోవాలని ఎదురు చూస్తున్న అభిమానుల ఆసక్తిని అర్థం చేసుకున్నానని, త్వరలో సమావేశం ఏర్పాటు చేసి వారిని కలుస్తానని తెలిపారు జూనియర్ ఎన్టీఆర్. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. 'నా అభిమానులు చూపిస్తున్న అపారమైన ప్రేమ, గౌరవానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మీ అందరినీ వ్యక్తిగతంగా కలవాలని నిర్ణయించుకున్నా. అందుకు సజావుగా సమావేశమవడానికి అనుమతుల కోసం పోలీస్, సంబంధిత అధికారులతో సంప్రదిస్తున్నాం. ఇంత పెద్ద సమావేశం నిర్వహించడానికి కొంత సమయం పడుతుంది. ఓర్పుగా ఉండాలని అభిమానులను కోరుతున్నా. నన్ను కలుసుకోవడానికి పాదయాత్రలు వంటివి చేయొద్దు. మీ ఆనందమే కాదు, మీ సంక్షేమం కూడా నాకు అత్యంత ప్రధానం' అని జూనియర్ ఎన్టీఆర్ పేర్కొన్నారు.

కొంత డోస్ తగ్గించా

వెంకటేశ్



జయాపజయాలతో సంబంధం లేకుండా, ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఇవ్వకుండా సినిమాలు చేసుకుంటూ కెరీర్‌ను కొనసాగిస్తున్నారు నటుడు వెంకటేశ్. కుటుంబ కథా చిత్రాల హీరోగా మంచి గుర్తింపు కూడా పొందారు. అయితే 2023లో వచ్చిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్ వెంకటేశ్ ఇమేజ్‌ను కొంతవరకు డ్యామేజ్ చేసింది. ఇందులో అనేక సన్నివేశాలు బోల్డ్‌గా ఉండటంతో పాటు, వెంకటేశ్‌తో అసభ్య సంభాషణలు పలికించడం వివాదాస్పదమైంది. వెంకటేశ్ లాంటి ఫ్యామిలీ హీరో బోల్డ్ కంటెంట్‌లో నటించడం, అభ్యంతరకరమైన డైలాగ్స్ చెప్పడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దానిపై అనేకసార్లు వెంకటేశ్ సంజాయిషీ కూడా ఇచ్చుకున్నారు. 'రానా నాయుడు సీజన్ 2' విషయంలో ఇలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడతామని తెలిపారు. కాగా, ఇటీవలె సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్స్‌కి రప్పించి అతిపెద్ద విజయాన్ని వెంకటేశ్ అందుకున్నారు. ఇప్పుడు 'రానా నాయుడు-2' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇటీవల నిర్వహించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సక్సెస్ మీట్‌లో 'రానా నాయుడు-2'పై వెంకటేశ్ క్లారిటీ ఇచ్చారు. ఫస్ట్ సీజన్‌పై వచ్చిన విమర్శల దృష్ట్యా... సీజన్-2లో కొంత డోస్ తగ్గించినట్లు చెప్పారు. సీజన్ 2లో అర్జున్ రాంపాల్, కృతి కర్బందా కనిపించనున్నారు.

సీనియర్ నటి పుష్పలత కన్నుమూత





భర్త ఏవీఎం రాజన్‌తో...

సీనియర్ నటుడు ఏవీఎం రాజన్ సతీమణి, నటి పుష్పలత (87) చెన్నైలో కన్నుమూశారు. స్థానిక టి.నగర్, తిరుమల పిళ్లై రోడ్డులోని నివాసంలో ఉంటున్న ఆమె వృద్ధాప్యం కారణంగా శ్వాసపీల్చడంలో సమస్యలు తలెత్తడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచినట్టు ఆమె కుటుంబ సభ్యులు వెల్లడించారు. 1958లో వచ్చిన 'సెంగోట్టై సింగం' అనే చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. 1961లో 'కొంగునాట్టు తంగం' అనే చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఎంజీ రామచంద్రన్, శివాజీ గణేశన్, ఎంఎస్ రాజేంద్రన్ వంటి అగ్ర నటుల సరసన నటించారు. 'నానుమ్ ఒరు పెణ్' అనే చిత్రంలో నటుడు ఏవీఎం రాజన్‌తో నటించారు. ఆ తర్వాత ఆయనను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. తెలుగులో 'పెద్దకొడుకు', 'మేము మనుషులమే', 'అన్నదమ్ముల అనుబంధం', 'యుగపురుషుడు', 'రాజపుత్ర రహస్యం', 'శ్రీరామ పట్టాభిషేకం', 'వేటగాడు', 'రాధా కళ్యాణం', 'కొండవీటి సింహం' చిత్రాల్లో నటించారు. ఏవీఎం సంస్థ నిర్మించిన 'రాము' చిత్రంలో ఎన్టీఆర్ సరసన నటించారు.

1963లో 'మైన్ భీ లడ్కీ హూన్' అనే హిందీ చిత్రంలో, 'నర్స్' అనే మలయాళ చిత్రంలోనూ నటించారు. 'సకలకళా వల్లభన్', 'నాన్ అడిమై ఇల్లై' వంటి చిత్రాల్లో సహాయ నటిగా నటించారు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో కలిపి దాదాపు 100కు పైగా చిత్రాల్లో నటించిన ఆమె చివరగా మురళి నటించిన 'పూవాసమ్'(1999) చిత్రంలో కనిపించారు. ఆ తర్వాత ఆమె సినిమాల వైపు తిరిగి చూడలేదు. ఆమె మృతిపై పలువురు తమిళ సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు. కాగా, పుష్పలత కుమార్తె మహాలక్ష్మి 'రెండు జెళ్ల సీత', 'ఆనంద భైరవి', 'మాయదారి మరిది', 'రుణానుబంధం' చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)


టాప్ ఫైవ్‌లో నిలుస్తుందని సుకుమార్ అన్నారు

దేవిశ్రీ ప్రసాద్




దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన చిత్రం 'తండేల్'. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా దర్శకుడు చందు మొండేటి తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. "చాలా రోజుల తర్వాత నేను పనిచేసిన స్వచ్ఛమైన ప్రేమ కథ ఇది. ఇందులోని పాటలకు వస్తున్న అద్భుతమైన ఆదరణ పట్ల సంతోషంగా ఉన్నాను. సుకుమార్ 'తండేల్' పాటలు విని.. నీ కెరీర్‌లో టాప్ ఫైవ్ చిత్రాల్లో ఈ ఆల్బమ్ ఒకటిగా నిలుస్తుందన్నారు. కమర్షియల్ సినిమాలతో పాటు ప్రేమ కథలకు సంగీతాన్ని ఇవ్వడాన్ని ఆస్వాదిస్తా. ప్రేమ పాటలకు రీచ్ ఎక్కువ ఉంటుంది. అవి ఎవర్‌గ్రీన్. కెరీర్ పరంగా సంతృప్తికరంగా ఉన్నా. ఇప్పటివరకూ అన్ని రకాల సినిమాలకు పనిచేసే అవకాశం వచ్చింది. నా సంగీతం అన్ని వర్గాలకు రీచ్ అవడం ఎంతో సంతోషాన్నిస్తోంది. 'తండేల్' వాస్తవిక సంఘటనల ఆధారంగా తయారుచేసుకున్న కథ. ఇందులో నేపథ్య సంగీతం చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు చందు విజన్ ఈ సినిమాకు ప్రధానాకర్షణ" అని చెప్పారు.

ఆగిపోలేదు.. బడ్జెట్ గురించే ఆలోచిస్తున్నాం



'అదుగో క్రిష్ 4 వస్తోంది.. ఇదిగో క్రిష్ 4 తయారవుతోంది'.. అంటూ చాలా కాలంగా వినిపిస్తున్న వార్తలపై ఆ చిత్ర దర్శకుడు రాకేశ్ రోషన్ ఎట్టకేలకు నోరు విప్పారు. ఆ సినిమా ఆగిపోయిందంటూ వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. 'క్రిష్ 4' చిత్రం ఆగిపోలేదు.. బడ్జెట్ గురించే ఆలోచిస్తున్నాం' అని ఆయన చెప్పారు. ఇండియా సూపర్ హీరో కాన్సెప్ట్‌తో హృతిక్ రోషన్ హీరోగా 'క్రిష్' చిత్రం ఇప్పటివరకూ మూడు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నాలుగో భాగం నిర్మాణానికి వచ్చే సరికి కొత్త సమస్యలు మొదలయ్యాయి. ఇటీవలి కాలంలో ప్రేక్షకుల అంచనాలు భారీ స్థాయిలో ఉంటున్నాయి. కనుక ఆ స్థాయిలోనే ఖర్చు పెట్టి సినిమా తీస్తే తప్ప వారిని ఆకట్టుకోవడం కష్టమవుతోంది. హాలీవుడ్‌లో సూపర్ హీరోల చిత్రాలను ఐదు వందల మిలియన్ డాలర్ల బడ్జెట్‌తో తీస్తున్నారిప్పుడు. రూ. రెండు మూడొందల కోట్ల బడ్జెట్‌తో తను 'క్రిష్ 4' చిత్రాన్ని తీస్తే వర్కవుట్ అవుతుందా అని తీవ్రంగా ఆలోచిస్తున్నారు రాకేశ్ రోషన్. 'ఇప్పుడు స్క్రిప్ట్ మీద దృష్టి పెట్టా. ఇదివరకులా సినిమాలో పది అద్భుతమైన సీన్లు అని కాకుండా రెండు సూపర్ ఎపిసోడ్స్ ఉండేలా చూస్తున్నాం' అని ఆయన వివరించారు.





ఎన్నికల కేంద్రంలో కౌన్సిలర్లతో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

బెజవాడలో భూ మాఫియా రెచ్చిపోతోంది. విజయవాడ వెస్ట్ బైపాస్ కేంద్రంగా కొందరు ప్రైవేటు వ్యక్తులు భూ దందాలకు పాల్పడుతున్నారు. సీలింగ్, అసైన్డ్, పోరంబోకు, కాలువ భూములు ఇలా ఏది కనిపిస్తే దాన్ని కబ్జా చేస్తున్నారు. పాత తేదీలతో డాక్యుమెంట్లు పుట్టించి లేఅవుట్లు వేస్తున్నారు. ప్లాట్లుగా విభజించి విక్రయాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. వీరి భారీన పడి అనేక మంది పేద, మధ్య తరగతి ప్రజలు మోసపోతున్నారు.



బెజవాడలో.. భూ మాయ!

వెస్ట్ బైపాస్ కేంద్రంగా మాఫియా దందాలు!

సీలింగ్, అసైన్డ్, పోరంబోకు, కాలువ భూములే లక్ష్యంగా ఆక్రమణ

పాత తేదీలతో డాక్యుమెంట్లు పుట్టించి లేఅవుట్లు వేసి ప్లాట్లుగా విక్రయాలు

సర్వే నంబర్లు మార్చి యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు

మోసపోతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ అలైన్‌మెంట్ బహిర్గతమైనప్పటి నుంచి కొంత మంది ప్రైవేటు వ్యక్తులు భూ దందాలకు తెరతీశారు. విజయవాడ వెస్ట్ బైపాస్ పరిధిలోకి గన్నవరం, విజయవాడ రూరల్, మైలవరం మండలాలు వస్తాయి. ఆయా మండలాల పరిధిలోని రెవెన్యూ కార్యాలయాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులను పట్టుకుని ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు, చాలా కాలంగా ఎవరూ పట్టించుకోకుండా వదిలేసిన పోరంబోకు భూములు, పూడుకుపోయిన చెరువుల వివరాలను రహస్యంగా సంపాదించి పూర్వకాలంలో ఎవరివో భూములుగా డాక్యుమెంట్లు పుట్టిస్తున్నారు. ఈ డాక్యుమెంట్లను కూడా గొలుసు కట్టు స్పెషలిస్టులతో రాయిస్తున్నారు. అచ్చుగుద్దినట్టుగా పూర్వం డాక్యుమెంట్ల వలే సృష్టిస్తున్నారు. ఈ డాక్యుమెంట్లలో ఉన్న పేర్ల ప్రకారం ఆ తర్వాత వీలునామాలు రాయించడం, ఆ వీలునామాల ప్రకారం ఆస్తులుగా దాఖలు కావడం, ఆ తర్వాత వేరే వ్యక్తులకు విక్రయాలు చేస్తున్నారు. ఇవి కొన్నాళ్లకు అనేక చేతులు మారుతున్నాయి. ఇందులో గమ్మత్తు ఏమిటంటే.. పూర్వపు డాక్యుమెంట్ నుంచి వీలునామాగా పొందిన వ్యక్తి, ఆ తర్వాత విక్రయం జరిపిన వ్యక్తి వరకు ప్రస్తుతం ఎవరూ జీవించి ఉండరు. ఆ తర్వాత చేతులు మారిన వారు మాత్రమే ఉంటారు.

లేఅవుట్లు వేసి మరీ విక్రయాలు

భూ మాఫియా ఆక్రమించిన భూమిలో లేఅవుట్లు వేస్తోంది. ప్లాట్లుగా విక్రయాలు జరుపుతోంది. రికార్డుల ప్యూరిఫికేషన్, రీ సర్వే, ప్రభుత్వ కార్యక్రమాల కోసం భూముల కేటాయింపు, టిడ్కో ఇళ్లకు స్థలాలు, ఇతర వర్గాలకు ఇళ్ల పట్టాలు కేటాయిస్తున్న మిగతా 8లో..

కొనుగోలు చేసిన పాపానికి..

భూములు కొనుగోలు చేసే వారికి ఈ వాస్తవాలు ఏమి తెలియవు. విజయవాడ వెస్ట్ బైపాస్ వెంబడి తక్కువ ధరకు భూములు దొరుకుతున్నాయన్న ఏకైక బలహీనత కారణంగా ముందు వెనుక ఆలోచించకుండా భూములు కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది ఇవీ వివాదాస్పద భూములు అని తెలిసినా కూడా తక్కువ ధరకు వచ్చాయి కదా.. అని కొంటున్నారు. కొంత కాలం వరకు ఎవరూ తమను అడగలేదని ధైర్యంగా ఉన్న ఉదంతాలు కూడా ఉన్నాయి. మోసపోయిన వాళ్లలో మధ్య తరగతి వర్గానికి చెందిన వారే ఎక్కువ. భూమి విలువ పెరుగుతుందన్న ఉద్దేశ్యంతో శక్తికి మించి అప్పులు చేసిన వారు కూడా భూములు కొన్నారు. వారి పరిస్థితి చెప్పలేనిది. మరికొందరు సర్వం పోగొట్టుకుంటున్నారు. ఇది తెలిసి తమకు న్యాయం చేయాల్సిందిగా ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగే వారు కూడా ఉన్నారు. ఈ వ్యవహారాలపై జిల్లా కలెక్టర్ సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వరించిన పదవి



చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి

నందిగామ మున్సిపల్ చైర్మన్‌గా మండవ కృష్ణకుమారి ఎన్నిక

నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక ఎట్టకేలకు విజయవంతంగా ముగిసింది. ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సూచించిన వ్యక్తులను పక్కన పెట్టిన అధిష్టానం మధ్యమార్గంగా మండవ కృష్ణకుమారిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎంపిక చేసింది. ఇరువర్గాల గౌరవం తగ్గకుండా చర్యలు చేపట్టింది. దీంతో మూడు రోజులుగా నందిగామలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఊహించని విధంగా కృష్ణకుమారిని పదవి వరించింది.

చివరి వరకు పట్టువీడని ప్రభుత్వ విప్ సౌమ్య

మధ్యమార్గంగా టీడీపీ అధిష్టానం సూచించిన పేరుకు అంగీకారం

ముగిసిన నందిగామ మున్సిపల్ పంచాయితీ

ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరే దీనికి కారణం!

నందిగామ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా శాఖమూరి స్వర్ణలతను నియమించాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సిఫార్సు చేయడంతో వివాదం మొదలైంది. తన నియోజకవర్గానికి చెందిన పదవిని మీరెలా నిర్ణయిస్తారంటూ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సౌమ్య అడ్డంతిరిగారు. ప్రతి విషయంలోనూ ఎంపీ తన నియోజకవర్గంలో పెత్తనం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఇటువంటి చర్యలు తాను అంగీకరించేది లేదని సౌమ్య స్పష్టం చేశారు. పార్టీ పెద్దలు పలుమార్లు సముదాయించే ప్రయత్నం చేసినా సౌమ్య పట్టువీడలేదు. ఈ నెల 2వ తేదీ సాయంత్రం నుంచి 4వ తేదీ ఉదయం పది గంటల వరకూ హైడ్రామా కొనసాగుతూనే ఉంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, లోకేశ్ వ్యక్తిగత కార్యదర్శి కిలారు రాజేష్, ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్, మునిసిపల్ మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ, విజయవాడ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.ఎస్.రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, కనపర్తి శ్రీనివాస్ మంతనాలు జరిపినా ఎంపీ సూచించిన వ్యక్తికి పదవి ఇచ్చేది లేదని సౌమ్య భీష్మించారు. కౌన్సిలర్లు కూడా ముక్త కంఠంతో సౌమ్యకు మద్దతు తెలిపారు. వారి సహకారంతో సోమవారం జరగాల్సిన ఎన్నికను వాయిదా వేయించ గలిగారు. ఒక వేళ ఎంపీ సూచించిన వ్యక్తికే చైర్‌పర్సన్ పీఠం ఇవ్వాల్సి వస్తే ఓటింగ్‌కు హాజరు కాకుండా కౌన్సిలర్లను ఆమె మిగతా 8లో..

ఎందుకింత రచ్చ..

ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరులో సౌమ్య తన పట్టు నిలుపుకొనేందుకు చివరి వరకూ పోరాడారు. కౌన్సిలర్లతో పాటు పార్టీ నాయకుల మద్దతు కూడగట్టుకొని తన బలం చాటారు. పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు, కీలకమైన మంత్రుల మద్దతతో ఎంపీ పావులు కదిపారు. అధిష్ఠానం పెద్దలు ఒత్తిడి చేసినా ఆమె ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. కేవలం చైర్‌పర్సన్ అభ్యర్థి ఎంపికే ఈ వివాదానికి కారణం అనుకోవడం పొరపాటు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే పలు అంశాలలో ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయి. ఎంపీ తనపై మితిమీరిన పెత్తనం చెలాయిస్తున్నట్లు భావిస్తూ వస్తున్నారు. చివరకు తన అభిమతానికి భిన్నంగా పదవుల కేటాయింపు కూడా జరపడంపై ఆమె ఆగ్రహంతో ఉన్నారు, పార్లమెంట్ సభ్యుడు, ప్రభుత్వ విప్‌ల మధ్య చెలరేగిన వివాదం ఎటుదారి తీస్తుందో అని పార్టీ శ్రేణులు ఆందోళనలో ఉన్నాయి. ఇంత పెద్దయెత్తున సాగుతున్న ఆధిపత్య పోరుపై అధిష్ఠానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

దొంగతనం బట్టబయలు

- నేరం జరగకపోయినా పోలీసులకు ఫిర్యాదు
- రూ.36లక్షలు దొంగిలించారని హడావుడి
- సాంకేతికంగా దొరికిపోయిన కుటుంబం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'కష్టార్జితాన్ని పొదుపు చేసుకుని రూపాయి రూపాయి పోగేసుకున్నాం. పిల్లల వివాహాలకు ఉపయోగపడతాయని ఇంట్లో రూ.36లక్షలు పెట్టుకున్నాం. నేను షాపునకు వెళ్లిపోయాను. నా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వెళ్లారు. ఈలోగా ఇంట్లో దొంగలు పడ్డారు. రూ.36 లక్షలు దోచుకుపోయారు.' అంటూ వత్సవాయి పోలీసులకు కొద్దిరోజుల కిందట ఓ ఆటో మెకానిక్ ఇచ్చిన ఫిర్యాదు ఇది. పోలీసులు సాంకేతికంగా ఎన్ని మార్గాల్లో దర్యాప్తు చేసినా ఎలాంటి క్లూ దొరకలేదు. తర్వాత అసలు నిజంగా దొంగతనం జరిగిందా అని దర్యాప్తు చేయడం మొదలుపెడితే మెకానిక్ ఆడిన నాటకం బయటకు వచ్చింది. వివరాల్లోకి వెళితే... వత్సవాయికి చెందిన ఓ ఆటోమెకానిక్ సంపాదించిన మొత్తాన్ని భార్యకు పొదుపు చేయమని ఇచ్చేవాడు. ఈ డబ్బులను బీరువాలో భద్రంగా ఉంచుతున్నట్టు ఆమె భర్తకు చెప్పేది. భార్యకు ఎప్పుడెప్పుడు ఎంతెంత ఇచ్చాడో ఆయన రాసుకునేవాడు. దీని ప్రకారం భార్యకు రూ.36లక్షలు ఇచ్చినట్టు లెక్కలు చెబుతున్నాయి. డిసెంబరు నెలలో డబ్బులు అవసరమవ్వడంతో ఇవ్వమని భార్యను అడిగాడు. అప్పటికే భర్తకు తెలియకుండా భార్య, తల్లికి తెలియకుండా పిల్లలు బీరువాలో ఉన్న డబ్బులను ఖర్చు చేశారు. భర్త డబ్బులు అడిగే సరికి బీరువా లాకర్‌లో ఏమీ లేకపోవడంతో ఆమె ఆందోళన చెందింది. డబ్బులు లేవని చెప్తే భర్త గొడవ చేస్తాడని భావించిన ఆమె దొంగతనం నాటకానికి తెరతీసింది. బీరువాలో చీరలను చిందరవందరగా పడేసి, లాకర్ తలుపులు తీసేసి, అందులో ఉన్న వస్తువులను చెల్లాచెదురుగా పడేసింది. బీరువా తలుపులు తీసి ఉంచి ఇంటి నుంచి పిల్లలను తీసుకుని ఆస్పత్రికి వెళ్లినట్టుగా బయటకు వెళ్లింది. కాసేపటికి ఇంటికి వచ్చి దొంగలు పడ్డారని హడావుడి చేసింది. భర్తకు ఫోన్‌చేసి తాము ఆస్పత్రికి వెళ్తే దొంగలు పడి డబ్బులు దొంగిలించారని చెప్పింది. ఇంటికి వచ్చి పరిశీలించుకుని అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీరువాలో ఉన్న రూ.36లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన వత్సవాయి పోలీసులు వారి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా కాల్‌డేటాను పరిశీలించారు. దీనితోపాటు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా ఆ ఇంటి పరిసర ప్రాంతాలకు కొత్త వ్యక్తులు వెళ్లినట్టు కనిపించలేదు. కాల్‌డేటాలోనూ ఎలాంటి ఆధారాలు లభించలేదు. బీరువాలోని లాకర్‌ను పరిశీలిస్తే అందులో రూ.36లక్షలు పట్టేంత ప్రదేశం లేదని గుర్తించారు. దీనితో పోలీసులకు అనుమానం వచ్చింది. తర్వాత పోలీసులు ఆ ఇంటికి తరచుగా వెళ్లే వ్యక్తిని విచారించారు. దీనితో అసలు విషయం వెలుగులోకి వస్తే మొదటికే ప్రమాదం వస్తుందని భావించిన మెకానిక్ కుటుంబం వాస్తవాన్ని అంగీకరించింది.

వారంతే..!

ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐల పనితీరుపై అధికారుల అసంతృప్తి



వైసీపీ వాసనలు ఇంకా పోలేదని వ్యాఖ్యలు

- కేసులను విచారణ చేయకుండానే మూసేస్తున్న ఎస్‌హెచ్‌వోలు
- అధికారుల ఆదేశాలను వదిలేస్తున్న ఇన్‌స్పెక్టర్లు
- కేసులు దర్యాప్తులో లోపాలను గుర్తిస్తున్న అధికారులు
- ఇక ఉపేక్షించకూడదని నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పోలీస్ కమిషనరేట్‌లో అధికారులు ఒక థీమ్‌తో పనిచేస్తుంటే స్టేషన్లకు ఎస్‌హెచ్‌వోలుగా వ్యవహరిస్తున్న ఇన్‌స్పెక్టర్లు మరొక ఆలోచనతో అడుగులేస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం కమిషనరేట్ చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం మారిన తర్వాత పోలీస్ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. ఇందులో కొంతమంది ఇన్‌స్పెక్టర్లు రాజకీయ సిఫార్సులతో పోస్టింగులు సాధించుకున్నారు. మరి కొంతమందిని అధికారులు ఏరికోరి నియమించుకున్నారు. ఇలా వచ్చిన ఇన్‌స్పెక్టర్లు ఇప్పుడు తమ అంచనాలకు అనుగుణంగా పనిచేయడం లేదన్న భావన అధికారుల్లో వ్యక్తమవుతోంది. నెలవారీగా నిర్వహించే నేర సమీక్ష సమావేశాల్లోనూ, నిత్యం నిర్వహించే సెల్ కాన్ఫరెన్స్‌ల్లో ఇన్‌స్పెక్టర్ల డొల్లతనం బయటపడుతున్నట్టు తెలిసింది. వైసీపీ హయాంలో ఇన్‌స్పెక్టర్లతోపాటు మిగతా 8లో..

- గాంధీనగర్‌లోని ఈ-సేవా కేంద్రంలో పనిచేసే అమ్మాయికి ఒక అబ్బాయి పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి గవర్నరుపేటలోని ఒక లాడ్జికి తీసుకెళ్లి కోరిక తీర్చుకున్నాడు. ఆ తర్వాత మరో యువతిని వివాహం చేసుకొని ముఖం చాటేశాడు. దీనిపై బాధితురాలు న్యాయం చేయాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ ఫిర్యాదును గవర్నరుపేట పోలీసులకు పంపారు. ఫిర్యాదును చదివి సమగ్రంగా విచారణ చేయాల్సిన గవర్నరుపేట పోలీసులు మొక్కుబడిగా నివేదిక ఇచ్చారు. గవర్నరుపేటలోని లాడ్జిలో అత్యాచారం జరిగిందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంటే అమ్మాయి, అబ్బాయికి మధ్య పరిచయం గాంధీనగర్‌లోని ఈ-సేవా కేంద్రంలో జరిగినందు వల్ల ఈ ఫిర్యాదు తమ పరిధిలోకి రాదని అధికారులకు నివేదిక ఇచ్చారు. వాళ్ల మధ్య పరిచయం జరిగిన ప్రదేశం సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందని ఫిర్యాదును ఆ పోలీస్‌స్టేషన్‌కు పంపాలని గవర్నరుపేట పోలీసులు అభిప్రాయాన్ని రాశారు. అధికారులు ఫిర్యాదును, గవర్నరుపేట పోలీసులు ఇచ్చిన నివేదికను క్షుణ్ణంగా చదివిన తర్వాత వెలుగులోకి వచ్చిన అంశం ఇది.
- గడచిన ఏడాది మేలో నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో దర్యాప్తు పేలవంగా జరిగిందని స్వయంగా పోలీస్ కమిషనర్ గుర్తించారు. దీనిపై పునఃవిచారణ చేయాలని ఆదేశించారు. ఇటీవల జరిగిన ఘటన ఇది.
- 'మా కాలనీలో గంజాయి తాగిన వ్యక్తి దొంగతనాలు చేస్తుంటే పట్టుకుని అప్పగించాం. రెండు రోజులు మీ దగ్గర పెట్టుకుని సైకో అని చెప్పి వదిలేశారు. తర్వాత కొన్నిరోజులకు మళ్లీ అదే పనిచేయడం మొదలుపెట్టాడు. మీరు ఎమ్మెల్యేలు, ఎంపీలకు భద్రత ఇవ్వడానికి ఉన్నారా? ప్రజలకు రక్షణ కల్పించడానికి ఉన్నారా?' అంటూ సెంట్రల్ జోన్‌లో ఓ ఎస్ఐను వాసవీకాలనీకి చెందిన సంక్షేమ సంఘం ప్రతినిధి అడిగిన ప్రశ్నలు ఇవి.

బిగుస్తున్న ఉచ్చు!?

సన్‌సిటీ కాలనీలో రూ.2.50 కోట్ల ఇరిగేషన్ భూముల ఆక్రమణపై కదులుతున్న డొంక

- ఇరిగేషన్ స్థలాలకు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ) వేసిన కార్పొరేషన్
- మూడు సార్లు టౌన్‌ప్లానింగ్ శాఖకు లేఖలిచ్చామంటున్న ఇరిగేషన్ ఏఈ

ఈ వ్యవహారంపై ఆరా తీస్తున్న అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సన్‌సిటీ కాలనీలోని భూముల కబ్జా వ్యవహారం అధికారుల మెడకు చుట్టుకుంటోంది. ఇరిగేషన్ భూములని అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టిన తర్వాత కూడా.. దానిని తొలగించి మరీ రిజిస్ట్రేషన్ చేయించటంతో అధికారులు ఎంత ఉదాసీనంగా వ్యవహరించారో అర్థమవుతోంది. సుమారు రూ.2.50 కోట్ల విలువచేసే ఇరిగేషన్ స్థలాలకు దొంగపత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసేసిన వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' సోమవారం వెలుగులోకి తీసుకురావడంతో సన్‌సిటీ కాలనీలో ఇరిగేషన్ భూములను ఎలా రిజిస్ట్రేషన్లు చేయించారు.. ఇరిగేషన్ శాఖ ఏమి చేస్తుంది.. ఫిర్యాదులు అందినా కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగం శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. ఇరిగేషన్ భూములకు ఏకంగా ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ)ఎలా వేశారు..? ఇరిగేషన్ స్థలంలో ఉన్న భవన నిర్మాణాలకు ఎలా అనుమతులు ఇచ్చారు.. అసలు ఆక్రమణదారులకు కొమ్ము కాస్తున్న అధికారులెవరూ.. వారికి వత్తాసు పలికిన వైసీపీ నాయకుల పాత్ర ఏంటనే వివరాలను రాబడుతున్నారు. అధికారం అడ్డం పెట్టుకొని అధికారులను ప్రలోభాలకు గురిచేసినట్లు తేలితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు ముందుకు వెళ్లాలని ఆలోచిస్తున్నారు.



అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో కబ్జా భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన ఇరిగేషన్ అధికారులు(ఫైల్)

వీఎల్‌టీకి దరఖాస్తు

సన్‌సిటీ కాలనీలోని 550 గజాల ఇరిగేషన్ స్థలానికి వీఎల్‌టీ(వేకెండ్ ల్యాండ్ ట్యాక్స్) వేయించుకునేందుకు కబ్జాదారుడు 2023, జూలై 25న దరఖాస్తు చేసుకున్నాడు. అలాగే సర్వే నంబరును కూడా మార్చి తద్వారా ఇక్కడి అధికారులను తప్పుదోవ పట్టించడమో లేక అధికారులతో కుమ్మక్కు అవడమో చేసినట్లు తెలుస్తోంది. అలాగే ఎనీవేర్ విధానాన్ని అవకాశంగా మార్చుకుని తద్వారా నూజివీడులో రిజిస్ట్రేషన్ చేయించనట్లు సమాచారం.

దొంగ రిజిస్ట్రేషన్లు

అన్యాక్రాంతమైన స్థలం ఇరిగేషన్ శాఖకు చెందినదిగా ఆ శాఖ అధికారులు హెచ్చరికల బోర్డులు పెట్టిన భూమి వైసీపీ నేతకు రిజిస్ట్రేషన్ మిగతా 8లో..

ఆక్వాలో ఆక్రందనలు



ఆర్థిక ఆటుపోట్లలో జిల్లా రైతులు

- ఆక్వాజోన్ హోదా ఇస్తేనే అభివృద్ధి
- విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని వేడుకోలు
- వైసీపీ హయాంలో తొలగించిన సబ్సిడీ..

10లో



బెజవాడలో ఆకాశ హర్మ్యం

నగరంలో అత్యంత ఎత్తయిన జీప్లస్20 భవనం

- 'కేఎంవీ వివాన్'పై హెలీప్యాడ్ ప్రత్యేక ఆకర్షణ
- ఎమర్జెన్సీ మెడికల్, అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా సదుపాయం
- సకల సౌకర్యాలతో సిద్ధమైన హైరైజ్ బిల్డింగ్

10లో

తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.93.40 లక్షలు

8లో

రెవెన్యూ సదస్సుల్లో 96 శాతం అర్జీలకు పరిష్కారం : కలెక్టర్ లక్ష్మీశ


తిరుతమ్మ ఆలయంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.93.40 లక్షలు

పెనుగంచిప్రోలు, ఫిబ్రవ 4 (ఆంధ్రజ్యోతి) : పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయంలోని హుండీల కానుకలను జగ్గయ్యపేట గ్రూప్ దేవాలయాల ఈవో పి.జయప్రకాష్ పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో రూ.93,40,492 నగదును, 198 అమెరికన్ డాలర్లు, ఐదు ఆస్ట్రేలియా డాలర్లు, 40 యూరోలు, థాయ్ కరెన్సీ(థాయ్ బహత్‌లు) 50, బంగారం 86 గ్రాములు, 1,350 గ్రాముల వెండి మొత్తం 111 రోజులకు సమర్పించినట్లు డిప్యూటీ కమిషనర్ వి.హెచ్.వి.ఎస్.ఎన్ కిషోర్ కుమార్ తెలిపారు. ఆలయ సిబ్బందితో పాటు ధర్మకర్తలు, విజయవాడకు చెందిన శ్రీ దుర్గా శివసాయి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణావర్సిటీ అంతర్ కళాశాలల మహిళా హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

వన్‌టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా యూనివర్శిటీ అంతర్ కళాశాలల మహిళల హ్యాండ్‌బాల్ పోటీలు కేబీఎన్ కళాశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు టీ శేషయ్య పోటీలను ప్రారంభించారు. విద్యాసంస్థల పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి కృష్ణవేణి, సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ టి శ్రీనివాస్, యూనివర్శిటీ సెలక్షన్ కమిటీ సభ్యుడు మేజర్ మన్నే స్వామి, కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావు తదితరులు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఉత్తమ క్రీడాకారులను యూనివర్శిటీ జట్టుగా ఎంపిక చేసి తమిళనాడులో త్వరలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల హ్యాండ్ బాల్ పోటీలకు పంపిస్తారు.

కానూరు కార్పొరేట్ కళాశాలలో
ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

పెనమలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ కళాశాల విద్యార్థి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మండలంలోని కానూరులో జరిగింది. కానూరులోని ఒక ప్రైవేటు కార్పొరేట్ కళాశాలలో తోట్లవల్లూరు మండలం గురువిందపల్లి గ్రామానికి చెందిన గుర్రం వేణునాథ్ (18) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ మ్యాథ్స్ సబ్జక్టులో ఫెయిలవడంతో హాస్టలులోనే ఉంటూ చదువుకుంటున్నాడు. సోమవారం అర్ధరాత్రి ఒం టిగంట సమయంలో తాను ఉంటున్న హాస్టలు రూం లోనే ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారం కారణంగానే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు సంఘటనా స్థలంలో దొరికిన సూసైడ్ నోట్‌లో ఉన్నట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకొన్న విద్యార్థి తల్లిదండ్రులు కళాశాల వద్దకు వచ్చి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. తమ కుమారుడు పిరికివాడు కాదని, ఆత్మహత్య చేసుకోవాల్సిన అవ సరం అతనికి లేదన్నారు. కళాశాల సిబ్బందిపై అనుమానాలు వ్యక్తం చేశారు. సూ సైడు నోటులో చేతిరాత తమ కుమారుడిది కాదని, అతడి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని కళాశాల వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు పని భారాన్ని తగ్గించాలి

ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

విజయవాడ(వన్‌టౌన్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ ఉద్యోగులకు పనిభారాన్ని తగ్గించాలని ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ (ఏపీ ఆర్ఎస్ఏ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విజయవాడ గవర్నరుపేటలోని ఆర్ఎస్ఏ భవన్‌లో మంగళవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి పలు అంశాలను ప్రస్తావించారు. పలు తీర్మానాలు చేశారు. రెవెన్యూ ఉద్యోగులకు పనిభారాన్ని తగ్గించాలని, సిబ్బందిని నియమించడంతో పాటు అవసరమైన నిధులు కూడా కేటాయించాలన్నారు. జనాభా ఆధారంగా పని భారం ఆధారంగా ప్రతిమండలంలో, డివిజన్ స్థాయిలో, కలెక్టర్ కార్యాలయాలలో సిబ్బందిని పెంచాలని, లేదంటే కొత్త మండలాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యాలయాలలో మహిళలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, వారి ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం కనీస నిధులు కూడా కేటాయించక పోవడంతో ఉద్యోగులకు పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బంది పెరిగిందని, వీటిని పరిష్కరించాలని కోరారు. శిథిల రెవెన్యూ భవనాల స్థానంలో కొత్త భవనాలను నిర్మించాలన్నారు. ఐదు సంవత్సరాల క్రితం నిర్మించిన తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను కాంట్రాక్టర్ల నుంచి విడిపించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. మెరుగైన ఫలితాలు వచ్చేందుకు రెవెన్యూ అకాడమీని ఏర్పాటు చేసి, ఉద్యోగులకు తగు శిక్షణ ఇప్పించాలని కోరారు.

వారంతే..!

(7వ పేజీ తరువాయి)

పోలీసు సిబ్బంది వ్యవహరించిన తీరు సర్వత్రా విమర్శలకు తావిచ్చింది. ఆ మచ్చను తొలగించడానికి, ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడానికి వివిధ రకాల కాన్సెప్ట్‌లతో అధికారులు అడుగులు వేస్తున్నారు. అధికారులు చెప్పిన ఆలోచనలకు సమావేశాల్లో తల ఊపుతున్న ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు తర్వాత వాటి గురించి పట్టించుకోవడంలేదన్న చర్చ అధికారుల మధ్య నడుస్తోంది. కమిషనరేట్ పరిధిలో ఉన్న కొంతమంది ఇన్‌స్పెక్టర్లు రాజకీయ నేతలు చేసిన సిఫార్సులను ఆదేశాలుగా భావిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలికాలంలో ఉత్తర మండలంలో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న లారీలను ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా వదిలేశారు. ఈ విషయం తెలిసి అధికారులు ప్రశ్నించినప్పుడు ఆ పోలీసులు ఒక రాజకీయ నాయకుడి పేరు చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. తెలంగాణకు సరిహద్దుగా ఉన్న స్టేషన్లలోను ఇలాంటి ఘటనలు జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటి వరకు హెచ్చరికలు జారీ చేసి వదిలేసిన అధికారులు ఇకపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కచ్చితంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు.

చెరోదారి

కమిషనరేట్ పరిధిలోని కొన్ని స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్ల దారి ఒకలా ఉంటే, ఎస్ఐల దారి మరోలా ఉంటోంది. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులను సంబంధిత సెక్టర్ ఎస్ఐలకు అప్పగిస్తారు. ఈ ఫిర్యాదులను పరిశీలించి, విచారించి ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాల్సిన ఎస్ఐలు ఆ పని చేయడం లేదు. నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లకు న్యాయస్థానాల్లో చార్జిషీట్లు దాఖలు చేయడం లేదు. దీనితో చార్జిషీట్లు దాఖలు చేయాల్సిన ఎఫ్ఐఆర్‌ల సంఖ్య పెరుగుతోంది. న్యాయస్థానాల్లో ఉన్న కేసులకు సంబంధించి అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. కేసుల దర్యాప్తు, చార్జిషీట్ల పెండింగ్ సంఖ్యను తగ్గించాలని అధికారులు నిత్యం నిర్వహించే కాన్ఫరెన్స్‌ల్లో హెచ్చరిస్తున్నారు. దీనితో సెక్టర్ ఇన్‌చార్జిలుగా ఉన్న ఎస్ఐలు ఈ ఒత్తిడి నుంచి తప్పించుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. సీఐడీ, విజిలెన్స్ వంటి విభాగాలకు వెళ్లిపోవడానికి మార్గాలు వెతుక్కుంటున్నారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించమని చెప్పే సరికి బదిలీలకు దరఖాస్తులు చేసుకుంటున్నారని అధికారులు గుర్తించారు. కోరుకున్న విభాగాలకు వెళ్లాలంటే పోలీసు కమిషనర్ అనుమతి ఇవ్వాలి. ఇలా చేయాల్సిన పనిని వదిలేసి వెళ్లిపోవాలనుకున్న వారికి బ్రేక్‌లు వేయాలని డీసీపీలు భావిస్తున్నారు. ఇక నుంచి అధికారుల ఆదేశాలను పాటించకుండా విధి నిర్వహణలో ఇష్టానుసారంగా వ్యవహరించిన వారిపై కచ్చితం ఉన్నతాధికారులకు రిపోర్టు రాయాలని నిర్ణయించారు.

నేత్రపర్వం..సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

మోపిదేవి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం మహోత్సవం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవాన్ని దేవస్థానం అధికారులు, అర్చకులు ఆహ్లాదభరితంగా నిర్వహించారు. శేషవాహనంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను గావించగా, ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయుల తరఫున నూతన పట్టువస్త్రాలను అర్చకులకు సమర్పించారు. ప్రధాన అర్చకులు బుద్దు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్లను కల్యాణ మూర్తులుగా అలంకరణ చేసి కల్యాణం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మంగళధారణ ఘట్టాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించగా, భక్తులు కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. ఎస్టేట్ దేవాలయాల ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు దంపతులు కలాణంలో పాల్గొనగా, అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్సై సత్యనారాయణలు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.


స్వామివార్ల మంగళ సూత్రాలను భక్తులకు చూపుతున్న వేదపండితులు



← వైభవంగా రథోత్సవం

మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారి రథోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, విద్యుత్ దీపాలు, పూలమాలలతో విశేష అలంకరణ చేసిన రథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను గావించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కొబ్బరికాయ కొట్టి తాడును లాగి స్వామి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తజనుల జయజయ ధ్వానాలతో స్వామివారి రథోత్సవం పుర వీధుల్లో ముందుకు సాగింది. రథంపై ఆశీనులై స్వామివారు ఊరేగింపుగా పురవీధుల్లో వస్తుండగా, గ్రామస్థులు కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించి దర్శించుకున్నారు. అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీ, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సబ్ డివిజన్‌లోని పోలీ సు సిబ్బంది భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పర్యావరణహిత ఆలివ్ రిడ్లే

● తాబేళ్ల పునరుత్పత్తికి వన్యప్రాణి సంరక్షణ విభాగం కృషి ● గుడ్ల సంరక్షణకు పటిష్ట చర్యలు

కాలుష్యం అన్ని జీవరాశులకు పెనుముప్పుగా తయారైంది. కాలుష్య నివారణకు అందరూ నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రమాదకరమైన, పారిశ్రామిక కాలుష్యం నుంచి సముద్ర తీర ప్రాంతాన్ని ఆలివ్ రిడ్లే జాతి సముద్ర తాబేళ్లు కాపాడుతున్నాయి. తద్వారా సముద్రంలోని సకల జీవరాశుల మనుగడకు దోహదపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లే జాతి తాబేళ్ల సంరక్షణకు అటవీశాఖలోని వన్య ప్రాణి సంరక్షణ విభాగం అవిరళ కృషి చేస్తోంది. జనవరి నుంచి మార్చి వరకు తాబేళ్ల పునరుత్పత్తి సమయం కావడంతో వాటి గుడ్లను జాగ్రత్తగా సేకరించి, భద్రపరచి, తాబేళ్ల సంతానోత్పత్తికి వన్యప్రాణి సందరక్షణ విభాగం చేస్తున్న అవిరళ కృషిపై ప్రత్యేక కథనం

(ఆంధ్రజ్యోతి -నాగాయలంక)

అవనిగడ్డ అటవీశాఖ రేంజ్ పరిధిలో సుమారు 50 కిలోమీటర్లు సముద్రతీరం ఉంది. కోడూరు మండలం నుంచి నాగాయలంక మండలం మీదుగా బాపట్ల జిల్లాలోని కొత్తపాలెం మండలం మూరగుంట వరకు అవనిగడ్డ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఉంది. ఈ కేంద్రం పరిధిలో ఆరు గస్తీ ప్రదేశాలు ఉండగా, నాగాయలంక మండలంలో సొర్లగొంది, నాచు గుంట, ఈలచెట్లదిబ్బ, గుల్లలమోద ఉండగా, కోడూరు మండలంలో పాలకాయితిప్ప, బాపట్లలో లంకేవానిదిబ్బ బీట్లు ఉన్నాయి. వీటిలోని సంగమేశ్వరంలో ఒకటి, గుల్లలమోదలో రెండు, జింకపాలెంలో ఒకటి, పాలకాయితిప్పలో ఒకటి తాబేళ్ల సంరక్షణ కేంద్రాలను వన్యప్రాణి సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రత్యేక నిధులను కేటాయించి జనవరి నెల నుంచి మార్చి మాసం వరకు వీటిని నిర్వహిస్తున్నారు. తాబేళ్ల పునరుత్పత్తి సమయంలో ఉదయం వందలాది తాబేళ్లు తీరానికి వచ్చి వేలాది గ్రుడ్లను గుంటలు తీసి పెడతాయి. ఆ గుడ్లను మెరైన్ యానిమల్ సిబ్బంది సేకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హేచరీలో గుంటలు తీసి రెండు నెలలపాటు నక్కలు, కుక్కలు, ఇతర జంతువుల బారి నుంచి కాపాడతారు. పునరుత్పత్తికి వచ్చిన ఒక్కొ క్క తాబేలు ఉదయం నుంచి రాత్రి వరకు 40 నుంచి 60 గ్రుడ్లకుపైగా ఒకే సారి గజం లోతు గుంటను తీసి గబగబా పెట్టి సముద్రంలోకి వెళ్లిపోతాయి. ప్రతీ యేటా 70 వేలకు పైగా


తీరంలో గుడ్లు పెడుతున్న తాబేలు,


సొర్లగొందిలో తాబేళ్ల సంక్షరణ హేచరీ

గుడ్లను సేకరించి పొదిగిన పిల్లలను సముద్రంలోకి వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాదిలో ఐదు కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 50 తాబేళ్లు మూడు వేల గుడ్లను పెట్టగా, వాటిని సేకరించి హేచరీలో భద్రపర్చినట్లు సొర్లగొంది మెరైన్ యానిమల్ సంరక్షుడు నాగరాజు తెలిపారు.

తాబేళ్ల గుడ్ల సంరక్షణ ఇలా..

తాబేళ్లు గుంటలు తీసిన ప్రాంతాలను సిబ్బంది గుర్తించి, వాటి గుడ్లను భద్రంగా సేకరించి, హేచరీకి కేటాయించిన స్థలంలో గొయ్యి తీసి పెట్టి, బుసకతో పూడ్చి పెట్టి వాటికి వరుస సంఖ్యను నమోదు చేస్తారు. వాటిని బుట్టలతో భద్ర పరుస్తారు. హేచరీలో పెట్టి పూడ్చిన గుడ్ల నుంచి సుమారు 45 నుంచి 60 రోజుల్లో తాబేళ్ల పిల్లలు బయటకు వస్తాయి. వాటిని సిబ్బంది లెక్కించి సముద్రంలోకి సిబ్బంది వదులుతారు. వన్యప్రాణి సంరక్షణ విభాగం అధికారులు , రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు తాబేళ్ల సంరక్షణ కేంద్రాలను పర్యవేక్షించి తాబేళ్ల సంతతిని కాపాడుతూ తీర ప్రాంతాలు కలుషితం కాకుండా అవిరళ కృషి చేస్తున్నారనటంలో ఎలాంటి సందేహం లేదు.

ఉద్యానవన పథకంలో సమగ్ర అభివృద్ధికి 1,033 ప్రాజెక్టులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యానవనం అభివృద్ధి పథకం కింద సమగ్ర అభివృద్ధి మిషన్‌లో రాష్ట్రానికి 1,033 ప్రాజెక్టులను ఆమోదించినట్లు కేంద్ర వ్యవసాయ రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయమంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. ఈ పథకంపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ వేసిన ప్రశ్నకు మంత్రి మంగళవారం సమాధానం ఇచ్చారు. ఏపీలో చిత్తూరు జిల్లాలో అత్యధికంగా 123 ప్రాజెక్టులు ఆమోదించగా, ఎన్టీఆర్ జిల్లాలో 28 ప్రాజెక్టులను ఆమోదించినట్టు మంత్రి వివవరించారు. ఈ పథకం ప్రారంభం నుంచి మార్కెట్ మౌలిక సదుపాయాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు 2014-15లో 74.59 కోట్లు కేటాయింపు చేయగా, రూ.64.68 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం వరకు ఈ పథకం కింద ఏపీకి మొత్తంగా రూ.703.09 కోట్లు విడుదల చేసినట్టు మంత్రి తెలిపారు.

ఛత్తీస్‌ఘడ్ తెలుగు మహాసభలు మార్చి 8, 9 తేదీల్లో

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయిపూర్‌లో మార్చి 8, 9 తేదీల్లో జరిగే ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రస్థాయి తెలుగు మహాసభలకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఆహ్వానించినట్టు ఛత్తీస్‌ఘడ్ తెలుగు మహాసభల కన్వీనర్ రుద్రమూర్తి తెలియజేశారు. విజయవాడలోని తెలుగు రచయితల మహాసభల కార్యాలయంలో జరిగిన విలేకరుల వివరాలన తెలియజేశారు. 'భిలాయి స్టీల్ ప్లాంట్ నిర్మాణ దశ, రైల్వే విస్తరణ' సమయంలో ఉపాధి కోసం తెలుగువారు ఛత్తీస్‌ఘడ్ వచ్చారని, అలా వచ్చిన వారిలో ఉత్తరాంధ్ర, ఒంగోలు, నెల్లూరు, గోదావరి జిల్లాల వారు ఉన్నారన్నారు. ఏడు దశాబ్దాలుగా భాష,సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకొనే ప్రయత్నంలో సంఘాలను ఏర్పాటు చేసుకొని, రామాలయాలు, బాలాజీ మందిరాలు, తెలుగు పాఠశాలలు స్థాపించుకొన్నారన్నారు. సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకొనే ప్రయత్నంలో ఎదురయ్యే సమస్యలు సమిష్టిగా ఒక వేదికపై చర్చించడానికి ఈ సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, నారా లోకేశ్, శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావులను ఆహ్వానించామన్నారు.

మంత్రి లోకేశ్‌కు ఢిల్లీలో ఘనస్వాగతం

వన్‌టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఢిల్లీ విమానాశ్రయంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఘనస్వాగతం పలికారు. రైల్వే బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే ప్రాజెక్టులకు రూ.9,417 కోట్లు కేటాయించినందుకు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపేందుకు మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ వచ్చారు. కేశినేని శివనాథ్‌తో పాటు పుట్టా మహేష్ కుమార్, గంటి హరీష్, సానా సతీష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.


ఢిల్లీలో మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీలు కేశినేని శివనాథ్, పుట్టా మహేశ్ తదితరులు

రెవెన్యూ అర్జీలు 96శాతం పరిష్కారం : లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలో 33 రోజుల పాటు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 3,111 అర్జీలు రాగా, 3,015 (96 శాతం) పరిష్కరించామని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. సీసీఎల్ఏ జి.జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు, పరిష్కారం అంశాలపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి హాజరయ్యారు. అర్జీల పరిష్కారంలో జిల్లాను మెరుగైన స్థానంలో నిలుపుతున్నట్లు వివరించారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)కు సంబంధించి 105 అర్జీలు నమోదు కాగా 102 అర్జీలను, రీసర్వేకు సంబంధించి 148 రాగా 137 అర్జీల పరిష్కారం పూర్తయినట్లు తెలిపారు. అసైన్డ్ భూములకు సంబంధించి 272 అర్జీలు రాగా 269 అర్జీలను పరిష్కరించా మన్నారు. 22 ఏకు సంబంధించి 105 అర్జీలకు గాను 102 పరిష్కార మయ్యాయన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, సూపరింటెండెంట్ సీహెచ్.దుర్గాప్రసాద్, చంద్రమౌళి పాల్గొన్నారు.

బిగుస్తున్న ఉచ్చు!?

(7వ పేజీ తరువాయి)

కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. తమ అక్రమాలకు అడ్డుతగిలే అధికారులపై బెదిరింపులకు పాల్పడడం.. తన దారిలోకి వచ్చేలా అమ్యామ్యాలు చెల్లించడం వంటివి ఆక్రమణదారుడు చేసేవాడనే ఆరోపణలు వస్తున్నాయి. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని ఉపయోగించిన అక్రమార్కులు స్థలాన్ని గుట్టుచప్పుడుకాకుండా నూజివీడులో రిజిస్ట్రేషన్ చేయించడంలో కొంతమంది అధికారులు ఇతగాడికి దాసోహమై పనిచేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కబ్జాదారుల రిజిస్ట్రేషన్ చేయించుకున్న 550 గజాల ఇరిగేషన్ భూమి 32 సర్వే నంబరులో ఉంది. అయితే 31/1ఏ సర్వే నంబరు చూపిస్తూ భూమిని తన కొడుకుల పేరుతో ఆ వైసీపీ నేత నూజివీడులో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టుగా తెలుస్తోంది.

మూడు సార్లు కార్పొరేషన్‌కు లేఖలు రాశాం : ఇరిగేషన్ ఏఈ

ఇరిగేషన్ భూమి ఆక్రమణలకు గురవుతుందని గుర్తించిన మీదట రక్షణ చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగానికి మూడుసార్లు లేఖలు రాశాం. గతంలో ఇరిగేషన్ శాఖ భూములని హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి మరోసారి తీసుకువెళ్లి ఆక్రమణలకు ప్రయత్నిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

ఇంటి ప్లాన్‌లు చూసి పన్నులు వేశాం : శ్యామ్. కార్పొరేషన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

అవి ఇరిగేషన్ భూములని మాకు తెలీదు. కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగం ఆ ప్రాంతాలలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. ఆ ప్లాన్‌ల ప్రకారమే మేము వాటికి పన్నులు వేశాం.

స్పందించని టీపీవో... చర్యలు తీసుకుంటామన్న ఏసీపీ

ఈ భూకబ్జా వ్యవహారంపై కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ టీపీవో మథిన్‌ను 'ఆంధ్రజ్యోతి' ఫోనులో సంప్రదించగా స్పందించలేదు. దీనిపై ఏసీపీ రాంబాబును వివరణ కోరగా తాను సెంట్రల్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టి రెండు నెలలే అయ్యిందని.. ఈ భూకబ్జాల వ్యవహారంపై సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు

వరించిన పదవి

(7వ పేజీ తరువాయి)

ఒప్పించుకోగలిగారు.

స్వతంత్ర అభ్యర్థిని బరిలో నిలిపేందుకు సైతం..

సోమవారం అర్ధరాత్రి వరకూ జరిగిన మంతనాలు మంగళవారం ఉదయం కూడా కొనసాగాయి. చివరకు అధిష్టానం సౌమ్యకు ఒక ప్రతిపాదన పంపింది. ఎంపీ సూచించిన స్వర్ణలత, సౌమ్య సూచించిన కామసాని సత్యవతిలకు కాకుండా మధ్యమార్గంగా పదవ వార్డుకు చెందిన మండవ కృష్ణకుమారి పేరు ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలు, ఆదేశాలను పక్కకు తోసిన సౌమ్య ఖాళీ బీఫారం పంపితే తన నిర్ణయం ప్రకారం అభ్యర్థిని ఎంపిక చేసుకుంటానని తేల్చి చెప్పినట్లు సమాచారం. అనుక్షణం ఒత్తిడి పెరగడంతో పది గంటలకు పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి ఉండగా, 9 గంటలకే కౌన్సిలర్లను వెంటపెట్టుకొని సౌమ్య ఎన్నికల కేంద్రానికి వెళ్లారు. సమావేశ మందిరంలోకి వెళ్లిన తర్వాత కూడా సిఫార్సుల కాల్స్ వస్తుండడంతో అందరి ఫోన్‌లు స్విచ్ ఆఫ్ చేయించి బయటకు పంపారు. సీనియర్ నాయకురాలు కామసాని సత్యవతికి చైర్‌పర్సన్ పదవి ఇవ్వనున్నట్లు సౌమ్య అప్పటికే పలు మార్లు పార్టీ పెద్దలకు తెలియజేశారు. ఎన్నికల హాల్‌లో కూడా కౌన్సిలర్లతో మాట్లాడుతూ సత్యవతి పేరు ప్రస్తావించినట్లు తెలిసింది. తాను కోరిన విధంగా ఖాళీ బీఫారం అందక పోతే స్వతంత్ర అభ్యర్థిగా తాను మద్దతు ఇచ్చే అభ్యర్థిని బరిలోకి దింపేందుకు సౌమ్య సిద్ధపడ్డారు. ఈ తరుణంలో జోక్యం చేసుకున్న మునిసిపల్ మంత్రి నారాయణ సౌమ్యతో ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు మధ్యమార్గంగా మండవ కృష్ణకుమారిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించాలని సూచించారు. అధిస్టానం ఆదేశాలను సౌమ్య గౌరవించడంతో ఆఖరి నిముషంలో కృష్ణకుమారికి చైర్‌పర్సన్ పీఠం దక్కింది.

భూ మాయ!

(7వ పేజీ తరువాయి)

సందర్భంలో ఈ భూముల్లో వివాదాలు తలెత్తుతున్నాయి. అప్పటికి కానీ భూములను కొని మోసపోయామని కొనుగోలుదారులకు అర్థం కావటం లేదు. చిట్టచివరి కొనుగోలుదారుడు ఎవరైతే ఉంటారో వారు నష్టపోతున్నారు. ఎవరినీ ప్రశ్నించలేని పరిస్థితి. దీనికి వారు కొన్న భూమి అప్పటికే అనేక మంది చేతులు మారి ఉండటమే కారణం. చైన్ లింక్‌గా విచారించుకుంటూ పోతే అసలు మొట్టమొదటి డాక్యుమెంట్ కలిగిన వారు జీవించే ఉండరు.

అక్రమ రిజిస్ట్రేషన్లతో తలనొప్పులు

ఈ భూ మాయలో అక్రమ రిజిస్ట్రేషన్లే ప్రధానం.

వాస్తవానికి ఉన్న సర్వే నంబర్లు కాకుండా వాటి మీద ఏ, బీ అంటూ రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి. ఇలాంటి వ్యవహారాల్లో పలువురు డాక్యుమెంట్ రైటర్ల హస్తం కూడా ఉంది. విజయవాడ శివారు ప్రాంతాల్లో పని చేసే కొంతమంది వీఆర్‌వోలు డాక్యుమెంట్ రైటర్లుగా కూడా అవతారం ఎత్తి ఉన్నారు. దాదాపుగా దశాబ్దంన్నర అంతకు మించి కూడా ఇదే ప్రాంతాల్లో గ్రామాలు మారుతూ పనిచేస్తున్నారు. కొంతమంది వీఆర్‌వోలకు ప్రైవేటుగా డాక్యుమెంట్ రూపకల్పన చేసే ఆఫీసులు కూడా ఉన్నాయి. రెవెన్యూ తమ చేతిలో ఉండటం, డాక్యుమెంట్ రైటర్లుగా కూడా చెలామణిలో అవ్వడంతో.. ఇంకేముంది? అక్రమ రిజిస్ట్రేషన్లకు అందించాల్సిన సహకారం అంతా అందించేస్తున్నారు. ఎఫ్ఎంబీలో మార్పులు చేసి కాపీలు మార్చటం, ఎఫ్ లైన్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయించటం, తహసీల్దార్ల పేరిట నకిలీ ఎన్‌వోసీలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించటం వంటి పాపాలు చేశారు. అవినీతికి అలవాటు పడిన సబ్ రిజిస్ట్రార్లు కూడా అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేసేశారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

'ఫీజు పోరు' జగన్ ప్యాలెస్ ముందు చేయండి : నగేష్

పటమట: వైసీపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ఫీజు పోరు చేయాల్సింది కలెక్టరేట్ ముందు కాదు జగన్ ప్యాలెస్ ముందు అని టీడీపీ నాయకుడు బెజవాడ నగేష్ ఎద్దేవా చేశారు. మంగళవారం పటమట 11వ డివిజన్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ గత ఐదేళ్లలో 2,832 కోట్లు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు, వసతి దీవెన బకాయిలు రూ.989 కోట్లు ఇలా మొత్తం కలిపి 5,447 కోట్లు బకాయిలు పెట్టి విద్యార్థులను, తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురి చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ 8 నెలల్లో 8 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేసి విద్యార్థుల కుటుంబాల్లో ఆర్థిక మనోధైర్యం నింపారన్నారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే కృషి చేస్తుంది. మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు. పది మందికి, మీ ప్రాంత వాసులందరికీ సమస్య అయి ఉండాలి.

మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం: ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

ఆటోనగర్‌లో ఏ రోడ్డు చూసినా ..

- చెత్త చెదారంతో నిండిన రోడ్లు...పూడిక తీసి తొలగించరు
- చెట్ల కొమ్మలు నరికి వదిలేస్తున్న వైనం

(ఆటోనగర్, ఆంధ్రజ్యోతి)

ఆసియాలో అతిపెద్ద ఆటోనగర్ పారిశ్రామికవాడ చెప్పుకోవడానికి మాత్రమే..పారిశుధ్యంలో మాత్రం ఆమడ దూరంలో ఉంది. ఆటోనగర్‌లో ఏ రోడ్డు చూసినా చెత్త చెదారంతో నిండిపోయింది. డ్రెయినేజీ నుంచి తీసిన పూడికతీతను గుట్టలుగా పోసేస్తున్నారు. దీంతో రహదారంత పూడికతీత ఆక్రమించినట్లు అవుతోంది. దీనిపైనే చెత్త వేయడంతో పెద్దగుట్టగా ఏర్పడి దుర్గంధం వెదజల్లుతోంది. విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్నాయని చెట్ల కొమ్మలు నరికి అక్కడే పడేస్తున్నారు. వాటిని విద్యుత్ సిబ్బంది తొలగించకుండా అలాగే వదిలేయడంతో చెత్త మరింత పెరిగిపోతుంది. పారిశుధ్య కార్మికుల కొరతతో నెలలో రెండు సార్లు మాత్రమే వస్తున్నారని ఆటోనగర్ వాసులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించి రహదారులను శుభ్రం చేయాలని స్థానికులు కోరతున్నారు.



రహదారిపైనే పేరుకుపోయిన చెత్త



సమష్టి దివ్యపూజా బలి సమర్పిస్తున్న గురువులు



నవదిన ప్రార్ధనలకు తరలివచ్చిన భక్తులు

మత సామరస్యానికి ప్రతీక గుణదల పుణ్యక్షేత్రం

- శ్రీకాకుళం మేత్రాసనం ఫాదర్ చల్లా డేవిడ్
- 5వ రోజుకు చేరుకున్న నవదిన ప్రార్ధనలు

గుణదల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో అతిపెద్ద రెండో కతోలిక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న గుణదలమాత పుణ్యక్షేత్రం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని శ్రీకాకుళం మేత్రాసనం ఫాదర్ చల్లా డేవిడ్ అన్నారు. లూర్ధుమాత మహోత్సవాల నవదిన ప్రార్థనల్లో భాగంగా మంగళవారం సాయంత్రం జరిగిన 5వ రోజు నవదిన ప్రార్ధనలకు ముఖ్య అతిథిగా ఫాదర్ చల్లా డేవిడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సందేశమిస్తూ మరియమాత భక్తుల చేత మహిమల మాతగా గౌరవించబడుతుందని తెలిపారు. పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉత్సవ కమిటీలు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారని తెలిపారు. గురువులు ఫాదర్ చెల్లా డేవిడ్, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, రెక్టర్ జయరాజు, కొలకాని మరియప్ప, తోట సునీల్ రాజు తదితరులు సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు. అనంతరం నిరుపేదలు, అనాధలు, శరణార్థుల కోసం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



పటమట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వరి, లలితా పరమేశ్వరి అమ్మవార్ల రజతోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం మాగ సప్తమి గణపతి పూజ, పుణ్యాహ వచనం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ శిఖరానికి మహాకుంభాభిషేకం నిర్వహించారు. 108 జంటలు, 300 మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆవుల నాచరయ్య, యామ శివన్నారాయణ, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి నాగేశ్వరరావు, రంగలక్ష్మి, మేకల నాగేశ్వరరావు, రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తిపీఠంలో అరుణపారాయణ, సూర్యనమస్కారాలు



కృష్ణలంక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): త్రిశక్తిపీఠంలో రథసప్తమి సందర్భంగా మంగళవారం అరుణపారాయణం, సూర్యనమ స్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మూర్తి సూర్యప్రకాష్ శర్మ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. రాజశ్యామలా దేవిగా కాళీమాత అమ్మవారు 6వ రోజైన మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. రాజశ్యామల హోమాన్ని నారాయణ శాస్త్రి, భారతుల విజయ్‌కిరణ్ శర్మ నిర్వహించారు.

వైభవంగా భద్రావతి భావనఋషి స్వామి కల్యాణం



లబ్బీపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): లబ్బీపేటలోని పద్మశాలీయ కల్యాణమండపంలో మంగళవారం భద్రావతి భావనఋషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాఘమాస శుద్ధ రథసప్తమి పర్వదినం, పుష్కరాంశంలో ఈ కళ్యాణం నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. గోలి భాస్కరరావు దంపతులు, కొల్లి సాంబశివరావు దంపతులు, మురళీకృష్ణ, దామర్ల శాంతి దంపతులు ఆనవాయితీగా 9మంది దంపతులచే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవంలో అతిథులుగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, గద్దె క్రాంతి కుమార్, పి.శ్రీధర్, పద్మశాలియా కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, శ్రీనివాసరావు, యువజన సేవా సంఘం, మహిళా మండలి అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం కూల్చివేత



లబ్బీపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా నిర్మిస్తున్న అనధికార నిర్మాణాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. బందర్‌రోడ్డులోని కేఎఫ్‌సీ ఎదురుగా ఈ నిర్మాణాన్ని కటౌటాలను అడ్డుగా పెట్టి నిర్మిస్తున్నారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారులు ఫిర్యాదులు రావడంతో మంగళవారం అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు పర్యవేక్షణలో ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్యాన్సర్ బాధితుడికి గద్దె క్రాంతి విరాళం

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మాచవరం 2వ డివిజన్‌కు చెందిన పులి శేషుబాబు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న టీడీపీ యువనేత గద్దె క్రాంతి కుమార్ మంగళవారం గద్దె ఫౌండేషన్ ద్వారా రూ.25 వేలను బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంగా అందించారు. ఈకార్యక్రమంలో దాసరి గాబ్రియేలు, సుగసాని కృష్ణ ప్రసాద్, ముత్యాల కృష్ణ, ఈదా కొండ, కుంచాల కోటేశ్వరరావు, నాళం నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవన శైలితో క్యాన్సర్‌ను అరికట్టవచ్చు

డాక్టర్ ఎన్.సుబ్బారావు

భారతీనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు క్రమం తప్పకుండా వైద్యపరీక్షల ద్వారా క్యాన్సర్ వ్యాధిని అరికట్టవచ్చు అని అనిల్ క్యాన్సర్ సెంటర్ వైద్యనిపుణులు, అంకాలజిస్ట్ డాక్టర్ ఎన్.సుబ్బారావు అన్నారు. ఆంధ్రా లయోలా కళాశాలలో మహిళా సెల్ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల సెమినార్ హాల్‌లో ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా క్యాన్సర్ వ్యాధి నివారణపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎన్.సుబ్బారావు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ఎదుర్కోవడంలో క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు(రెగ్యులర్ స్క్రీనింగ్), ప్రారంభ రోగనిర్ధారణ, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.తబిత, ఫాదర్ కిరణ్ కుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్. సుబ్బారావు

నాస్తిక మేళా 8, 9 తేదీల్లో

ధర్నాచౌక్: నాస్తిక సమాజం ఆధ్వర్యంలో 33వ జాతీయ నాస్తిక మేళా ఈ నెల 8, 9 తేదీల్లో జరుగుతుందని విజయవాడ శాఖ కన్వీనర్ ఎస్‌కే జిలానీ బేగం తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చార్వాకాశ్రమంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాస్తిక సమాజం నాయకుడు శివారెడ్డి మాట్లాడుతూ సైన్స్, శాస్త్రీయ భావజాలం నుంచి సమాజాన్ని చీకటి యుగాల వైపు మళ్లించే ప్రయత్నం జరుగుతందన్నారు. వీవీడీఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భౌతికవాదానికి సంబంధించిన ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సునీత తదితరులు

సిద్ధార్థ ఫార్మసీ విద్యార్థులకు బహుమతులు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో మూడు రోజుల పాటు నెక్సజన్ ఫార్మా కనెక్ట్ 2కె25 పేరుతో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో తమ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించారని కేవీఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ 3వ సంవత్సరం విద్యార్థిని డి. హేమమహేశ్వరీ నానో టెక్నాలజీ ఇన్ అగ్రికల్చర్ వర్సెస్ ఫుడ్ సెక్యూరిటీపై రూపొందించిన పోస్టర్‌కు ప్రథమ బహుమతి, టి.తపస్విని హెర్బల్ లిప్‌స్టిక్ తయారీపై చేసిన పరిశోధనకు ద్వితీయ బహుమతి లభించిందని పేర్కొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లూర్దునగర్, బెత్లేహేంనగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల ఏఈ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కృష్ణలంక రైతుబజారుకు మార్గం సుగమం

గద్దె క్రాంతికుమార్ చొరవతో సమస్యకు పరిష్కారం

కృష్ణలంక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక రైతుబజారుకు వచ్చేందుకు వ్యాపారులు, వినియోగదారుల సౌకర్యార్థం మూసివేసిన బారికేడ్లను తొలగించారు. కృష్ణలంక జాతీయ రహదారిపై కృష్ణలంక పోలీసు స్టేషన్ సమీపంలో రైతుబజారుకు వచ్చే రహదారిని బారికేడ్లతో మూసివేయడంతో వినియోగదారులు రాక వ్యాపారాలు పడిపోయాయని టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్‌కు వ్యాపారులు మొరపెట్టుకోవడంతో ఆయన మంగళవారం స్వయంగా పరిశీలించారు. కృష్ణలంక నుంచి జాతీయ రహ దారి మీదుగా రైతుబజారుకు వచ్చే వినియోగదారులు పోలీసు స్టేషన్ సమీపంలో యూ టర్న్ తీసుకొని వచ్చేవారు. అయితే వారం రోజుల నుంచి కృష్ణలంక పోలీసులు ఆ దారిని బారికేడ్లతో మూసివేయడంతో బస్టాండ్ వరకు వెళ్లి అక్కడ నుంచి రైతుబజారుకు రావాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ వారం రోజుల్లో తమ వ్యాపారాలు ఒక్కసారిగా పడిపోయాయంటూ రైతుబజారు వ్యాపారులు గద్దె క్రాంతికుమార్‌కు మొరపెట్టుకొన్నారు. దీంతో ఆయన స్థానిక టీడీపీ నేతలతో కలిసి మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి కృష్ణలంక సీఐతో మాట్లాడారు. వ్యాపారులు, వినియోగదారుల సౌకర్యార్థం మూసివేసిన బారికేడ్లను తీసివేయాలని కోరడంతో పోలీసులు వాటిని తొలగించి మార్గం సుగమం చేశారు. దీంతో వ్యాపారులు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం క్రాంతికుమార్ రైతుబజారులోకి వెళ్లి వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలనడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, పలిశెట్టి అన్నారావు, పెద్ది అన్నారావు, రైతుబజారు ఈవో జాన్ విక్టర్ పాల్గొన్నారు.



మూసిన మార్గాన్ని తెరిపించాలని గద్దె క్రాంతికుమార్‌కు విన్నవించుకుంటున్న రైతు బజారు వ్యాపారులు

యువత పోటీతత్వం అలవర్చుకోవాలి

సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా



బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా, కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి

గుణదల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): యువత చిన్న నాటి నుంచి పోటీతత్వం అలవర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హితవు పలికారు. జనవరి 30న బొండా ఉమా పుట్టిన రోజును పురస్కరించుకుని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో నిర్వహించిన పలు ఆటలపోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతి ప్రదానం చేసే కార్యక్రమం కళాశాల ఆవరణలో మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బొండా ఉమా చేతుల మీదుగా ఆటల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతితోపాటు షీల్డు అందజేశారు. బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్లో విన్నర్స్ బహుమతి కింద గుణదలకు చెందిన శాండీ సీసీకు రూ. 50వేలు, రన్నర్స్ వన్‌టౌన్‌కి చెందిన భక్షు సీసీకు రూ. 25వేలు, ఈ టోర్నమెంట్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ కింద జగదీష్‌కు రూ. 20వేలు అందజేశారు. ఉమ్మడి జిల్లాల నుంచి ఈ టోర్నమెంట్లో మొత్తంగా 38 టీమ్స్ పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, డివిజన్ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, టీడీపీ నాయకులు కారంపూడి సత్య, ప్రకాష్, డేవిడ్, దాసు, శశి, శివప్రసాద్, దుర్గారావు, గణేష్ పాల్గొన్నారు.

మధ్యతరగతివారి కొనుగోలు శక్తిని పెంచేలా బడ్జెట్

యూబీఐ చీఫ్ మేనేజర్ ప్రకాష్‌బాబు

గుణదల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ 2025-26లో మధ్యతరగతి వారి కొనుగోలు శక్తిని పెంపొందించేలా రూపకల్పన చేయడం గర్వించదగిన విషయం అని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ఎం.ప్రకాష్ బాబు అన్నారు. స్థానిక ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర బడ్జెట్ 2025-26 అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా కేంద్రీకృత అభివృద్ధి లక్ష్యంగా వికసిత్ భారత్ అనే అంశంతో 2025-26 కేంద్ర బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు లక్ష్యం జీడీపీలో 4.4గా నిర్ణయించడం జరిగిందని చెప్పారు. సంవత్సరానికి రూ.12 లక్షల వరకు వ్యక్తిగత పన్ను మినహాయింపు ప్రకటించడంతో దేశ వ్యాప్తంగా అందరూ స్వాగతిస్తున్నారన్నారు. టర్నోవర్ పరిమితులను 2.5, 2 రెట్లు పెంచ బడ్డాయని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజల అవసరాలు, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ఏడాది బడ్జెట్ రూపకల్పన ఉందన్నారు. ఎస్.సుకుమార్, నారాయణ రావు, నాగేశ్వరరావు, విజయ్‌దీప్ పాల్గొన్నారు.

ఆక్వాలో ఆక్రందనలు

జిల్లాలో ఆక్వా సాగు అంతకంతకూ పెరుగుతున్నా ఆటుపోట్లు మాత్రం తప్పట్లేదు. ఎన్టీఆర్ జిల్లా నాన్ ఆక్వాజోన్ పరిధిలో ఉండటం, సాగుదారులకు విద్యుత్ సబ్సిడీ అందకపోవడమే ఇందుకు కారణం. సబ్సిడీని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎత్తేయడంతో ఈ పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్న వారికి ఆర్థికభారం తప్పలేదు. అయితే, ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీ మేరకు నాన్ ఆక్వాజోన్ పరిధిలోని వారికి కూడా విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, జి.కొండూరు


రొయ్యల చెరువులో ఆక్సిజన్ కోసం తిరుగుతున్న ఫ్యాన్స్

- ఆర్థిక ఆటుపోట్ల మధ్య జిల్లా రైతులు
- ఆక్వాజోన్ హోదా ఇస్తేనే అభివృద్ధి
- విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని వేడుకోలు
- వైసీపీ హయాంలో తొలగించిన సబ్సిడీ

సహజసిద్ధ వాతావరణం లేకపోయినప్పటికీ జిల్లాలో ఆక్వా సాగు విస్తరిస్తోంది. సొంత పొలాలను చేపల చెరువులుగా మార్చుకుని మరీ సాగు చేపడుతున్నారు. పశ్చిమ ప్రాంతంలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో 430 ఎకరాలు, తిరువూరు నియోజకవర్గంలో 80 ఎకరాలు, జగ్గయ్యపేటలో 120 ఎక టరాల చొప్పున చేపలు, రొయ్యల చెరువులున్నాయి. అయితే, అనుకున్నంత తేలిగ్గా సాగు జరగట్లేదు.

విద్యుత్ చార్జీల భారం

చేపలు, రొయ్యల సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ చార్జీలు భారంగా మారాయి. జిల్లాలోని ఈ ప్రాంతమంతా నాన్ ఆక్వాజోన్‌లో ఉండటంతో చేపల, రొయ్యల చెరువులకు అమలుచేసే విద్యుత్ సబ్సిడీ ఈ ప్రాంతానికి వర్తించట్లేదు. దీంతో నాన్ ఆక్వాజోన్ పరిధిలో యూనిట్ విద్యుత్ ధర రూ.4 నుంచి రూ.5 వరకు చెల్లించాల్సి వస్తోంది. అదే ఆక్వాజోన్‌లో ఉండి ఉంటే సబ్సిడీ కింద యూనిట్ విద్యుత్ ధర రూ.1.50కే లభించేది. చేపలు, రొయ్య లకు ఆక్సిజన్ అందించటానికి మోటార్లు ఉపయోగిస్తారు. ఈ మోటార్లు నిరంతరాయంగా తిరుగుతూ ఉండాలి. లేదంటే చేపలు, రొయ్యలు చనిపోతాయి. దీంతో రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు వస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. 2014-19 మ ధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాం లో బాగానే ఉన్న ఆక్వా రైతులు.. 2019-24 మధ్య వైసీపీ హయాంలో కుదేలయ్యారు. అప్పటి వరకు ఇచ్చిన అనేక రాయితీలతో పా టు విద్యుత్ సబ్సిడీని కూడా తొలగించడంతో ఆక్వా రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నా రు. ముఖ్యంగా విద్యుత్ సబ్సిడీ లేక సాగుభారం మరింత పెరిగిందంటున్నారు. ఆక్వాజోన్‌తో సం బంధం లేకుండా నాన్ ఆక్వాజోన్‌లోని ప్రాంతాల్లో చేపలు, రొయ్యల చెరువులకు విద్యుత్‌ను సబ్సిడీపై అందిస్తామని ఎన్నికల ముందు టీడీపీ కూటమి పార్టీ లు హామీ ఇచ్చిందని రైతులు చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే అనేకసార్లు ప్రభుత్వ పెద్దలను కలిశామంటున్నారు. త్వరగా నిర్ణయం తీసుకుని ఆక్వాకు పూర్వవైభవాన్ని తీసుకురావాలని కోరుతున్నారు.

పెట్టుబడి కూడా రావట్లేదు..



పెరిగిన ఖర్చులతో రొయ్యల పెంపకం భారంగా మారింది. లాభాలు సరే పెట్టుబడి ఖర్చులు వస్తే చాలనిపిస్తుంది. విద్యుత్ సబ్సిడీ వస్తే చాలా వెసులుబాటుగా ఉంటుంది. నీటి నాణ్యత కోసం, రొయ్యలకు ఆక్సిజన్ అందించడం కోసం అధిక ఖర్చవుతోంది. ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలి.

- రవి, సాగుదారుడు

రాయితీలు ఇస్తే బాగుంటుంది



ప్రభుత్వం రొయ్యల సాగుచేసే వారికి రాయితీలు ఇవ్వాలి. అంతేకాకుండా నాణ్యమైన మందులు అందించాలి. ఆక్వాజోన్‌లో ఇచ్చే అన్ని రకాల రాయితీలు నాన్ ఆక్వాజోన్ వారికీ వర్తింపజేయాలి. కూటమి పార్టీలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చాలి. వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నష్టపోయాం. ఇప్పుడైనా లాభాల బాట పట్టకుంటే సాగు మానేయాల్సిన పరిస్థితి వస్తుంది.

- నాని, సాగుదారుడు

ఆక్వాజోన్‌లో ఉంటేనే విద్యుత్ సబ్సిడీ

- చదువుల సౌభాగ్య చక్రాణి, జిల్లా మత్స్యశాఖ ఇన్‌చార్జి అధికారిణి

ఆక్వాజోన్‌లో 10 ఎకరాల్లోపు సాగు చేస్తున్న చిన్న, మధ్యతరగతి చెరువుల సాగు రైతులకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ లభిస్తుంది. వారికి మాత్రమే యూనిట్ రూ.1.5కు లభిస్తుంది. మిగిలిన వారికి రూ.3.85 అవుతుంది. నాన్ ఆక్వాజోన్ అయితే, యూనిట్ ధర రూ.5 ఉంటుంది.

9న శతాధిక మృదంగ లయ విన్యాసం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దండమూడి రామ్మోహన్ రావు లయ వేదిక ఆధ్వర్యంలో మృ దంగ శబ్దబ్రహ్మ, మృదంగ చక్రవర్తిగా ప్రఖ్యాతిగాంచిన దండమూడి రామ్మోహన్‌రావు 95వ జయంతి వేడుకలు ని ర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షురాలు ప్ర ముఖ మృదంగా విద్వన్మని సుమతి రా మ్మోహన్ రావు పేర్కొన్నారు. సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీ త కళాశాలలో ఈనెల 9న సాయంత్రం వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 100కు పైగా మృదంగ విద్వాంసులతో మహా బృంద లయ విన్యాసం (శతాధిక మృదంగ వాద్య లయ విన్యాసం) నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతిభ కలిగిన 9 మంది మృదంగ విద్వాంసులు కామరాజు విష్ణుమూర్తి, వంకాయల వెంకట రమణమూర్తి, కూలిపాల శ్రీరామ్ మూ ర్తి, మండపాక నాగలక్ష్మి, బీవీఎస్ ప్రసా ద్, సద్గురు చరణ్, గుంటుకు వెంకట్రా వ్, పున్నమరాజు మురళీకృష్ణకు దండమూడి రామ్మోహనరావు పేరిట జ్ఞాపిక పురస్కారాలు అందచేయనున్నట్టు సుమతీ రామ్మోహన్ రావు తెలిపారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు

- వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ లక్ష్మీశ

మొగల్రాజపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి జీవితంలో పదవ తరగతి చాలా ముఖ్యమైన దశ. ఈ దశలో పరీక్షలు కీలకం. బాగా చదువుకుని మంచి మార్కులు సాధించి, మంచి కోర్సులను ఎంపిక చేసుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం రాత్రి ఎనిమిదిన్నర సమయంలో కస్తూరిబాయి పేటలోని బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. సౌకర్యాల గురించి అడిగారు. ఏ విద్యార్థీ ఫెయిల్ కాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. సబ్జెక్ట్ నిపుణులు, ట్యూటర్లతో ప్రత్యేక శిక్షణ ఇప్పించి వెనుకబడిన అంశాలపై పట్టు సాధించేలా 100 శాతం ఉత్తీర్ణత ఉండేలా చూడాలన్నారు. ఎప్పటికపుడు పరీక్షలు నిర్వహి ంచి పిల్లలకు పరీక్షలంటే భయం పోయేలా చేయాలని చెప్పారు. హాస్టల్ వార్డెన్ కృష్ణకుమారి ఉన్నారు.

పీఈటీని వేధించిన హెచ్‌ఎం సస్పెన్షన్

వన్‌టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాదర్తి సుందరమ్మ మునిసిపల్ కార్పొరేషన్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.రత్నకుమారిని సస్పెండ్ చేస్తూ కాకినాడలోని జోన్-2 విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు జి.నాగమణి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. హైస్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్న మాధవీదేవి తనను రత్నకుమారి వేధిస్తోందంటూ పై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని, పైగా తనకే మెమో ఇవ్వడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం వన్‌టౌన్ కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద ఏవో మాత్రలు మింగి ఆత్మహత్యానికి పాల్పడ్డారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు పరామర్శించారు. ఈక్రమంలో డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు అటు ప్రధానోపాధ్యాయురాలు డి.రత్నకుమారి, ఇటు మాధవిదేవి పరస్పరం ఆరోపణలు చేసుకున్నారని, ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు రత్నకుమారిని సస్పెండ్ చేస్తున్నామని, మాధవీదేవిని కూడా విచారించి ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

హెచ్‌ఎంపై పోలీసులకు ఫిర్యాదు

ఆత్మహత్యాయత్నం చేసిన మాధవిదేవి చేచేని మంగళవారం పోలీసులు విచారించిన క్రమంలో తనను వేధించిన సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రాణాయామంతో ఒత్తిడిని ఎదుర్కోవచ్చు

- ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థులకు ఎదురయ్యే వివిధ ఒత్తిడి సమస్యలను వాటిపై అవగాహన పెంచుకోవడంతోనే పరిష్కరించుకోగలుగుతామని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ తెలిపారు. ఒత్తిడిని ఎదుర్కొనే పద్ధతులపై కళాశాల మహిళా సాధికారతా విభాగం అండ్ ఇంక్లూజివ్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యశాలకు ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ యోగా, మనస్తత్వ శిక్షకుడు అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ తీవ్ర మనోవేదనలను, ఉద్విగ్నతలను ప్రాణాయామం ద్వారా ఎదుర్కోవచ్చన్నారు. ఒత్తిడిని తగ్గించుకొనే వివిధ మార్గాలను, మెలకువలను సోదాహరణంగా వివరించారు. మనస్తత్వ వేత్తలు మాధవి, మహిమ విద్యార్థుల పలు సందేహాలను శిక్షకులు నివృత్తి చేశారు. డాక్టర్ సుధారాణి, సత్యవాణి, లావణ్య, డాక్టర్ నాగలక్ష్మి, దివ్య, డాక్టర్ బాలకృష్ణ, అరుణ, ప్రసాదరావు మాట్లాడారు. కళాశాల ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సుమిత్ర పర్యవేక్షించారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



బెజవాడలో ఆకాశ హర్మ్యం

నగరంలో అత్యంత ఎత్తయిన జీప్లస్20 భవనం

- 'కేఎంవీ వివాన్'పై హెలీప్యాడ్ ప్రత్యేక ఆకర్షణ
- ఎమర్జెన్సీ మెడికల్, అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా సదుపాయం
- సకల సౌకర్యాలతో సిద్ధమైన హైరైజ్ బిల్డింగ్



ఆంధ్రజ్యోతి-విజయవాడ: విజయవాడలో ఆకాశాన్ని అందుకునేలా కనిపించే జీప్లస్20 అంతస్తులతో కూడిన భవనం సిద్ధమైంది. ఇది నగరంలోనే అత్యంత ఎత్తైన బిల్డింగ్. ఎనికేపాడు-తాడిగడప వంద అడుగుల రోడ్డు వెంబడి ఉండే ఈ హైరైజ్ భవనంపై హెలిప్యాడ్ నిర్మాణం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మెట్రో నగరాలు, అభివృద్ధి చెందిన దేశాల్లో కనిపించే టవర్స్ మాదిరిగా ఈ 'కేఎంవీ వివాన్' బిల్డింగ్ రూపుదిద్దుకుంది. బెజవాడలో తొలి హెలిప్యాడ్ కలిగిన భవనం ఇదే! ఎలాంటి సామర్థ్యం కలిగిన హెలికాప్టర్ అయినా ఇక్కడ ల్యాండ్ కావచ్చు. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో వెళ్లే ప్రయాణికులకు ఈ ఆకాశ హర్మ్యం కనిపిస్తుంది. నగరంలో ఈ హైరైజ్ బిల్డింగ్ సంస్కృతికి 15 ఏళ్ల కిందట ఆటోనగర్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థల భవన్ మొదటగా శ్రీకారం చుట్టింది. జీప్లస్ 8 విధానంలో నిర్మించిన ఈ భవనం తర్వాత భవానీపురంలో ఒకటి, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో మరొకటి నిర్మించారు. ఈ రెండూ గ్రూప్ బిల్డింగ్స్‌తో జీప్లస్16, ఆ లోపు మాత్రమే ఉన్నాయి.

ఈ జీప్లస్20 భవనంపై ఉండే హెలీప్యాడ్ వైద్యం వంటి అత్యవసర సమయాల్లోనూ ఉపయోగపడుతుంది. వీఐపీలు హెలికాప్టర్ ద్వారా ఇక్కడ దిగి.. రోడ్డు మార్గం మీదుగా విజయవాడ నగరంలోని త్వరగా చేరుకోవచ్చు. ఈ భవనంలో 3, 4 బెడ్రూమ్‌లతో కూడిన ఫ్లాట్లు ఉన్నాయి. ఈ హైరైజ్ బిల్డింగ్‌ను చూడటానికి సందర్శకులను అనుమతిస్తున్నారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్లపై 6న చలో ఢిల్లీ

- బోను దుర్గా నరేష్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యో తి): బీసీలకు 50శాతం రిజర్వేషన్ల సా ధనే లక్ష్యంగా ఈ నెల 6 చలో ఢిల్లీ త లపెట్టినట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గ నరేష్ పేర్కొన్నా రు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో నిర్వహిం చే రౌండ్‌టేబుల్ సమావేశంలో బీసీల రిజర్వేషన్లతో పాటు ప్రధాన సమస్యల పై తీర్మానించి ప్రధాని మోదీ దృష్టికి వాటిని తీసుకువెళ్తామన్నారు. దేశవ్యాప్తంగా 26రాష్ట్రాల నుంచి బీసీ పార్లమెం ట్ సభ్యులు, కేంద్రమంత్రులు సమావేశంలో పాల్గొంటారన్నారు. 5 దశాబ్దాల నుంచి బీసీల కోసం పోరాడుతున్న రా జ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యం లో తమ పోరాటం కొనసాగుతుందన్నా రు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగు విక్రమ్, పెంట సాయికిర ణ్, మెండెం జ్యోతి, వరప్రకాష్, జవ్వాది సుధీర్, హేమ, వరలక్ష్మీ పాల్గొన్నారు.

బీమా రంగంలో ఎఫ్‌డీఐల పెంపు అవాంఛనీయం

- భోజన విరామంలో ఉద్యోగుల నిరసన ప్రదర్శన

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో ఎఫ్‌డీఐల పెంపు అవాంఛనీయమని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) మచిలీపట్నం డివిజనల్ జాయింట్ సెక్రటరీ చిలకలపూడి కళాధర్ అన్నారు. బీమా రంగంలో ఫారిన్ డైరెక్ట్ ఇన్‌వెస్ట్‌మెంట్ (ఎఫ్‌డిఐ)ని 74శాతం నుంచి 100శాతానికి పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఏఐఐఈఏ పిలుపు మేరకు మంగళవారం బీసెంట్ రోడ్డులోని ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట బీమా ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాధర్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంగా బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించడం ప్రభుత్వ రంగ బీమా వ్యాపారాన్ని దెబ్బతీయడమేనన్నారు. భారతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఇది గొడ్డలిపెట్టు చర్య అన్నారు. దీంతో ప్రభుత్వ విధానాలపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఏఐఐఈఏ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ చర్యకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తామన్నారు. బీమా పరిశ్రమను కార్పొరేట్ లాభాల కోసం కాకుండా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేయాలన్నానాన్నారు. యూనియన్ నేతలు ఎన్‌ఎంకే ప్రసాద్, ఈవీ తులసీరావు, ఎస్. శ్రీనివాస్, సీహెచ్ రాజశేఖర్, కె. కృష్ణప్రసాద్, వీకే సాయిప్రసాద్, గుర్రం శ్రీనివాస్, ఏపీ గోవర్ధన్ పాల్గొన్నారు.



బీసెంట్ రోడ్డులోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాసు

క్యాన్సర్‌పై సంయుక్త పోరాటం

- రైల్వే ఆసుపత్రి చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసు

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను జయించేందుకు కొత్త తరహాలో కలిసికట్టుగా పోరా టం (ఫైట్ బై యూనిక్) చేయాలని విజయవాడ రైల్వే ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ జే శ్రీనివాసు అన్నారు, క్యాన్సర్ డే సందర్భంగా మంగళవారం రైల్వే ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారి ఎంతగా వేధిస్తోంది. పర్యవసాలు, పరిణామ క్రమంలో జరిగే అనర్థాల గురించి వివరించారు. అదనపు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జైదీప్, అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ కన్సల్టెంట్ డాక్టర్ కోట రాజేష్, పరిపాలనా విభాగం అదనపు చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ రవికాంత్‌క్యాన్సర్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సోదాహరణంగా వివరించారు.



వివిధ రూపాల్లో వేధించే క్యాన్సర్

క్యాన్సర్ వివిధ రూపాల్లో వేధిస్తుందని అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ వైద్యురాలు అనిల అన్నారు పొట్టి శ్రీరాములు, చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో క్యాన్సర్ డే సందర్భంగా బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 40ఏళ్ల దాటిన ప్రతి మహిళ శారీరక ఇబ్బందులపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తరచూ పరీక్షలు చేయించుకుని ముందస్తుగా చికిత్సలు చేయించుకోవాలన్నారు. మంచి ఆహారం, మంచి అలవాట్లతో ఎలాంటి రుగ్మతలనయినా జయించవచ్చునన్నారు. మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మూలనపడిన ఎక్స్‌రే మిషన్


ఎక్స్‌రే కోసం క్యూ లైన్‌లో నిల్చున్న రోగులు

ప్రభుత్వాసుపత్రి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వాసుత్రి సీ బ్లాక్‌లో డిజిటల్ ఎక్స్‌రే మిషన్ 15 రోజులుగా మూలనపడింది. దీంతో రోగులకు ఎక్స్‌రే తీయించుకునేందుకు సూపర్ బ్లాక్‌లోని ఎక్స్‌రే కేంద్రం వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు చోట్ల పని చేస్తేనే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. అలాంటిది ఇప్పుడు ఎక్స్‌రే తీయించుకునేందుకే ఒక పూట పోతుందని రోగులు వాపోతున్నారు. పని చేయని ఎక్స్‌రే ఉన్న రూమ్‌కు అధికారులు తాళాలు వేసి దాని ముందు కూర్చునేందుకు కుర్చీలు వేసి చేతులు దులుపుకున్నారే తప్ప ఎక్స్‌రే మిషన్ మరమ్మతులు చేయించే ఆలోచన చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణం ఎక్స్‌రే మిషన్‌కు మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.

మిషన్ పాడైంది
ఏవీ రావు, సూపరింటెండెంట్

ఎక్స్‌రే మిషన్ బోర్డు పోయింది. ఆర్డర్ పెట్టాం. మరో 4 రోజులకు వస్తుంది. రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

మైలవరం బైపాస్‌రోడ్డులో 2 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

మైలవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రతినెలా 1వ తేదీన పలుప్రాంతాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇలా రవాణా చేస్తున్న 2 టన్నుల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి ఎస్సై సుధాకర్ సిబ్బందితో దారి కాసి మైలవరం బైపాస్ రోడ్డులో స్వాధీనం చేసుకున్నారు. వాహనంతో సహా రేషన్ బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా పెద్ద ఎ త్తున రేషన్ బియ్యం తరలిపోతుంటే అధికారులు ఏం చేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సివిల్ సప్లై అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటం వల్లే రేషన్ మాఫియా పని మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతుందంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రేషన్ మాఫియాపై నిఘా ఉంచి వారి ఆటలు కట్టించాలని కోరుతున్నారు.

టీటీడీలో ఘనంగా రథసప్తమి వేడుకలు

- తొలిసారి మాఢవీధుల్లో ఊరేగిన స్వామివారు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. తొలిసారిగా టీటీడీ కల్యాణమండపం మాడవీధుల్లో స్వామివారిని తిరుచ్చిపై భక్తులు ఊరేగించారు. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన వేడుకలు, తదుపరి తోమాల సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ వర్ణాల పుష్పాలతో అద్భుతంగా అలంకరించారు. 7.05 నిమిషాలకు స్వామివారిపై సూర్యకిరణాలు ప్రసరించిన సమయంలో పండితులు వేదమంత్రాలు ఘోష చేయగా భక్తులు ఆదిహృదయం పఠించారు. అనంతరం ముస్తాబైన స్వామివారి ఉత్సవ మూర్తిని 'తిరుచ్చిపై ఆసనంగా ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. విశేష అలంకార ప్రియునకు మూల, మూలల మహిళలు హారతులిచ్చి తమ భక్తిని చాటారు. దాదాపు 400 మంది భక్తులు బృందంగా హారతులిచ్చిన రీతి కనులవిందు చేసింది. అర్చకులతో పాటు ముఖ్య అధికారులు, సూపరింటెండెంట్ మల్లిఖార్జునరావు, లలిత రమాదేవితో పాటు స్వామికి పూలతో విశేష అలంకారం చేసిన దాతలు పడవల ఏడుకొండలు-శాంతిశ్రీ దంపతులు, విజయకుమార్-సునీత దంపతులు, ప్రసాదరెడ్డి, సుబ్రహ్మణ్యం దంపతులు, తులసి, రాజేశ్వరి, రామకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మంగళ వాయిద్యాలు, అర్చకుల వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణలతో ఆద్యంతం టీటీడీ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మునిగిపోయింది.


తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

కళలు ఏకీకృత అభివృద్ధికి పునాదులు

- రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ తేజస్విని


కళారూపాలను పరిశీలిస్తున్న తేజస్విని

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆధునిక దృక్పథాన్ని అవలంబించి తమ సృజనాత్మకతను ప్రపంచానికి పరిచయం చేయాలని రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ తేజస్విని పొడపాటి పిలుపునిచ్చారు. మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫైన్ ఆర్ట్స్ విభాగాన్ని సందర్శించిన ఆమె విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళలు ఏకీకృత అభివృద్ధికి పునాది వేస్తాయని, ప్రత్యేకించి సంప్రదాయ కళారూపాలకు ఆధునికతను జోడించి ప్రజలకు మరింత చేరువ చేయవచ్చని వివరించారు. కళా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంచుకోవడానికి వివిధ ప్రదర్శనలు, వర్క్‌షాపులు, సాంకేతిక వినియోగాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం ఫైన్ ఆర్ట్స్ విభాగం అధ్యాపకులు, ప్రిన్సిపల్, వైస్-చాన్సలర్ గంగాధర్ కంచర్లతో సమావేశమై కళల బలోపేతంపై వివరణాత్మకంగా చర్చించారు. వాటిని బలోపేతం చేయడానికి, సంప్రదాయ కళారూపాలను ఆధునిక ప్రదర్శన శైలులతో సమ్మిళితంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ సహాయ సహకారాల గురించి చర్చించారు. కళారంగ అభివృద్ధికి కొత్త దిశలో ముందడుగు వేసే అవకాశం లభించిందని వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

నగరంలో 'అమ్మ' రాజశేఖర్ సందడి

లబ్బీపేట, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకుడు అమ్మ రాజశేఖర్ నగరంలో సందడి చేశారు. ఈనెల 14న విడుదలవుతున్న 'తల' చిత్రం ప్రమోషన్‌ను నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రేమికుల దినోత్సవం రోజున ఈ చిత్రాన్ని తెలుగు, తమిళంలో విడుదల చేస్తున్నామని తన కుమారుడు రాగిన్ రాజ్‌ను హీరోగా పరిచయం చేస్తూ నిర్మించామని, ఈ చిత్రం ద్వారా అమ్మ రాజశేఖర్ కచ్చితంగా కమ్‌బ్యాక్ ఇస్తారన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ సంగీత దర్శకుడిగా పనిచేశారని, ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. హీరో రాగిన్ రాజ్, హీరోయిన్ నోరా ఎస్తేర్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత రాధ రాజశేఖర్ పాల్గొన్నారు.

స్వీయ ధ్రువీకరణ చాలు

▸▸ భవన నిర్మాణాల అనుమతులు ఇక సులభం

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో భవన నిర్మాణ అనుమతులను ప్రభుత్వం సులభతరం చేసింది. మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు లేకుండా, సిబ్బందికి ముడుపులు సమర్పించుకునే బాధలు లేకుండా పకడ్బందీ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఆన్‌లైన్‌లో స్వీయ ధ్రువీకరణ ద్వారా భవన, భూ యజమానులు అనుమతి తీసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఇటీవల అసెంబ్లీలో చట్టం చేసిన తర్వాత సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీం(సీసీఎస్)ను అమలు చేసేందుకు మున్సిపల్ శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. సీఆర్‌డీఏ మినహా అన్నిచోట్లా అనుమతులు జారీచేసే అధికారాన్ని పట్టణాభివృద్ధి అథారిటీల పరిధి నుంచి పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేశారు. 300 చదరపు మీటర్లకు మించని ప్రదేశాల్లో నిర్మాణాలకు యజమానులే ప్లాన్‌ను ధ్రువీకరించి, దరఖాస్తు చేసుకునేలా చట్టంలో మార్పులు చేశారు. యజమానులే కాకుండా ఆర్కిటెక్ట్, ఇంజనీర్లు, టౌన్‌ప్లానర్లు కూడా దరఖాస్తు చేయవచ్చు. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌లు కూడా ఇంటి ప్లాన్‌ను ధ్రువీకరించి అప్‌లోడ్ చేయవచ్చు. బహుళ అంతస్థులు కాని(నాన్-హైరైజ్‌డ్) నివాస భవనాలకు మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుంది. ఈ మేరకు ఏపీ మున్సిపల్, టౌన్‌ప్లానింగ్ చట్టాల్లో మార్పులు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే భవన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటారు.

రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ వ్యయం 96,862 కోట్లు: అనుప్రియ పటేల్

డిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్, రామాయపట్నంలో బీపీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఆరు వేల ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టు వ్యయం మొత్తం రూ.96,862 కోట్లు' అని కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్ వెల్లడించారు. మంగళవారం రాజ్యసభలో టీడీపీ ఫ్లోర్ లీడర్ బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అదేవిధంగా 'పరిశోధన, అభివృద్ధి గణాంకాలు, 2022-23' ప్రకారం, 2020-21 ఆర్థిక సంవత్సరంలో పారిశ్రామిక పరిశోధన, అభివృద్ధి వాటాలో ఔషధ రంగం 33 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. 2016లో విశాఖపట్నంలో నైపర్ విద్యాసంస్థను కేంద్రం మంజూరు చేయలేదు' అన్నారు.

2024-25లో ఏపీలో 1033 ఎంఐడీహెచ్ ప్రాజెక్టులకు ఆమోదం: రామనాథ్ ఠాకూర్

మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్(ఎంఐడీహెచ్) పథకం కింద రాష్ట్రానికి మంజూరైన ప్రాజెక్టుల సంఖ్యను కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్ వివరించారు. పార్లమెంటులో టీడీపీ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా స్పందించారు. 'ఏపీలో 2023-24లో ఆమోదించిన మార్కెట్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సంఖ్య 608. 2024-25లో ఎంఐడీహెచ్ పథకం ఏపీలో మంజూరైన మార్కెట్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సంఖ్య 10,333. ఈ పథకం కింద ఏపీలో మార్కెట్ మౌలిక సదుపాయాల కోసం చేసిన విడుదల చేసిన నిధులు... 2024-25 వరకు మొత్తం రూ.703.09 కోట్లు' అని మంత్రి ఠాకూర్ తెలిపారు.

గత మూడేళ్లలో ఏపీకి 377 కోట్లు: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(డీఏవైఎన్ఆర్ఎల్ఎం) కింద ఏపీకి గత 3 ఆర్థిక సంవత్సరాల్లో రూ.756 కోట్లు కేటాయించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. అయితే ప్రతిపాదనలు సమర్పించకపోవడంతో, కేవలం రూ.377 కోట్లు మాత్రమే విడుదల చేసినట్లు తెలిపింది. మంగళవారం, టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది.

పీఎంబీవైని మెరుగుపరిచేందుకు సిద్ధమే

▸▸ టీడీపీపీ నేత లావు ప్రశ్నకు కేంద్రం జవాబు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంబీవై)ను మరింత మెరుగుపరిచే విషయంలో కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. ఫసల్ బీమా యోజనకు సంబంధించి బీమా కంపెనీలు ప్రస్తుతం 20 ఉన్నాయని, వాటి సంఖ్య ఇంకా పెరుగుతుందని పేర్కొన్నారు. మంగళవారం, లోక్‌సభలో టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. ఫసల్ బీమా యోజన పరిధిలోకి మరిన్ని పంటలను చేర్చడం, బీమా కంపెనీల పెంపుపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించగా, మంత్రి పైవిధంగా స్పందించారు.

టీడీపీ, వైసీపీ దొందూ దొందే: తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంలో వైసీపీ, టీడీపీ కూటమి దొందూ దొందే అని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పదవులను 2021లో వైసీపీ అప్రజాస్వామికంగా 95 శాతానికి పైగా సొంతం చేసుకుందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేసి మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను కైవసం చేసుకోవాలని ప్రయత్నించడం శోచనీయమన్నారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో 54 మంది కార్పొరేటర్లకు గాను ఒక్క కార్పొరేటర్ కూడా టీడీపీకి లేనప్పటికీ డిప్యూటీ మేయర్ పదవిని టీడీపీ కైవసం చేసుకుందని తెలిపారు.

స్మార్ట్‌తో లక్ష కోట్ల భారం: సీపీఐ రామకృష్ణ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లకు అంగీకారం తెలిపినందున వచ్చే 25 ఏళ్లలో రాష్ట్రంపై రూ.1.10 లక్షల కోట్ల భారం పడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వద్దన్న చంద్రబాబు.. ఇప్పుడు అవే ముద్దనడం తగదన్నారు. అనంతపురంలో మంగళవారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20 వేలు ఇంకెప్పుడు ఇస్తారన్నారు.

ఏపీలో 273 జన ఔషధి కేంద్రాలు: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏపీలో 273 జనఔషధి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ వెల్లడించారు. దేశంలో ఎన్ని జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేశారు..? అని రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు అనుప్రియ పటేల్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 50 నుంచి 80 శాతం తక్కువ ధరలకు జనరిక్ మందులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.


గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టణాల్లో విలీనం

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో విలీనం అయిన గ్రామాలకు సంబంధించిన 176 మంది సిబ్బందిని ఆయా పట్టణ స్థానిక సంస్థల్లో విలీనం చేసేలా మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగేళ్ల కింద రాష్ట్రంలో 12 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు ఏర్పడిన నేపథ్యంలో సమీపంలోని ఆయా గ్రామాలను విలీనం చేశారు. అయితే అప్పట్లో సిబ్బందిని మాత్రం విలీనం చేయలేదు. దీంతో వారు పంచాయతీరాజ్ శాఖ పరిధిలోనే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీల్లోని సిబ్బందిని పట్టణ స్థానిక సంస్థల్లో విలీనం చేసింది.

నేటి నుంచి వాటర్ షెడ్ యాత్ర

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో వాటర్ షెడ్ యాత్రను నేటి నుంచి ప్రారంభించాలని కేంద్ర భూ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలకు సూచించింది. దేశ వ్యాప్తంగా ప్రజల్లో వాటర్ షెడ్ పథకంపై అవగాహన కల్పించేందుకు ఈ యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. ప్రధానమంత్రి కృషి సంచయి యోజన పథకం ద్వారా వాటర్ షెడ్ అమలు చేసే ప్రాంతాల్లో ఈ పథకంపై విస్తృతమైన ప్రచారం చేపట్టాలన్నారు. ఏపీతో పాటు 26 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ యాత్ర 60 రోజులు చేపడతారు.

ఉత్పత్తిలో 'ఉక్కు' సంకల్పం



ప్రతికూల పరిస్థితిలోనూ అధిక ఉత్పత్తి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మూడు నెలలుగా సరిగా జీతాలు లేవు.. తగినంత సిబ్బందీ లేరు.. అవసరమైన ముడి సరుకు సరఫరా అంతంత మాత్రమే.. అయినప్పటికీ విశాఖపట్నం స్టీల్ ప్లాంటు కార్మికులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నారు. ఉక్కు సంకల్పంతో వంద శాతానికి పైగా ఉత్పత్తి సాధించి తమ చిత్తశుద్ధిని, సత్తాను చాటుతున్నారు.

కార్మికుల సమ్మెతో కష్టాలు..

2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభంతోనే స్టీల్ ప్లాంటుకు కష్టాలు ప్రారంభమయ్యాయి. విదేశాల నుంచి నౌకల ద్వారా తెప్పించుకొనే కోకింగ్ కోల్‌ను ప్లాంటు లోపలకు కన్వేయర్ బెల్ట్‌ల ద్వారా సరఫరా చేసే గంగవరం పోర్టులో గతేడాది ఏప్రిల్ 12న కార్మికుల సమ్మె మొదలైంది. వారు కార్యకలాపాలన్నీ నిలిపివేయడంతో స్టీల్‌ప్లాంటుకు కోకింగ్ కోల్ ఆగిపోయింది. ఈ సమ్మె 35 రోజులు నడిచింది. ఆ సమయంలో ప్లాంటు అధికారులు గత 4 దశాబ్దాల్లో ఎన్నడూ లేని విధంగా కోల్ యార్డులన్నీ ఊడ్చి మరీ అందుబాటులో ఉన్న బొగ్గును ఉపయోగించుకున్నారు. ప్లాంటులో మొత్తం 3 బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా రోజుకు 21 వేల టన్నుల హాట్ మెటల్‌ను ఉత్పత్తి చేయాల్సి ఉండగా.. ఈ విపత్కర సమయంలో బొగ్గు లేక ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్‌నే నడిపారు. దాని ద్వారా 7 వేల టన్నుల ఉత్పత్తి చేయాల్సి ఉండగా.. ముడి పదార్థాల సరఫరా లేక 4 వేల టన్నులు మాత్రమే ఉత్పత్తి తీసిన సందర్భాలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 10 నెలల్లో(2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు) 3 బ్లాస్ట్ ఫర్నేసులు పూర్తిగా నడిచింది చాలా స్వల్ప కాలమే. నవంబరు నుంచి రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లే నడుస్తున్నాయి. వాటికీ అరొకరగా ముడిపదార్థాలు సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ.. 100 శాతం అంటే రోజుకు 14 వేల టన్నులు దాటి ఉత్పత్తి చేస్తున్నారు.

అమ్మకాల ఆదాయం రూ.14,500 కోట్లు

3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడుపుతూ అత్యధికంగా ఉత్పత్తి సాధించిన సంవత్సరం 2021-22. ఆ ఏడాది 51 లక్షల టన్నుల హాట్ మెటల్ వచ్చింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే ఎక్కువ హాట్‌మెటల్ వచ్చిందని ప్లాంటు వర్గాలు చెబుతున్నాయి. ఈ 10 నెలల్లో కొంత కాలం ఒక బ్లాస్ట్ ఫర్నేస్, మరికొంత కాలం రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లే నడిచినా అంతిమంగా 31 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగింది. ఇదే కాలంలో అమ్మకాలతో రూ.14,500 కోట్లు వచ్చింది.

అయినా అరకొర జీతాలే..

ఉక్కు ఉత్పత్తుల విక్రయం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో రూ.1,681 కోట్లు, మేలో రూ.1,088 కోట్లు, జూన్‌లో రూ.1,632 కోట్లు, జూలైలో రూ.1,607 కోట్లు, ఆగస్టులో రూ.1644 కోట్లు, సెప్టెంబరులో రూ.1,065 కోట్లు, అక్టోబరులో రూ.1,158 కోట్లు, నవంబరులో రూ.1,010 కోట్లు, డిసెంబరులో రూ.1,675 కోట్లు, జనవరిలో రూ.1,973 కోట్లు వచ్చాయి. అంటే సగటున నెలకు రూ.1,400-1500 కోట్ల ఆదాయం వచ్చింది. ప్లాంటులో 12,300 మంది శాశ్వత ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరి జీతాల కోసం నెలకు రూ.50 కోట్లు వరకు అవసరం. అయితే నెలకు రూ.1,400 కోట్లు అమ్మకాల ద్వారా వచ్చినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా గత ఆగస్టు నుంచి వేధిస్తున్నారు. నెలకు 30 నుంచి 35 శాతం మాత్రమే ఇచ్చి మిగిలింది పెండింగ్ పెడుతున్నారు. జనవరి నెల వరకు చూసుకుంటే ఒక్కో ఉద్యోగికి 300 శాతం జీతాలు రావాల్సి ఉంది. కుటుంబాలు ఆకలితో ఉన్నా ఉద్యోగులు అన్ని శక్తులూ ఒడ్డి 100 శాతం పైగా ఉత్పత్తి సాధిస్తున్నారు. ఈ కష్టాన్ని గుర్తించి సరిగ్గా జీతాలిస్తే ప్లాంటు అభివృద్ధికి కృషి చేస్తామని స్టీల్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ అప్పులు 39 వేల కోట్లు

లోక్‌సభలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబరు చివరినాటికి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మొత్తం అప్పులు రూ.38,965 కోట్లు ఉన్నాయని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. 2024 సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలలకు సంబంధించి ఉద్యోగులకు పాక్షిక వేతనాలు చెల్లించినట్లు తెలిపారు. లోక్‌సభలో మంగళవారం విశాఖ స్టీల్‌ప్లాంట్ అంశంపై ఎంపీలు వల్లభనేని బాలశౌరి, సీఎం రమేశ్ అడిగిన ఒక ప్రశ్నకు శ్రీనివాసవర్మ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ఇటీవల ప్రకటించిన ప్యాకేజీలో రూ.10,300 కోట్లు ఈక్విటీ మూలధనంగా ఉంటుందని తెలిపారు.

మన ఆర్థిక పునాదులు

మహా స్ట్రాంగ్



పాత పన్ను విధానం ఆగదు

జీఎస్‌టీ శ్లాబులు, రేట్ల కుదింపుపైనా దృష్టి

కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: కొన్ని సమస్యలున్నా భారత ఆర్థిక పునాదులు ఇంకా పటిష్ఠంగానే ఉన్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై ఇండియా టుడే-బిజినెస్ టుడే పత్రికలు నిర్వహించిన ఒక సదస్సులో ఆమె ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. సంస్థాగతంగా చూసినా భారత ఆర్థిక వ్యవస్థ ఇంకా అభివృద్ధి బాటలోనే ఉందన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే తమ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో మధ్య తరగతిని మురిపించిందన్న అనుమానాలను సీతారామన్ తోసిపుచ్చారు. పన్ను చెల్లింపుదారులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్‌కు సంబంధించి కొత్త పన్ను విధానంతో పాటు పాత పన్ను విధానమూ కొనసాగుతుందన్నారు.

పెట్టుబడులు తగ్గలే

కేంద్ర బడ్జెట్‌లో మూలధన పెట్టుబడులు తగ్గించారన్న ఆరోపణలను ఆర్థిక మంత్రి తోసిపుచ్చారు. నిజానికి ఈ పెట్టుబడులు సవరించిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో నమోదైన రూ.10.18 లక్షల కోట్లతో పోలిస్తే రూ.1.03 లక్షల కోట్లు ఎక్కువన్నారు. ప్రస్తుత జీడీపీలో ఇది 4.3 శాతానికి సమానమన్నారు.

జీఎస్‌టీ రేట్లపైనా త్వరలో నిర్ణయం

జీఎస్‌టీ శ్లాబులు, రేట్ల హేతుబద్ధీకరణపైనా జీఎస్‌టీ మండలి త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని నిర్మలా సీతారామన్ తెలిపారు. మూడేళ్ల క్రితం ఇందుకోసం ఏర్పాటైన రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన కమిటీ త్వరలోనే తన నివేదిక సమర్పిస్తుందన్నారు. జీఎస్‌టీ శ్లాబులతో పాటు సామాన్య ప్రజలు ఉపయోగించే వస్తువులపై పన్ను రేట్లు తగ్గించాలన్నదే తమ ధ్యేయమన్నారు.

ఆర్‌బీఐ కూడా కలిసి రావాలి

ధరల సెగ లేకుండా ద్రవ్యలోటును కట్టడి చేసేందుకు మొన్నటి బడ్జెట్‌లో, కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్ కాంత పాండే చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ కూడా జీడీపీ వృద్ధి రేటుకు సహకరించాలని పరోక్షంగా వడ్డీ రేట్లు తగ్గించాలని కోరారు. శుక్రవారం ప్రకటించే ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) కీలక రెపో రేటుపైనా నిర్ణయం తీసుకోనుంది. ఈ నేపథ్యంలో పాండే చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

స్వర్ణం.. సులభ రుణం!



గత డిసెంబరు నాటికి రూ.1.72 లక్షల కోట్లకు చేరిక

గత ఏడాది నుంచి బంగారం ధర వేగంగా పెరుగుతూ వస్తోంది. సామాన్యులు కొనగలరా..? అనే స్థాయికి చేరుకుంది. దాంతో కొత్తగా బంగారం కొనుగోలు చేసే వారు కాస్త తగ్గినప్పటికీ.. ఉన్న నగలను తాకట్టు పెట్టే రుణాలు పొందే ట్రెండ్ మాత్రం ఊపందుకుంది. తాజా గణాంకాలే ఇందుకు నిదర్శనం. గత ఏడాది డిసెంబరు నాటికి బ్యాంకుల బంగారం రుణాల పోర్ట్‌ఫోలియో వార్షిక ప్రాతిపదికన 71.3 శాతం వృద్ధితో రూ.1.72 లక్షల కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఏడాదిలో ఇదే సమయానికి పసిడి రుణ పోర్ట్‌ఫోలియో వృద్ధి కేవలం 17 శాతమే. గడిచిన కొన్ని సంవత్సరాల్లో బంగారం విలువ బాగా పెరగడంతో పాటు బ్యాంకులు తనఖా రహిత వ్యక్తిగత రుణాల మంజూరులో ఆచితూచి వ్యవహరిస్తుండటం ఇందుకు ప్రధానం కారణాలుగా తెలుస్తోంది. వ్యక్తిగత రుణం లభించే అవకాశం లేని వారికి బంగారం తనఖా రుణాలు మెరుగైన ప్రత్యామ్నాయంగా మారాయని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. వ్యక్తిగత రుణంతో పోలిస్తే, గోల్డ్ లోన్స్‌పై వడ్డీ కూడా తక్కువగా ఉండటం మరో కారణమని వారు పేర్కొన్నారు.

- గత ఏడాది మార్చి-డిసెంబరు మధ్యలో బంగారం తనఖా రుణాల్లో 68 శాతం వృద్ధి నమోదైందని.. అదే కాలంలో బంగారం ధరలు 21 శాతం పెరిగాయని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అజిత్ వెలోనీ అన్నారు.
- 2023 నవంబరులో ఆర్‌బీఐ తనఖా రహిత రుణాలపై రిస్క్ వెయిటేజీని 125 శాతానికి పెంచింది. దాంతో బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లు తాకట్టుపై ఇచ్చే బంగారం రుణాలపై దృష్టి సారించాయి. వ్యక్తిగత రుణాలను తగ్గించాయి. దాంతో గత ఏడాది డిసెంబరుతో ముగిసిన 9 నెలల్లో వ్యక్తిగత రుణాలు కేవలం 5-6 శాతం వృద్ధి చెందాయి. అంతక్రితం సంవత్సరంలో ఇదే కాలానికి పర్సనల్ లోన్స్‌లో 16.5 శాతం వృద్ధి నమోదైంది.
- గత డిసెంబరుతో ముగిసిన మూడు త్రైమాసికాల్లో తనఖా రహిత రుణాలకు చెందిన ఇతర విభాగాల్లోనూ కేవలం 9.7 శాతం వృద్ధి నమోదైంది. 2023లో ఇదే కాలానికి ఆ విభాగాల రుణ వృద్ధి 20.8 శాతంగా ఉంది. కాగా, రిటైల్ రుణాల పరిధిలోకి వచ్చే హౌసింగ్, వెహికిల్, క్రెడిట్ కార్డ్, పర్సనల్ లోన్స్ విభాగాలన్నింటి రుణ వృద్ధి కూడా 17.6 శాతం నుంచి 14.9 శాతానికి జారుకుంది.

అమెరికా-చైనా కయ్యం మనకు లాభమే

న్యూఢిల్లీ: అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం మన దేశానికి మేలు చేస్తుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ నెల 10 నుంచి చైనా దిగుమతులపై 35 శాతం సుంకాలు విధిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ప్రకటించారు. దీంతో అమెరికా మార్కెట్లో చైనా వస్తువులు ప్రియం కానున్నాయి. ఈ లోటును భర్తీ చేసుకునేందుకు అమెరికా కంపెనీలు భారత్‌వైపు చూసే అవకాశం ఉందని భావిస్తున్నాయి. అయితే మన దేశానికి ఈ లాభం ఏ మేరకు ఉంటుందనే విషయం మన ఉత్పత్తి సామర్థ్యం, పోటీతత్వాలపై ఆధారపడి ఉంటాయని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ చెప్పారు. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధంతో మన దేశం నుంచి ఆ దేశానికి ఎలక్ట్రిక్ మెషినరీ, వాటి విడి భాగాలు, ఆటో మొబైల్ విడి భాగాలు, మొబైల్, ఫార్మా, రసాయనాలు, బట్టలు, వస్త్రాల ఎగుమతి పుంజుకునే అవకాశం ఉందని సహాయ్ అంచనా వేశారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) — 5వ తేదీ



హైదరాబాద్	440	విజయవాడ	500
వరంగల్	442	గోదావరి	452
చిత్తూరు	513	విశాఖపట్నం	470
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	119
వరంగల్	103	గుంటూరు	114
కరీంనగర్	103	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	92
కర్నూలు	103	నెల్లూరు	97
విశాఖపట్నం	111	అనంతపురం	97
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	85,200 ▲	78,100 ▲	1,06,000 ▼
విజయవాడ	85,700 ▲	80,500 ▲	95,500 ▲
విశాఖపట్నం	83,180 ▲	76,250 ▲	94,630 ▲
రాజమండ్రి	85,200 ▲	78,100 ▲	96,600 ▲
ప్రొద్దుటూరు	84,400 ▲	77,970 ▲	94,700 ▲
ముంబై	83,010 ▲	76,037 ▲	93,793 ▲

- అల్ట్రాక్యాబ్ (ఇండియా) లిమిటెడ్ రైట్స్ ఇష్యూ ద్వారా రూ.49.81 లక్షల కోట్లు సమీకరిస్తోంది. ఇష్యూలో భాగంగా ఒక్కో షేరును రూ.14.5కి జారీ చేయనుంది. ఈ ఇష్యూ ఈ నెల 11న ముగియనుంది.
- అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను విస్తరించింది. ఇందులో భాగంగా రాజమండ్రిలో కొత్త సెంటర్‌ను ప్రారంభించింది. సంస్థకు రాష్ట్రంలో ఇది 15వ సెంటర్.
- ఎన్‌ఈసీ ఇండియాకు చెందిన డిస్‌ప్లే వ్యాపార విభాగాన్ని టెక్నాలజీ కంపెనీ షార్ప్ బిజినెస్ సిస్టమ్స్ కొనుగోలు చేసింది. అయితే డీల్ విలువ ఎంత అన్నది షార్ప్ ప్రకటించలేదు. ఈ కొనుగోలు ద్వారా షార్ప్ బీ2బీతో పాటు ప్రత్యేక లక్షణాలు గల మార్కెట్లకు సేవలందించగలుగుతుంది.
- యూనివర్సల్ బ్యాంక్‌గా మారేందుకు అనుమతి కోరుతూ ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్.. ఆర్‌బీఐకు దరఖాస్తు చేసింది. బ్యాంకింగ్ రంగంలో సేవలను విస్తరించి, తన స్థానాన్ని పటిష్ఠం చేసుకోవాలన్న దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగానే ఈ దరఖాస్తు చేసినట్టు వెల్లడించింది.

నెల గరిష్ఠానికి సూచీలు

సెన్సెక్స్ 1,397 పాయింట్లు అప్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో దాదాపు 2 శాతం మేర వృద్ధి చెంది నెల రోజుల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మెక్సికో, కెనడాపై విధించిన సుంకాల అమలును నెల రోజులు వాయిదా వేయడంతో ఆసియా మార్కెట్లతో పాటు మన సూచీలూ ర్యాలీ తీశాయి. సెన్సెక్స్ 1,397.07 పాయింట్లు (1.81 శాతం) బలపడి 78,583.81 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 378.20 పాయింట్లు (1.62 శాతం) పెరిగి 23,739.25 వద్ద స్థిరపడింది. ఈ ఏడాది జనవరి 3 తర్వాత సూచీలకిదే గరిష్ఠ ముగింపు స్థాయి. కాగా, ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.95 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ. 425.50 లక్షల కోట్లకు (4.88 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

ఆల్గో ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్లకూ అనుమతి

ఆగస్టు 1 నుంచి అమల్లోకి

ముంబై: ఆల్గోరిథమిక్ ట్రేడింగ్ (ఆల్గో ట్రేడింగ్)లో రిటైల్ ఇన్వెస్టర్లూ పాల్గొనేందుకు అనుమతిస్తున్నట్లు సెబీ మంగళవారం ప్రకటించింది. రిటైల్ ఇన్వెస్టర్లు కూడా ఈ సదుపాయాన్ని భద్రంగా ఉపయోగించుకునేందుకు వీలుగా ఆల్గో ట్రేడింగ్‌లో ప్రధాన వర్గాలైన ఇన్వెస్టర్లు, బ్రోకర్లు, ఆల్గో ప్రొవైడర్లు, మార్కెట్ మౌలిక వసతులు కల్పించే సంస్థల హక్కులు, బాధ్యతలకు సంబంధించి సెబీ నియంత్రణ నియమావళిని ప్రవేశపెట్టింది. ఆగస్టు 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. వేగంగా ఆర్డర్ల ఎగ్జిక్యూషన్‌తో పాటు ద్రవ్య లభ్యతను మెరుగుపరచడం వంటి పలు ప్రయోజనాలున్న ఆల్గో ట్రేడింగ్‌లో ప్రస్తుతం సంస్థాగత ఇన్వెస్టర్లు మాత్రమే పాల్గొనేందుకు అనుమతి ఉంది. సెబీ నియంత్రణ నియమావళి ప్రకారం.. రిజిస్టర్డ్ బ్రోకర్లు రిటైల్ ఇన్వెస్టర్లకు ఆల్గో ట్రేడింగ్ సదుపాయాన్ని కల్పిస్తారు. ప్రతి ఆల్గోకు స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి అవసరమైన అనుమతులు పొందాకే బ్రోకర్లు రిటైల్ మదుపరులకు ఈ సదుపాయాన్ని కల్పించాల్సి ఉంటుంది. ఇందులో పారదర్శకత కోసం ఎక్స్ఛేంజీలు చిన్న మదుపరుల ఆల్గో ట్రేడింగ్ కార్యకలాపాలను పర్యవేక్షించనున్నాయి. ఇందుకోసం ఎక్స్ఛేంజీలు అన్ని ఆల్గో ఆర్డర్లకు వినూత్న గుర్తింపును కేటాయించనున్నాయి. నిషేధిత కార్యకలాపాల ఏపీఐను పర్యవేక్షించడంతోపాటు ఆల్గో ట్రేడింగ్‌లో మదుపరుల సమస్యలను పరిష్కరించాల్సిన పూర్తి బాధ్యత బ్రోకర్లదే. 2023-24 ఆర్థిక సంవత్సరంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తమ లాభాల్లో 97 శాతం, బడా ట్రేడర్లు 96 శాతం లాభాలను ఆల్గో ట్రేడింగ్ ద్వారానే ఆర్జించారని సెబీ గత అధ్యయన నివేదిక వెల్లడించింది.

అదానీ నివేదికపై కట్టుబడి ఉన్నాం..

- సంస్థ మూసివేతలో ఎవరి బలవంతం లేదు..
- హిండెన్‌బర్గ్ వ్యవస్థాపకులు నాథన్ ఆండర్సన్

న్యూఢిల్లీ: భారత్‌లో రెండో అతిపెద్ద ధనవంతుడు గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్‌పై చేసిన ఆరోపణలు సహా తాము విడుదల చేసిన అన్ని నివేదికలకూ ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని అమెరికన్ మార్కెట్ రీసెర్చ్, షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వ్యవస్థాపకులు నాథన్ ఆండర్సన్ అన్నారు. అదానీ గ్రూప్ కంపెనీల అక్రమాలకు సంబంధించి మీడియాలో పలు కథనాలు వచ్చిన నేపథ్యంలోనే తామూ దర్యాప్తు ప్రారంభించామన్నారు. మీడియా కథనాల్లో ప్రస్తావించిన అవకతవకలపై ఆధారాల కోసం అన్వేషించామన్నారు. కానీ, హిండెన్‌బర్గ్ రీసెర్చ్‌ను మూసివేస్తున్నట్లు నాథన్ ఆండర్సన్ ఈ ఏడాది జనవరిలో ప్రకటించి అందరినీ విస్మయపరిచారు. బలమైన ఒత్తిళ్ల వల్లే ఆయన దుకాణం కట్టేశారన్న ఊహాగానాలు గుప్పుమన్నాయి. అయితే, తమను ఎవరూ బెదిరించలేదని.. కేవలం పనిభారం వల్లే ఆ నిర్ణయం తీసుకున్నట్లు పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు.

"అదేమైనా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ లేదా వస్తు తయారీ అయితే దాన్ని ఇతరులకు విక్రయించవచ్చు. కానీ, నా పని మార్కెట్ పరిశోధన. దాన్ని ఇతరులకు అప్పగించలేను కదా. అందుకే సంస్థను మూసివేయాల్సి వచ్చింది. అయితే, నాతో పనిచేసిన బృందం కొత్త సంస్థను ప్రారంభిస్తే గనుక వారికి అవసరమైన మద్దతును సంతోషంగా అందిస్తా"నని ఆండర్సన్ పేర్కొన్నారు.

స్పోర్ట్స్



త్రిష, ధ్రుతి



షబ్నం

వరల్డ్‌కప్ స్టార్లకు ఘన స్వాగతం

హైదరాబాద్/విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): ఐసీసీ అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొన్న తెలుగు క్రీడాకారిణులు గొంగడి త్రిష, షబ్నం షకీల్, ధ్రుతి కేసరికి ఘన స్వాగతం లభించింది. మంగళవారం తెల్లవారుజామున తెలంగాణ అమ్మాయిలు గొంగడి త్రిష, ధ్రుతి కేసరి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరికి హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు స్వాగతం పలికారు. త్రిష, ధ్రుతితో పాటు కోచ్ నూషీన్ అల్ ఖదీర్, ఫిట్‌నెస్ ట్రైనర్ షాలిని కూడా ఉన్నారు. ఇక పేసర్ షబ్నం షకీల్‌ను విశాఖపట్నం విమానాశ్రయంలో అభిమానులు కేరింతల నడుమ స్వాగతించారు. శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారిణి రమణకుమారి.. షబ్నమ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఆఖరి అవకాశం



ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ రేపటి నుంచే

ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ ద్వారా భారత జట్టు ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీకి సన్నద్ధం కావాలనుకుంటోంది. వాస్తవానికి ఈ ఫార్మాట్‌లో చివరిసారి భారత జట్టు ఆరు నెలల క్రితం ఆడడం గమనార్హం. ఆ తర్వాత మళ్లీ బుధవారం నుంచి 50 ఓవర్ల మ్యాచ్ ఆడబోతోంది. మరోవైపు బట్లర్ సేనతో జరిగే ఈ మూడు వన్డేలు కూడా కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు అత్యంత కీలకం కానున్నాయి. ఎందుకంటే ఈ ఇద్దరూ తమ ఫామ్‌ను అందుకునేందుకు ఈ సిరీస్‌ను చివరి అవకాశంగా భావించాల్సి ఉంటుంది. ఇద్దరికీ ఆసీస్ పర్యటన చేదు అనుభవాన్నే మిగిల్చింది. దీనికితోడు ఆడిన ఏకైక రంజీ మ్యాచ్‌లోనూ విఫలమయ్యారు. జమ్మూ-కశ్మీర్‌పై రోహిత్ 3, 28 రన్స్ చేయగా.. విరాట్ రైల్వేస్‌పై ఆరు పరుగులే చేసి బౌల్డయ్యాడు. అయితే వన్డే ఫార్మాట్‌లో ఓపెనర్‌గా రోహిత్, వన్‌డౌన్‌లో విరాట్ మెరుగైన ప్రదర్శనే కనబరుస్తుంటారు. గతేడాది ఆగస్టులో శ్రీలంకపై రోహిత్ మూడు మ్యాచ్‌ల్లో 157 పరుగులు సాధించాడు. కానీ ఆ తర్వాతే తన ప్రదర్శన దిగజారుతూ వచ్చింది. ఇక విరాట్ ఆ సిరీస్‌లోనూ పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ ఇంగ్లండ్‌తో సిరీస్‌లో వన్డేల్లో వేగంగా 14 వేల పరుగులు పూర్తి చేసేందుకు ఎదురుచూస్తున్నాడు. ఈ ఫీట్‌కు తను 94 పరుగుల దూరంలో ఉన్నాడు. అంతేకాకుండా ఆఫ్‌సైడ్ ఆవలి బంతులను వేటాడే బలహీనతను వీలైనంత త్వరగా అధిగమించి.. భారీగా పరుగులను సాధిస్తే జట్టుకు అంతకు మించిన ప్రయోజనం ఉండదు. ఇదిలావుండగా చాంపియన్స్ ట్రోఫీలో రోహిత్, విరాట్ స్థాయికి తగ్గట్టు ఆడితే భారత్ విజయావకాశాలు మెరుగవుతాయని మాజీ బ్యాటర్ సురేశ్ రైనా అభిప్రాయపడ్డాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

కీపింగ్ బాధ్యతలు ఎవరికి?

రోహిత్, గిల్ ఓపెనర్లుగా రానుండగా విరాట్, శ్రేయాస్ ఆ తర్వాతి స్థానాల్లో బరిలోకి దిగడం ఖాయమే. అయితే వికెట్ కీపర్, బ్యాటర్‌గా ఎవరిని ఆడిస్తారనేది ఆసక్తిగా మారింది. ఈ సిరీస్ కోసమే కాకుండా చాంపియన్స్ ట్రోఫీలోనూ ఐదో స్థానం కోసం రిషభ్ పంత్-కేఎల్ రాహుల్‌ల మధ్య పోటీ నెలకొంది. 2023 ఆగస్టు నుంచి ఈ ఫార్మాట్‌లో రాహుల్ కీపర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇక కారు ప్రమాదం నుంచి కోలుకున్నాక, గతేడాది ఆగస్టులో శ్రీలంకపై మూడో మ్యాచ్‌లో కీపింగ్ చేసిన పంత్ ఆరు పరుగులే చేశాడు. అటు ఆసీస్ పర్యటనలో రాహుల్ పది ఇన్నింగ్స్‌లో 276 పరుగులు చేస్తే.. పంత్ తొమ్మిది ఇన్నింగ్స్‌లో 255 రన్స్ సాధించాడు. ఇక ఇద్దరికీ ఇంగ్లండ్‌తో ముగిసిన టీ20 సిరీస్‌లో చోటు దక్కలేదు. ఒకవేళ తాజా సిరీస్‌లో రాహుల్‌కు చోటు కల్పిస్తే టాప్-6లో ఎడమచేతి బ్యాటర్ ఉండడు. ఇందుకోసం స్పిన్ ఆల్‌రౌండర్లలో ఒకరిని ప్రమోట్ చేయాల్సి ఉంటుంది. అదే ఇద్దరినీ తీసుకుంటే శ్రేయా‌స్‌ను తప్పించి రాహుల్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడించాల్సి ఉంటుంది.

బౌలర్ల ఫిట్‌నెస్ కీలకం


భారత జట్టులో ముగ్గురు బౌలర్లు గాయాల నుంచి కోలుకుని బరిలోకి దిగబోతున్నారు. స్టార్ పేసర్ బుమ్రా సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్ నుంచి క్రికెట్‌కు దూరంగా ఉంటున్నాడు. ప్రస్తుతం ఎన్‌సీఏలో పరీక్షల కోసం ఉన్న తను ఇంగ్లండ్‌తో చివరి వన్డే ఆడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇక స్పిన్నర్ కుల్దీప్ గతేడాది అక్టోబరు నుంచి భారత్ తరఫున బరిలోకి దిగలేదు. గత వారం రంజీ మ్యాచ్ ఆడి మూడు వికెట్లు తీశాడు. అలాగే పేసర్ షమి ఏడాది బ్రేక్ తర్వాత దేశవాళీతో పాటు ఐదు టీ20ల సిరీస్‌లో ఆడాడు. చాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుంటే వీరితో పాటు పేసర్ అర్ష్‌దీప్ ఫిట్‌నెస్ కూడా కీలకం కానుంది.

ఆంధ్రకు రెండు కాంస్యాలు





జాతీయ క్రీడలు



ఆర్చర్ ధీరజ్ రికార్డు ప్రదర్శన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఒకే రోజు రెండు కాంస్య పతకాలు లభించాయి. డెహ్రాడూన్‌లో మంగళవారం జరిగిన పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఆంధ్రప్రదేశ్ షట్లర్లు కర్రి సాయి పవన్ (రాజమండ్రి)-షేక్ గౌస్ (నెల్లూరు) ద్వయం 13-21, 12-21తో వైభవ్-నితిన్ జోడీ (కర్ణాటక) చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది. కనోయింగ్-కయాకింగ్ మహిళల కేటగిరీలో కెనోయి స్లాలోమ్ సీ1 కేటగిరీలో విజయవాడ అమ్మాయి చేతన భగవతి కాంస్య పతకం సొంతం చేసుకుంది. తెలంగాణకు మహిళల 3-3 బాస్కెట్‌బాల్ పోటీల్లో పసిడి పతకం దక్కింది. మొత్తంగా ఈ క్రీడల్లో ఆంధ్ర 2 స్వర్ణాలు, 4 కాంస్యాలతో 21వ స్థానంలో కొనసాగుతుండగా, తెలంగాణ ఒక స్వర్ణం, రెండు కాంస్యాలతో 24వ స్థానంలో ఉంది.

జాతీయ క్రీడల్లో విజయవాడ యువ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ మూడు జాతీయ రికార్డులను తిరగరాశాడు. పదేళ్ల కిందటి రికార్డులను బద్దలుకొట్టాడు. మంగళవారం జరిగిన ఆర్చరీ రికర్వ్ ర్యాంకింగ్ పోటీల్లో 70 మీటర్ల విభాగంలో 347/360, 2-70 మీటర్ల కేటగిరీలో 690/720, టీమ్ ఈవెంట్‌లో 2038/2160 స్కోరుతో గత రికార్డులను ధీరజ్ అధిగమించాడు.

వందో టెస్ట్‌తో.. కరుణరత్నె వీడ్కోలు



గాలె: శ్రీలంక వెటరన్ బ్యాటర్ దిముత్ కరుణరత్నె కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆస్ట్రేలియాతో గురువారం నుంచి జరిగే రెండో టెస్ట్.. అతడి కెరీర్‌లో 100వ మ్యాచ్. ఈ టెస్ట్‌తో అతడు ఆటకు వీడ్కోలు పలకనున్నాడు. 36 ఏళ్ల కరుణరత్నె 99 టెస్టుల్లో 7172 పరుగులు సాధించాడు. అందులో 16 శతకాలు, 34 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 'ఏడాదికి నాలుగు టెస్టులే ఆడి ఫామ్‌ను కొనసాగించడం చాలా కష్టం. మాథ్యూస్, దినేష్ చాందిమల్‌తో కూడా మాట్లాడా. ముగ్గురం ఒకేసారి రిటైరయ్యే బదులు.. ఒక్కొక్కరుగా వీడ్కోలు పలికితే మంచిదని భావించామ'ని చెప్పాడు.

ఒక్క సిరీస్‌తో తక్కువ చేస్తే ఎలా? — గిల్

నాగ్‌పూర్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టు వైఫల్యంపై ఓపెనర్ శుభ్‌మన్ గిల్ స్పందించాడు. 'ఒక్క సిరీస్ ద్వారా జట్టు మొత్తం ప్రదర్శనను తక్కువ చేయలేం. మా జట్టులో చాలా మంది ఆటగాళ్లు నిలకడగా రాణించి ఎన్నో సిరీస్‌లను, మ్యాచ్‌లను గెలిపించారు. అయితే ఆసీస్ పర్యటనలో జట్టు స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేదనేది వాస్తవమే. సిడ్నీ టెస్టు చివరి ఇన్నింగ్స్‌కు బుమ్రా దూరం కావడం నష్టపరిచింద'ని అన్నాడు.



అభిమాని అనుకుని పోలీసులు ఆపేశారు

నాగ్‌పూర్: ఇంగ్లండ్‌తో తొలి వన్డే కోసం భారత జట్టు ఇక్కడకు చేరుకొంది. ఆటగాళ్లందరూ టీమ్ బసచేస్తున్న హోటల్‌కు బస్సులో వచ్చారు. జట్టులో అందరూ తమ లగేజీని తీసుకెళ్తున్న సమయంలో టీమిండియా త్రోడౌన్ స్పెషలిస్ట్ రఘుకు మాత్రం ఊహించని అనుభవం ఎదురైంది. పోలీసులు అతడిని అభిమానిగా భావించి హోటల్‌లోకి వెళ్లకుండా అడ్డుకొన్నారు. తాను జట్టు సభ్యుడినని అతడు పోలీసులకు వివరించే ప్రయత్నం చేశాడు. ఆ తర్వాత ఎవరు చెప్పారో తెలియదు కానీ.. పోలీసులు నవ్వుతూ అతడిని వదిలేశారు. రఘు కూడా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. ఈ వీడియో ఇప్పుడు నెట్‌లో చక్కర్లు కొడుతోంది.

వన్డేల్లోకి వరుణ్



మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు ఎంపిక చేశారు. ఇటీవలే ముగిసిన ఐదు టీ20ల సిరీస్‌లో అతను అద్భుతంగా రాణించి 14 వికెట్లు తీశాడు. అయితే ఇప్పటికే ప్రకటించిన వన్డే జట్టులో వరుణ్ పేరు లేకపోయినా.. తాజా ప్రదర్శనతో ఈ ఫార్మాట్‌లోనూ ఆడించాలని జట్టు భావిస్తోంది. మంగళవారం నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాడు. అతను గురువారం జరిగే తొలి వన్డేలో అరంగేట్రం చేసే అవకాశాలున్నాయి. మరోవైపు ఇప్పటికే జట్టులో నలుగురు స్పిన్నర్లు ఉన్నారు. దీంతో చాంపియన్స్ ట్రోఫీ తుది జట్టులో వరుణ్ ఉండాలంటే కుల్దీప్ లేక సుందర్‌లలో ఒకరిపై వేటు పడవచ్చు.

ముంబై జట్టులో సూర్య, దూబే

ముంబై: భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే రంజీ మ్యాచ్ ఆడనున్నారు. ఈనెల 8 నుంచి జరిగే క్వార్టర్స్‌లో ముంబై జట్టు హరియాణాతో తలపడనుంది. ఇందుకోసం రహానె నేతృత్వంలో 18 మందితో కూడిన ముంబై జట్టును ప్రకటించారు. ఇంగ్లండ్‌పై టీ20ల్లో పేలవ ఫామ్‌తో నిరాశపర్చిన సూర్య ఈ మ్యాచ్‌తో ఫామ్‌ను అందుకోవాలనుకుంటున్నాడు.

ప్రీక్వార్టర్స్‌లో సుమిత్

న్యూఢిల్లీ: రోసారియో చాలెంజర్ పోటీల్లో భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నగల్ ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో సుమిత్ 5-7, 6-1, 6-0తో స్థానిక ఆటగాడు రెన్జో ఒలివోపై గెలిచాడు.

చెన్నై ఓపెన్ నుంచి రామ్, ముకుంద్ అవుట్

చెన్నైలో జరుగుతున్న చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నమెంట్‌లో భారత ఆటగాళ్లకు చుక్కెదురైంది. సింగిల్స్ స్టార్లు రామ్‌కుమార్ రామనాథన్, ముకుంద్ శశికుమార్ ఆరంభ రౌండ్లలోనే వెనుదిరిగారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్లో రామ్‌కుమార్ 3-6, 5-7తో జే క్లార్క్ చేతిలో, ముకుంద్ 3-6, 7-6, 1-6తో అలెక్సీ జఖరోవ్ చేతిలో ఓడారు.



టాటా స్టీల్ చెస్ విజేత ప్రజ్ఞానంద స్వదేశం చేరుకొన్నాడు. మంగళవారం చెన్నై ఎయిర్‌పోర్టులో అతడికి తమిళనాడు ప్రభుత్వ అధికారులు, జాతీయ చెస్ సమాఖ్య ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. నెదర్లాండ్స్‌లో జరిగిన ఆ టోర్నీలో వరల్డ్ చాంపియన్ గుకేశ్‌ను ఓడించి ప్రజ్ఞానంద టైటిల్ సొంతం చేసుకొన్న సంగతి తెలిసిందే.

చిన్నశేష వాహనం



గరుడ వాహనం



హనుమంత వాహనం



సర్వభూపాల వాహనం



చంద్రప్రభ వాహనం



కల్పవృక్ష వాహనం



అమరావతిపై అదే విషం!



మళ్లీ ప్రపంచ బ్యాంకుకు ఫిర్యాదులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతిపై విద్వేషం, విషం చిమ్మడం కొనసాగుతున్నాయి. అమరావతి అభివృద్ధికి ప్రపంచబ్యాంకు రుణం రాకుండా సైంధవులు కొందరు దుష్ట పన్నాగాలు పన్నుతున్నారు. రాజధాని నిర్మాణం తొలిదశకు ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) కలిసి రూ.15,500 కోట్లు రుణమిచ్చేందుకు అంగీకరించాయి. ఇందులో ప్రపంచబ్యాంకు వాటా రూ.6,800 కోట్లు. తొలి వాయిదా నిధుల విడుదలకు సర్వం సిద్ధం కావడంతో సీఆర్డీఏ పలు పనులకు టెండర్లు కూడా పిలిచింది. ఈ దశలో రాజధాని పనులకు రుణం మంజూరుకు సరైన విధానం అవలంబించలేదంటూ తాజాగా ప్రపంచ బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. వీటిపై ఆ బ్యాంకు ఇన్‌స్పెక్షన్ టీమ్ ప్యానెల్ పరిశీలన ప్రారంభించింది. దీనివల్లే బ్యాలెన్స్ టెండర్లను పిలవడంలో కొంత జాప్యం నడుస్తోంది. దీనికి తోడు శాసనమండలి ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి రావడంతో.. టెండర్ల అంశాన్ని సీఆర్డీఏ ఎన్నికల సంఘం (ఈసీ)దృష్టికి తీసుకెళ్లింది. కోడ్‌కు ముందే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు, ఐఏఎస్ అధికారుల క్వార్టర్స్, ప్రిన్సిపల్ సెక్రటరీల బంగళాలు, హ్యాపీనెస్ట్, రోడ్ల అభివృద్ధి పనులు, ఎల్‌పీఎస్ ఇన్ఫ్రా వంటి పనులకు సీఆర్డీఏ ఇప్పటికే చాలా వరకు టెండర్లు పిలిచింది. అలాగే అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) కూడా రాజధాని ప్రధాన రోడ్ల నిర్మాణం, అమరావతి వరద విపత్తు ప్రణాళికలో భాగంగా చేపట్టాల్సిన కొండవీడు వాగు, గ్రావిటీ కెనాల్, పాలవాగు విస్తరణాభివృద్ధి పనులకు టెండర్ నోటిఫికేషన్లు ఇచ్చింది. వీటిలో చాలా పనులకు ఈ నెలలోనే టెండర్లు ఖరారు చేయాల్సి ఉంది. ఈసీ నుంచి వీటికి అభ్యంతరాలు రాకపోవచ్చని ఉన్నతాధికారులు అంటున్నారు.

చంద్రబాబు సీఎం కాగానే..

చంద్రబాబు మళ్లీ సీఎం కాగానే.. రాజధాని నిర్మాణానికి రుణసమీకరణపై దృష్టి సారించారు. దీంతో సైంధవులు రంగంలోకి దిగారు. రుణం ఇవ్వొద్దని ప్రపంచబ్యాంకుకు ఫిర్యాదులు పంపారు. రైతులు స్వచ్ఛందంగా భూములివ్వలేదని.. బలవంతంగా వారినుంచి లాక్కున్నారని గతంలో చేసిన ఆరోపణలే మళ్లీ చేశారు. దీంతో బ్యాంకు ఉన్నతాధికారులు, కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు అమరావతిలో పర్యటించి ఆరాతీశారు. క్షేత్ర స్థాయిలో రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఆ తర్వాత లోతైన పరిశీలన చేసి కేంద్రప్రభుత్వాన్ని సంప్రదించిన తర్వాతే ఏడీబీతో కలిసి 15,500 కోట్ల రుణం ఇవ్వాలని నిర్ణయించింది. అయినా మళ్లీ తాజాగా ఫిర్యాదులు వెళ్లాయి. అమరావతి ప్రకృతి విపత్తులకు కేంద్రబిందువని.. ఇటీవల వరదలు ముంచెత్తాయని ఇంకోసారి ఫిర్యాదు చేశారు. వీటిపైనా ప్రపంచ బ్యాంకు విచారించింది. అమరావతికి శాశ్వత వరద ప్రణాళిక రూపొందిస్తున్నామని సీఆర్డీఏ వివరించడంతో సంతృప్తి వ్యక్తం చేసింది. వరద ప్రణాళికల విషయంలో ప్రపంచ బ్యాంకు కూడా అనేక మార్పులను సూచించడం గమనార్హం. ఇప్పుడేమో.. రుణం మంజూరులో తగిన విధానాన్ని పాటించలేదని ఆ బ్యాంకు దేశీయ బృందంపై ఆరోపణలు మొదలుపెట్టారు. దీంతో ప్రపంచబ్యాంకు ఇన్‌స్పెక్షన్ ప్యానెల్ క్షుణ్ణంగా పరిశీలన చేస్తోంది. టెండర్ల పర్యవేక్షక కమిటీ ఒక్కో టెండర్‌కు ఎన్ని క్వెరీలు వేసింది.. ఎంత పకడ్బందీగా నిబంధనల రూపకల్పన జరిగింది వంటివాటిని సాక్ష్యాలతో వివరిస్తుండడంతో తాజా ఆరోపణలు వీగిపోవడం ఖాయమని ప్రభుత్వ వర్గాలు విశ్వసిస్తున్నాయి. విద్వేష ఫిర్యాదుల వెనుక వైసీపీ నేతలున్నారని.. వారే ఈ పనులు చేయిస్తున్నారని సర్కారు ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతిని ఏ విధం గా విధ్వంసం చేశారో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత కూడా దానిపై వారికి ద్వేషం పోలేదు. జగన్ రోతపత్రికలో రాజధానిపై విషం చిమ్మడం పతాకస్థాయికి చేరింది. అమరావతి టెండర్లలో ఘోరాలు, గోల్‌మాల్ జరిగిపోతున్నాయంటూ అసత్య వార్తలను రాస్తోంది. ఇటీవల రాజధానిలో ప్రధాన రోడ్లు, మౌలిక వసతుల పనులకు కలిపి టెండర్లు పిలిస్తే.. భారీగా అంచనాలు పెంచేసి వేర్వేరుగా టెండర్లు పిలిచినట్లు తప్పుడు కథనం రాసింది. ఇలాంటి వార్తలతో ప్రజలను, ప్రపంచ బ్యాంకును తప్పుదారి పట్టించాలన్నది వైసీపీ వ్యూహంగా ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అమరావతి నిర్మాణం ముందుకు సాగకుండా చేయడమే వారి దురుద్దేశమని అంటున్నాయి.

ఫిబ్రవరిలో 'పప్పు' ఉడకదు

- పౌర సరఫరాల గోదాముల్లో నిండుకున్న కందిపప్పు
- సరఫరాదారులకు వైసీపీ హయాంలో 250 కోట్ల బకాయిలు
- అవి చెల్లిస్తేనే సరఫరా... చేతులెత్తేసిన సివిల్ సప్లయిస్ అధికారులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



'పేదల పొయ్యిపై పప్పు ఉడుకుతుంది' అంటూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అటకెక్కింది. పండుగ సీజన్ జనవరిలో సగం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేసిన సివిల్ సప్లయిస్ కార్పొరేషన్... ఫిబ్రవరిలో బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేసి చేతులెత్తేసింది. కందిపప్పు కావాలని అడుగుతున్న కార్డుదారులకు ఇంటింటికీ రేషన్ సరఫరా చేస్తున్న ఎండీయూ వాహనదారులు స్టాకు లేదని చెబుతున్నారు. కొంత కాలంగా బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిరాణా దుకాణాల్లో కిలో కందిపప్పు రూ.180 నుంచి రూ.200కు పైగా పలుకుతోంది. దీంతో కార్డుదారులందరూ ప్రభుత్వం రాయితీపై రూ.67కే అందిస్తానన్న కందిపప్పు కోసం ఆశగా ఎదురు చూశారు. గత నెలలో అరకొరగా అందిన కందిపప్పు ఈనెల పూర్తిగా లేకపోవడంతో వారంతా తీవ్ర నిరాశకు లోనయ్యారు.

నాటి వైసీపీ పాపాలే...

గత వైసీపీ ప్రభుత్వం రేషన్ సరుకుల్లో ఒక్కొక్కటిగా కోత వేసి ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. గత ఐదేళ్లు బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేసింది. అడపాదడపా కందిపప్పు... అదీ అరకొరగానే సరఫరా చేసింది. అలా కాంట్రాక్టర్లు అప్పుడప్పుడు సరఫరా చేసిన కందిపప్పుకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెడుతూ వచ్చింది. వైసీపీ దిగిపోయేనాటికి ఆ మొత్తం సుమారు రూ.250 కోట్లకు పైగా చేరుకుందని అధికారులు చెపుతున్నారు. కూటమి ప్రభుత్వం కార్డుదారులందరికీ కందిపప్పు కూడా అందించాలని ఆదేశించింది. దీనికి టెండర్లు పిలవగా.. వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు దక్కించుకున్న వారే తాజా కాంట్రాక్టును దక్కించుకున్నారు. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో కందిపప్పును సరఫరా చేసిన కాంట్రాక్టర్లు ఆ తర్వాత అడ్డం తిరిగారు. పాత బకాయిలు రూ.250 కోట్లకు పైగా ఉన్నాయని, అవి చెల్లిస్తేనే కందిపప్పు సరఫరా చేస్తామన్నారు. దీంతో పౌర సరఫరాల సంస్థ అధికారులు నిస్సహాయంగా ఉండిపోయారు. సంక్రాంతి సందర్భంగా అందుబాటులో ఉన్న కందిపప్పును రేషన్ దుకాణాలకు పంపారు. కార్డుదారుల్లో సగానికి అటుఇటుగా మాత్రమే కందిపప్పు అందింది. ఇప్పుడు నిల్వలు పూర్తిగా నిండుకున్నాయి. రాష్ట్రంలో 1,48,45,425 రేషన్ కార్డులు ఉన్నాయి. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాలి. కానీ, కార్పొరేషన్ డేటా ప్రకారం... సోమవారం నాటికి 20 లక్షల కార్డుదారులకు సరిపడా కందిపప్పే రేషన్ డీలర్ల వద్ద ఉంది.

సప్తవాహనాలపై సప్తగిరీశుడి వైభవం

- తిరుమలలో వైభవంగా రథసప్తమి

తిరుమల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు మలయప్పస్వామి ఏడు వాహనాలపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తకోటిని అనుగ్రహించారు. ఒక్కరోజు బ్రహ్మోత్సవంగా భావించే ఈ ఉత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు. మంగళవారం వేకువజామునే మాడవీధులన్నీ భక్తులతో నిండిపోయాయి. ఉదయం 5.30కు సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామి, సూర్యకిరణాల స్పర్శ కోసం వాయవ్య దిక్కున 6.48 గంటల వరకు వేచి ఉండాల్సి వచ్చింది. కిరణాలు స్వామిని తాకిన వెంటనే అర్చకులు శాస్త్రోక్త కైంకర్యాలు జరిపించారు. అనంతరం చిన్నశేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై స్వామి దర్శనమిచ్చారు. మధ్యాహ్నం పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా జరిగింది. రాత్రి చంద్రప్రభ వాహనంపై శ్రీవారి విహారంతో వాహనసేవలు ముగిశాయి.

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

రథసప్తమి రోజున తిరుమల శ్రీవారిని పలువురు న్యాయమూర్తులుదర్శించుకున్నారు. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఆర్.శ్రీరామ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ స్వామిని దర్శించుకుని, వాహనసేవల్లో పాల్గొన్నారు.

రథసప్తమి విజయవంతం: ఈవో

తిరుమలలో రథసప్తమి విజయవంతంగా ముగిసిందని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. దాదాపు 2.50 లక్షల మంది భక్తులు పాల్గొని వాహనసేవలను వీక్షించినట్లు చెప్పారు. టీటీడీ కల్పించిన సౌకర్యాలపై భక్తులందరూ సంతృప్తి వ్యక్తం చేశారని ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.

రాష్ట్ర పండుగగా రథసప్తమి

- దేవదాయ శాఖ మంత్రి ఆనం

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఈ ఏడాది నుంచి రథసప్తమి పర్వదినాన్ని రాష్ట్ర పండువగా నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరులోని మూలాపేట శివాలయంలోని సూర్యదేవాలయంలో మంత్రి పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర పండువగా రథసప్తమిని అరసవెల్లి సూర్యదేవాలయం నుంచి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. రాబోయే మహాశివరాత్రికి శైవక్షేత్రాలలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. శ్రీకాళహస్తి, మహానంది, కోటప్పకొండ, ద్రాక్షారామం, ప్రసిద్ధ క్షేత్రాల్లో విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు మన ఆలయాల విశిష్టత, చరిత్ర తెలిసేలా వేదాలు, ఆగమ శాస్త్రాలను తూచా తప్పకుండా పాటిస్తూ సనాతన హిందూ ధర్మపరిరక్షణే లక్ష్యంగా తమ ప్రభుత్వం దృఢసంకల్పంతో కృషి చేస్తోందని అన్నారు.

టీటీడీ సోషల్ మీడియాలో మాజీ ఛైర్మన్ వీడియో

- సీరియస్‌గా తీసుకున్న బోర్డు సభ్యులు

తిరుమల, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): టీటీడీ సోషల్ మీడియాలో మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వీడియో రావడాన్ని ప్రస్తుత బోర్డు సభ్యులు తీవ్రంగా పరిగణించారు. రథసప్తమికి సంబంధించి పాత వీడియోలు సేకరించే క్రమంలో గత ప్రభుత్వంలోని బోర్డు ఛైర్మన్ వీడియోను సేకరించి సోషల్ మీడియాలో ప్రదర్శించారు. దీన్ని గుర్తించిన ప్రస్తుత బోర్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్వో విభాగానికి సమాచారం ఇవ్వడంతో పాటు ఛైర్మన్ బీఆర్ నాయుడి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి కారణమైన ఓ ఉద్యోగిని ఇప్పటికే విధులను తప్పించినట్టు సమాచారం. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.

ఫీజు పోరు మార్చి 12కు వాయిదా

- నేతలు వద్దన్నా నాడు హడావుడిగా జగన్ ప్రకటన
- ఇప్పుడు ఆఖరి నిమిషంలో కోడ్ సాకుతో వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ బుధవారం తలపెట్టిన ఫీజు పోరు చివరి నిమిషంలో వాయిదాపడింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.800 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేసినా.. వాటి కోసం ధర్నాలేంటని ముఖ్య నేతలు అసహనం వ్యక్తంచేసినా వారి అధినేత జగన్ వినిపించుకోలేదు. శాసనమండలి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని చెప్పినా ధర్నాలు చేయాల్సిందేనన్నారు. చివరకు జనస్పందన ఉండదని తేలిపోవడం.. పార్టీ శ్రేణులు అయిష్టత చూపడంతో ఆ కోడ్‌నే సాకుగా చూపి ధర్నాలను వాయిదా వేశారు. సహజంగా ఆందోళన కార్యక్రమాలకు పోలీసుల అనుమతి తీసుకుంటారు. కానీ ఇక్కడ విచిత్రంగా తాము ఫీజు పోరు చేపడతామని ఎన్నికల కమిషన్‌ను కోరితే.. అక్కడినుంచి ఎలాంటి స్పందనా రానందున.. మార్చి 12వ తేదీకి వాయిదా వేస్తున్నామని చెప్పడం గమనార్హం. కాగా, కుమార్తె డిగ్రీ పట్టా పురస్కార కార్యక్రమం కోసం లండన్ వెళ్లి గత శుక్రవారం బెంగళూరుకు తిరిగొచ్చిన జగన్ దంపతులు.. సోమవారం రాత్రి తాడేపల్లి ప్యాలెస్ చేరుకున్నారు. మంగళవారం మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, కురసాల కన్నబాబు, కారుమూరి నాగేశ్వరరావు, విడదల రజని, జోగి రమేశ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, కోరుముట్ల శ్రీనివాసులు తదితరులు జగన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ హయాంలో పాలన పడకేసిందని ఆరోపించారు. తన పాలనలో అభివృద్ధి పరుగులు పెట్టిందని. సంక్షేమ పథకాలు ఠంచనుగా చెప్పిన తేదీ నాటికి అమలు చేశామని చెప్పారు. రాజధాని అమరావతిపై యథావిధిగా విషం చిమ్మారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును కూటమి ప్రభుత్వం 41.15 మీటర్లకు కుదించేసిందని, దీనిపైనా పోరాటం చేద్దామని పిలుపిచ్చారు. వచ్చేనెల 12న వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రాల్లో అట్టహాసంగా నిర్వహించాలని ముఖ్య నేతలను జగన్ ఆదేశించారు.

విజయసాయిరెడ్డి ప్రస్తావన రాలేదా?

కొద్దిరోజుల కిందట వైసీపీకి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి ప్రస్తావన సమావేశంలో రాలేదంటూ నేతలంతా ఒకే మాట చెప్పడం సందేహాలకు తావిస్తోంది. 'అబ్బే.. సమావేశంలో 40 మంది ఉన్నప్పుడు ఆ ప్రస్తావన ఎందుకు వస్తుంది? బహుశా సజ్జల రామకృష్ణారెడ్డితో దానిపై మాట్లాడారేమో' అని కూడ బలుక్కున్నట్లుగా వారు మీడియాకు చెప్పారు. కాగా, మాజీ ఎంపీ నందిగం సురేశ్ తాడేపల్లిలో జగన్‌తో సమావేశమయ్యారు. ఆయన వెంట పార్టీ నేత జూపూడి ప్రభాకరరావు కూడా ఉన్నారు.

రాష్ట్రంలోనూ కులగణన చేపట్టాలి: షర్మిల

అమరావతి/మడకశిర, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే దిక్సూచి అని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. ఇదో చారిత్రాత్మక ఘట్టమన్నారు. రాహుల్‌గాంధీ దూరదృష్టికి తెలంగాణ సర్కారు చేపట్టి కులగణన ప్రత్యేక నిదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ తరహాలోనే ఏపీలోనూ కులగణన చేపట్టాలని సీఎం చంద్రబాబును ఆమె డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదిక రిజర్వేషన్లు అమలుచేయాలన్నారు.

కేంద్ర, రాష్ట్రాల్లోనూ చేయాలి: రఘువీరా

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేతోపాటు కులగణన చేపట్టడం చారిత్రాత్మకమని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఏపీలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా జనగణనతోపాటు కులగణన చేపట్టాలని కోరారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్రాన్ని కోరుతూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ప్రజలపై ఇక భారం మోపలేం



తనను కలిసిన మాడుగుల నాగఫణి శర్మను సత్కరించి వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేస్తున్న సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి. సాధారణ పనితీరుతో, సాధారణ లక్ష్యాలతో యథాలాపంగా పనిచేస్తే ఫలితాలు రావు. వినూత్న ఆలోచనలతో పని చేయాలి. టెక్నాలజీ వాడకం ద్వారా రెవెన్యూ ఆర్జనలో లోపాలను సరిదిద్ది ఆదాయం పెంచాలి" అని చంద్రబాబు సూచించారు. కాగా, వాణిజ్య పన్నుల విభాగంలో పన్ను ఎగవేతల అంశం సీఎం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఏ ఒక్కరూ పన్ను ఎగవేతకు పాల్పడకుండా చూడాలనీ, అలాగని వ్యాపారులను వేధింపులకు గురి చేయవద్దని సీఎం సూచించారు.

ఇప్పటికే గాడిన పడాలి...

సంక్షేమ కార్యక్రమాలకు, అభివృద్ధి పనులకు ఆర్థిక వనరులు ఎంతో కీలకమనీ, దీన్ని దృష్టిలో పెట్టుకుని రోజువారీ పురోగతి చూపేలా ఆదాయార్జన శాఖల్లో అధికారులు పని చేయాలని సీఎం సూచించారు. గత ప్రభుత్వ విధానాలతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయనీ, ఆదాయం కోసం ప్రజలపై అదనంగా భారం మోపలేమన్నారు. ఆదాయార్జనలో మరింత మెరుగైన ఫలితాలు సాధించడం మినహా మరొక మార్గం లేదని తెలిపారు. "కేంద్రం నుంచి నిధుల విషయంలో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియాను కలిసి 1.45గంటల పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వివరించాను. ఈ తపనంతా రాష్ట్రం కోసమే. అధికారులు దీన్ని అర్థం చేసుకుని పని చేయాలి." అని సూచించారు. అనంతరం రెవెన్యూ రాబడులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "2023-24 సంవత్సరానికి వాణిజ్య పన్నుల విభాగంలో మొత్తం రూ.41,420కోట్లు రాగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ. 41,382కోట్లు ఆదాయం వచ్చింది. ఈ విభాగంలో ఫిబ్రవరి, మార్చిల్లో వృద్ధి ఉంటుంది. నూతన ఎక్సైజ్ విధానం కారణంగా ఈ శాఖలో గతేడాదితో పోల్చితే ఆదాయం పెరగనుంది. మైనింగ్ శాఖలో ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో రెవెన్యూ పెరగలేదు." అని అధికారులు తెలిపారు.

కోర్టు కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టండి

కోర్టు కేసుల పరిష్కారం, అనుమతుల మంజూరు వంటి చర్యల ద్వారా మైనింగ్ శాఖలో ఆదాయాన్ని పెంచాలని సీఎం సూచించారు. రాష్ట్రానికి ఉన్న మైనింగ్ వనరుల దృష్ట్యా.. ఈ విభాగంలో అత్యధిక ఆదాయం రావాలని నిర్దేశించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వ్యాట్, జీఎస్టీ, ఎక్సైజ్, వృత్తి-వాణిజ్య పన్నుల ద్వారా వచ్చే ఆదాయం స్వల్పంగా పెరుగుతుందని అధికారులు అంచనావేశారు. మొత్తం మీద 2024-25లో రాష్ట్రప్రభుత్వ రెవెన్యూ రూ. 1,02,154 కోట్లు ఉండొచ్చని తెలిపారు. ఆదాయార్జన విషయంలో ఇకపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తానని, అధికారులు తమ శాఖలను బలోపేతం చేసుకుని ఫలితాలు చూపాలని చంద్రబాబు అన్నారు. సమావేశంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ప్రతిపాదించిన పీ4 విధానాన్ని (పబ్లిక్ - ప్రైవేటు-పీపుల్- పార్టనర్‌షిప్) ఉగాది నుంచి ప్రారంభించనున్నట్లు సీఎం తెలిపారు. సచివాలయంలో ప్లానింగ్‌శాఖపై సమీక్ష సందర్భంగా పీ4 కార్యక్రమం ప్రారంభంపై చర్చించారు. సమాజంలో ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న 10%మంది అట్టడుగున ఉన్న 20% మందికి చేయూతని ఇచ్చేలా ఈ విధానం ఉండాలన్నారు. దీనిపై సమగ్ర విధి విధానాలను రూపొందించేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తీసుకునేందుకు ప్రత్యేక పోర్టల్‌ను తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే పలువురు పారిశ్రామికవేత్తలు తమ సొంత ఊళ్ల , మండలాలను అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చారని.. అలా ఆసక్తి ఉన్న వారిని స్వయంగా ఆహ్వానించి ఉగాది రోజున పీ 4 కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్లానింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముందుచూపు ఉన్న నేత బాబు

- మాడుగుల నాగఫణి శర్మ

దేశంలో సీఎం చంద్రబాబు వంటి ముందుచూపు ఉన్న నేత లేరని ప్రముఖ అవధాని, సరస్వతీ ఉపాసకులు మాడుగుల నాగఫణి శర్మ అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించడంలో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు తీసుకున్న చర్యలను ఆయన కొనియాడారు. పద్మశ్రీ వచ్చిన సందర్భంగా నాగఫణి శర్మను అమరావతికి ఆహ్వానించిన సీఎం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సన్మానించారు. అనంతరం నాగఫణి శర్మ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు విజన్ వల్లనే హైద్రాబాద్‌కు ఐటీ వచ్చింది. ఆయన ముందుచూపు లక్షల మంది జీవితాల్లో వెలుగులు తెచ్చింది. చంద్రబాబు కీర్తి మరింత ఇనుమడిస్తుంది. ఆయన పాలనలో రాష్ట్రం సుభిక్షం అవుతుంది. ప్రజల కోసం చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తాయి. అమరావతి రాజధాని పూర్తయి ప్రపంచంలో మేటి నగరం అవుతుంది. పోలవరం సహా అన్ని ప్రాజెక్టులు పూర్తయి ప్రజలకు మేలు జరుగుతుంది. రాష్ట్రానికి మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలయిక చాలా మంచి చేస్తుంది. సంపద, విద్య, అధికారం... అందరికీ అందేలా ప్రణాళికను సీఎం రూపొందిస్తున్నారు' అని నాగఫణి శర్మ అన్నారు. సీఎం చంద్రబాబును ఆయన ఆశీర్వదించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా ఎస్సై మృతి



శ్వేత

గొల్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల లో ఎస్సై కొక్కుల శ్వేత(30)తో పాటు, ఓ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మల్యాల నరేష్(26) దుర్మరణం చెందారు. ఎస్సై శ్వేత తన కారులో జగిత్యాలకు వస్తుండగా మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన నరేష్(26) విధుల నిమిత్తం మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ రెవెన్యూ శివారులోని వంతెన సమీపంలో అదుపు తప్పిన శ్వేత కారు ఎదురుగా వస్తున్న నరేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. అదే వేగంతో కారు చెట్టుకు ఢీకొనడంతో ఎస్సై శ్వేత, నరేష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. నరేష్‌కు ఇటీవల వివాహం నిశ్చయమైంది. శ్వేతకు వివాహమైనప్పటికీ కొంతకాలంగా పుట్టింట్లోనే ఉంటున్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన శ్వేత కష్టపడి మొదట కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో ఉద్యోగం పొందారు.

'షిప్ యార్డు' పెట్టండి

- అతిపెద్ద జపాన్ షిప్ బిల్డింగ్ సంస్థ ప్రెసిడెంట్‌కు సీఎం సూచన

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జపాన్‌లో అతిపెద్ద షిప్ బిల్డింగ్ సంస్థ ఇమాబరీ షిప్‌బిల్డింగ్ గ్రూప్ ప్రెసిడెంట్ యుకిటో హిగాకీ సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. హిగాకీతోపాటు జపాన్‌కు చెందిన ప్రముఖ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ సోజిట్జ్ సంస్థ ప్రతినిధి నిషిమురా కూడా చంద్రబాబును కలిశారు. ఈ భేటీపై చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఏపీలో షిప్ బిల్డింగ్‌కు, షిప్ మెయింటెనెన్స్ యార్డుల ఏర్పాటుకు అపారమైన అవకాశాలను జపాన్ సంస్థ ప్రతినిధులకు వివరించినట్లు తెలిపారు. షిప్ బిల్డింగ్‌లో స్థానిక యువతకు శిక్షణ ఇవ్వడం ద్వారా దేశీయంగా, అంతర్జాతీయంగా ఈ రంగంలో ఉన్న డిమాండ్‌ను అధిగమించవచ్చని సూచించినట్లు తెలిపారు. త్వరలోనే వారు ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తారని ఆశిస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు.

క్యాన్సర్ రోగులకు సొంత జుట్టుతో విగ్గులు

- మెడ్‌టెక్ జోన్ ఎండీ జితేంద్రశర్మ

విశాఖపట్నం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం సందర్భంగా బాధితులకు సంతోషకరమైన జీవనం గడిపేలా ఏపీ మెడ్‌టెక్ జోన్ కొత్త ఆలోచనతో ముందుకు వచ్చిందని ఆ సంస్థ ఎండీ జితేంద్రశర్మ మంగళవారం వెల్లడించారు. క్యాన్సర్ రోగులకు చికిత్సలో భాగంగా కీమోథెరపీ చేసినప్పుడు వారి జుట్టు మొత్తం ఊడిపోతుందన్నారు. ఇలాంటి వారి సంతోషం కోసం వారి సొంత జుట్టుతోనే తక్కువ ధరలో విగ్గులు తయారుచేసి ఇవ్వాలని నిర్ణయించామని జితేంద్ర చెప్పారు. దీని కోసం ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ జావెద్ హబీబ్‌ను సంప్రదించామన్నారు. క్యాన్సర్ రోగులు చికిత్సకు ముందు జావెద్ హబీబ్ సెలూన్‌కు వెళితే.. ఆ జుట్టును అవసరం మేరకు కత్తిరించి, దానికి బార్ కోడింగ్ వేసి, విగ్‌ను తయారు చేసి, తక్కువ ధరకు ఇస్తారని వివరించారు.

క్యాన్సర్‌ను ఎదుర్కోగలం: సత్యకుమార్

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నివారణ చర్యలు, ముందస్తు పరీక్షలతో తొలిదశలోనే గుర్తించడం ద్వారా క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోగలమని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉచితంగా ముందస్తు పరీక్షలు నిర్వహిస్తోందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు.

జగన్ చేసిన భూ గాయాలు



(మొదటి పేజీ తరువాయి)

పరిష్కరించలేకపోయారు. ఆ సమస్యలే రైతులను అప్పటినుంచీ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

ఉన్నది చెడగొట్టి...

తెలుగుదేశం ప్రభుత్వం 2019కి ముందు రాష్ట్రంలోని భూములకు యూనిక్ ఐడీ ఇవ్వాలని భావించింది. అంటే, భూమి అక్షాంశాలు, రేఖాంశాలను నిర్దిష్టంగా తెలిపేలా ఓ నంబర్ ఇవ్వాలనుకున్నారు. దానికి భూధార్ అని పేరుపెట్టారు. ఇందుకోసం కేంద్రంతో మాట్లాడి ప్రాజెక్టును మంజూరు చేయించారు. రిటైర్డ్ ఐఏఎస్ సత్యనారాయణ నేతృత్వంలో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని అనుకున్నారు. ఎన్నికల తర్వాత జగన్ సర్కారు వచ్చి భూధార్‌ను అటెక్కించారు. రాష్ట్రంలో ఉన్న భూముల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని రైతులకు కొత్త ఆశలు కల్పించి 2020 డిసెంబరులో పైలెట్ ప్రాజెక్టును అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రారంభించింది. ఉమ్మడి కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడులో కరోనాకాలంలో చేసిన పైలెట్ ప్రాజెక్టు విఫలమయింది. 1600 ఎకరాల భూమి ఉన్న ఈ గ్రామంలోనే రీ సర్వేసరిగ్గా చేయలేకపోయారు. విమర్శలను సానుకూలంగా స్వీకరించి సమస్యలను పరిష్కరించే అలవాటులేని జగన్, మొండిగా రాష్ట్రం అంతా రీ సర్వేచేయాలని, అందులోనూ మూడేళ్లలోనే పూర్తిచేయాలని ఆదేశించారు. రీ సర్వేచేయడం తప్పుకాదు. కానీ, దాన్ని ఆగమేఘాలమీద, తక్కువ సమయంలో పూర్తిచేయాలని టార్గెట్ విధించడమే తప్పు. దీంతో సర్కారు ఒత్తిడి భరించలేక సర్వే ఆఫ్ ఇండియా (ఎస్ఓఐ) కూడా రీ సర్వేనుంచి పక్కకు తప్పుకొంది. అయినా సర్వే అధికారులపై ఎనలేని ఒత్తిడి తీసుకొచ్చి హడావుడిగా ఎనిమిది వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయించారు. సర్కారు ఒత్తిడి భరించలేక సర్వే, రెవెన్యూ అధికారులు రీ సర్వే మాన్యువల్‌ను పాటించలేదు.

పరిష్కారం ఎలా?

ఈ సమస్యకు తిరిగి ఆ రైతు సమక్షంలో భూములు సర్వేచేసి పరిష్కరించడం లేదా పాత రికార్డునే పునరుద్ధరించడమే ప్రభుత్వం ముందున్న మార్గాలని అధికారవర్గాలు చెబుతున్నాయి. పాత రీ సర్వే సమస్యలు పరిష్కారం కాకముందే కూటమి సర్కారు కొత్తగా 600 పైచిలుకు గ్రామాల్లో కొత్తగా మరోసారి రీ సర్వే పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించింది. పాత సమస్యలను పరిష్కరించాకే కొత్త ప్రాజెక్టులు అమలు చేయాలన్న సూచనలు ఉన్నాయి.

రూల్స్ ఇలా.. చేసింది అలా..

సర్వే-సరిహద్దుల చట్టం ప్రకారం రైతులకు నోటీసులు ఇచ్చి వారి సమక్షంలోనే భూములు కొలవాలి. ఆ తర్వాత సర్వే నివేదికపై వారి ఆమోదం తీసుకోవాలి. అభ్యంతరాలు వస్తే సావధానంగా పరిష్కరించాలి. చివరిగా గ్రామంలో సర్వే పూర్తయినట్లుగా ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వాలి. అయితే, జగన్ సర్కారు తొందరపాటు చర్యలు, ఒత్తిళ్లతో అధికారులు ఈ ప్రొసీజర్ అమలు చేయలేకపోయారు. నేలవిడిచి సాము చేశారు. చెట్లకింద కూర్చొని రికార్డులు తయారుచేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. డ్రోన్ సర్వేలు ఫలితమివ్వలేదు. అయినా రైతులకు నోటీసులు ఇచ్చి సర్వే చేసినట్లుగా తప్పుడు నివేదికలు పుట్టించారు. ఆ తర్వాత జగన్, ఆయన తండ్రి రాజశేఖరరెడ్డి ఫొటోలతో హడావుడి రీ సర్వే రికార్డులు ముద్రించారు. రైతులకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు. వాటిని చూసిన రైతులు గగ్గోలు పెట్టారు. తమ భూమిని తగ్గించారని, సరిహద్దులు మార్చేశారని రైతులు ఆందోళనకు గురయ్యారు. మండలాల్లో ఏర్పాటు చేసిన అప్పీల్స్ వ్యవస్థ రైతుల పిటిషన్ల పరిష్కారాన్ని మిథ్యగా మార్చేసింది. పిటిషన్లు కన్నెత్తి చూడకుండానే పరిష్కరించినట్లుగా సెటిల్ చేశారు. దీంతో రైతుల్లో మరింత ఆగ్రహావేశాలు పెరిగిపోయాయి. దాని ఫలితం ఎన్నికల్లో జగన్ బాగా చవిచూశారు.

పరిష్కారమైతే ఇన్ని ఫిర్యాదులెలా?

1.90 లక్షల పిర్యాదులు పరిష్కరించామని రెవెన్యూశాఖ చెబుతోంది. కానీ ఆ లెక్క తప్పు అని రెవెన్యూ సదస్సుకు వచ్చిన పిటిషన్లు చెబుతున్నాయి. రీ సర్వే అనంతరం వచ్చిన సమస్యలను పరిష్కరించలేదని రైతులు రెవెన్యూ సదస్సుల్లో తిరిగి ఫిర్యాదులు చేశారు. ఇప్పుడు ఈ సమస్యలే ఇటు రైతుకు, అటు సర్కారుకు పెద్ద సవాల్‌గా మారాయి. న్యాయమైన పరిష్కారం చూపించకపోతే అది మరో సమస్యకు దారితీసేప్రమాదం ఉందని రెవెన్యూ నిపుణులు, సీనియర్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

రెవెన్యూ సృష్టించిన చిక్కులెన్నో....

సర్వే సరిహద్దుల చట్టం ప్రకారం రైతులకు లిఖితపూర్వక నోటీసులు ఇచ్చి, ఆ తర్వాత వారి సమక్షంలోనే భూములు కొలవాలి. ఆ తర్వాత జరిగిన సర్వేను రైతు ఆమోదించాలి. కొలవడానికి ముందు, ఆ తర్వాత రైతుల సంతకాలు తీసుకోవాలి. కానీ రీ సర్వేలో అలా జరగలేదు. రైతుల ప్రమేయం లేకుండానే రీ సర్వే చేసినట్లుగా అడ్డగోలుగా రికార్డులు తయారుచేశారు. కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలను ఉద్దేశ్యపూర్వకంగా సృష్టించారు. తమ భూమి విస్తీర్ణం తగ్గించారని, పక్క రైతు ఖాతాలో కలిపారని రైతులు ఫిర్యాదు చేస్తే ఇప్పుడు తామేం చేయలేమంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. తాము చేసిన తప్పులను సరిదిద్దడానికి కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. రీ సర్వే పేరిట రెవెన్యూ, సర్వే అధికారులు తప్పులు చేసి వాటిని రైతులు భరించాలనడం తీవ్రమైన అంశం. ఈ సమస్యపై ప్రభుత్వం కఠినంగా స్పందించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

భూమి విస్తీర్ణం తగ్గించారు



కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణానికి చెందిన కొశిరెడ్డి రాజాకు సర్వే నంబర్లు 735/1, 735/2లో 2.13 ఎకరాల భూమి ఉంది. రీసర్వేలో మాత్రం 1.49 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు చూపించారు. దీన్ని సరిచేయాలని రెండున్నరేళ్లుగా ఇప్పటికి పదికి పైగా ఫిర్యాదులు ఇచ్చారు. ఇప్పటివరకూ దానిపై పరిశీలన జరగలేదు. సర్వే నంబరు 643/1లో 30 సెంట్లు మాత్రమే భూమి ఉంటే, ఇతరులతో కలిపి జాయింట్ ఎల్‌పీఎం కింద 1.89 ఎకరాలు ఉన్నట్లు చూపించారు. తనకు ప్రత్యేకంగా ఎల్‌పీఎం కేటాయించి తన భూమి విస్తీర్ణాన్ని ప్రత్యేకంగా నమోదు చేయాలని కోరినా ఇప్పటివరకూ చేయలేదు.

ఎందుకు తగ్గిందంటే చెప్పట్లేదు

పశ్చిమగోదావరి జిల్లా యండగండికి చెందిన పీవీఎస్ గోపాలకృష్ణంరాజుకు గ్రామంలో 10.20 ఎకరాల భూమి ఉంది. ఆ భూమి 500, 501 సర్వే నంబర్లలో విస్తరించి ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రీసర్వే నిర్వహించారు. రెండు సర్వే నంబర్లలోనూ 39 సెంట్లు తక్కువగా వచ్చింది. అలాగే గోపాలకృష్ణంరాజు తల్లి పుల్లాయమ్మ పేరుతో 75 సర్వే నంబర్‌లో ఐదెకరాలుంటే, రీ సర్వేలో 20 సెంట్లు తగ్గిందని చెప్పారు. దాని సరిహద్దులో ఉన్న భూమిలో 22 సెంట్లు ఎక్కువగా ఉందని తేల్చారు. ఇలా గోపాలకృష్ణంరాజు కుటుంబం రీ సర్వేలో 59 సెంట్లు కోల్పోయింది. అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. ఎందుకు తగ్గిందో చెప్పలేకపోతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇటువంటి ఉదంతాలు కోకొల్లలు.

ఫిర్యాదులు ఇవ్వడమేగానీ...

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామంలో కాపు లక్ష్మి అనే మహిళా రైతు వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్వే నంబరు 6/3లోని 940 ఖాతా నంబరులో 90 సెంట్లు భూమిని పసుపులేటి అంజయ్య వద్ద కొనుగోలు చేశారు. తొలుత 'మీ భూమి పోర్టల్‌'లో సుబ్బారావు పేరు నమోదైంది. భూముల రీసర్వే అనంతరం మళ్లీ పాత ఖాతాదారు అయిన అంజయ్య పేరు మీద 1.05 ఎకరాల భూమిని అధికారులు ఎక్కించారు. దీనిని మార్పు చేయాలని సుబ్బారావు అప్పటి నుంచీ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కాలేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆన్‌లైన్‌లో తన పేరు ఎక్కించాలని మరోసారి ఫిర్యాదు చేశారు.

వేరే పేర్లు వచ్చి చేరాయి

రీసర్వేలో తప్పులు దొర్లడంతో విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం రైతులు ఆందోళన చెందుతున్నారు. తునివలస, నర్సాపురం, బుడ్డివలస, రేవిడి, మద్ది గ్రామాల్లో చాలా తప్పులు దొర్లాయని అంటున్నారు. రెవెన్యూ అధికారులు నిర్వహించిన గ్రామ సదస్సుల్లో వందల సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. మద్ది గ్రామంలో కాళ్ల అప్పలసూరి భూములకు సంబంధించి రీసర్వే జరగ్గా, అతని పాస్ పుస్తకంలో సర్వే నంబరు 37/9, సర్వే నంబరు 57/4లో కలిపి 26 సెంట్లు నమోదు కాలేదు. సర్వే నంబరు 57/13, 14లో 35 సెంట్లకుగాను 32 సెంట్లు నమోదు చేశారు. మిగిలిన 3 సెంట్లు అతని రికార్డుల్లో లేదు. ఇదే గ్రామంలో వై.లక్ష్మికి సర్వే నంబరు 38/10లో 22 సెంట్లు ఉండగా, 19 సెంట్లు నమోదైంది.

రీ సర్వే తప్పులపై నేడు సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో జరిగిన భూముల రీ సర్వేలో వచ్చిన తప్పులపై లక్షల పిర్యాదులు వెల్లువెత్తున్నాయి. వాటి పరిష్కారంకోసం మండలస్థాయిలో అప్పీళ్ల వ్యవస్థ ఏర్పాటుచేసినా అది సమస్యలకు పరిష్కారం చూపలేదు. దీంతో రీ సర్వే తప్పులు రైతులను కలవరానికి గురిచేస్తున్నాయి. ఈ సమస్యపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. జగన్ జమానాలో మండల స్థాయి రీ సర్వే అప్పీళ్ల అధికారులు ఏం చేశారు? ఏం చేయలేకపోయారన్న అంశాలపై సమీక్ష చేయనుంది. బుధవారం అమరావతి పరిధిలో అప్పీల్ అధికారులతో కీలక సమావేశం నిర్వహించబోతున్నారు. 600 మండలాల డీటీలు హాజరుకానున్నారు. అదనపు సీసీఎల్ఏ, సర్వే డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో ఈ భేటీ జరగనుంది. ఇప్పటికే 8,680 గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. 2.80 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. నెలరోజుల పాటు జరిగిన రెవెన్యూ సదస్సుల్లోనూ రీ సర్వేకు సంబంధించి లక్షకుపైగా పిటిషన్లు వచ్చాయి. రైతుల విన్నపాల పరిష్కారమే లక్ష్యంగా ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిసింది.

బీసీలపై వైసీపీ కత్తి!

(మొదటి పేజీ తరువాయి)

గీత కార్మికులకు 10 శాతం (340 దుకాణాలు) రిజర్వేషన్ కల్పిస్తూ కూటమి ప్రభుత్వం జీవో 13 జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంతో గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, యాత వంటి బీసీ కులాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. బీసీల పక్షపాతిగా కూటమి ప్రభుత్వానికి పేరు రావడం ఓర్వలేని వైసీపీ పెద్దలు ఈ ప్రక్రియను అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా హైకోర్టులో సుమారు 35 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిలో అధికశాతం వైసీపీ నేతలు, వారి అనుకూల న్యాయవాదులు వేసినవి కాగా.. మిగిలినవి వారి సానుభూతిపరులతో వేయించినవని టీడీపీ నాయకులు ఆధారాలు చూపి మరీ ఆరోపిస్తున్నారు. పిటిషన్లు దాఖలు చేసిన వారిలో వైసీపీ హయాంలో ప్రభుత్వ న్యాయవాదులుగా, స్టాండింగ్ కౌన్సిల్స్‌గా పనిచేసినవారు ఉండడం వారి ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. బీసీలు ఆర్థికంగా ఎదగకూడదనే దురుద్దేశంతో తాడేపల్లి పెద్దలు తమ అనుకూల న్యాయవాదులతో ఆడిస్తున్న డ్రామాగా దీనిని టీడీపీ భావిస్తోంది. వైసీపీ తొలి నుంచీ బీసీల పట్ల ద్వేషంతోనే వ్యవహరిస్తోందని బీసీ నాయకులు సైతం ఆరోపిస్తున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీల పార్టీగా గుర్తింపు పొందింది. ఎన్టీఆర్ తొలిసారి వారికి స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించారు. చంద్రబాబు హయాంలో 34 శాతానికి పెంచారు. జగన్ అధికారంలోకి రాగానే 24 శాతానికి కుదించారు. ఈ నిర్ణయంతో 16వేల పైచిలుకు మంది బీసీలు స్థానిక సంస్థల్లో అధికారానికి దూరమయ్యారు. వైసీపీ హయాంలో తీసుకొచ్చిన మద్యం పాలసీ కారణంగా 4 వేల కల్లు దుకాణాల వరకు మూతపడ్డాయి. ఇవన్నీ బీసీల పట్ల వైసీపీ ద్వేషానికి నిదర్శనాలని బీసీ నేతలంటున్నారు.

గీత కార్మికుల పొట్టకొడతారా!

- మద్యం దుకాణాల్ని వైసీపీ అడ్డుకోవడం దుర్మార్గం
- గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేస్తుంటే వారి పొట్టకొట్టేందుకు వైసీపీ నాయకులు సిద్ధమవుతున్నారని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి విమర్శించారు. కల్లుగీత కార్మికులకు కేటాయించిన 340 మద్యం షాపులపై వైసీపీ వారు హైకోర్టులో 35 రిట్‌పిటిషన్లు వేసి అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం గురుమూర్తి విలేకరులతో మాట్లాడారు. గీత కార్మికులకు ఆర్థిక చేయూత అందించేందుకు కూటమి ప్రభుత్వం జీవో 13 ద్వారా రాష్ట్రంలోని 3,396 మద్యం దుకాణాల్లో 10 శాతం గీత కార్మికులకు ఇవ్వాలని నిర్ణయించిందని, దీనివల్ల గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, యాత వంటి ఉపకులాలకు ఎంతో ఉపయోగం అన్నారు. మద్యం షాపుల ఫీజుల్లోనూ 50 శాతం రాయితీ ఇచ్చారని.. వాటిని అడ్డుకోవాలని చూడటం దుర్మార్గమన్నారు. వైఎస్ హయాం నుంచి కూడా బీసీలంటే అంటరానివారిగా చూసేవారని, జగన్ సైతం అదే బాటలో పయనిస్తున్నారని విమర్శించారు. ఎన్టీఆర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే.. చంద్రబాబు దాన్ని 34 శాతానికి పెంచారని, కానీ జగన్ హయాంలో బీసీల రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించారని దుయ్యబట్టారు. వైసీపీ తీరు మారకుంటే 11 సీట్లు కూడా లేకుండా చేసే సత్తా బీసీలకు ఉందన్నారు.

కల్లుగీత కులాలకు హైకోర్టులో ఊరట

- మద్యం లైసెన్సుల కేటాయింపుపై స్టేకు నిరాకరణ
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కులాలకు మద్యం దుకాణాల లైసెన్స్ ఖరారు చేయకుండా నిలువరించాలంటూ మద్యం దుకాణాల యజమానులు చేసిన అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. అయితే, వారికి ప్రభుత్వం ఇచ్చే లైసెన్సులు తుదితీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో 10శాతం మద్యం దుకాణాలను లైసెన్సింగ్ ఫీజులో 50శాతం రాయితీతో కల్లుగీత వర్గానికి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ పలువురు మద్యం దుకాణాల యజమానులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు వేదుల వెంకటరమణ, ఒ.మనోహర్‌రెడ్డి తదితరులు వాదనలు వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,450 మద్యం దుకాణాల్లో 10శాతం(340) దుకాణాలను కల్లుగీత కులాలకు కేటాయించడం చట్టవిరుద్ధమన్నారు. కల్లుగీత కులాలకు లైసెన్స్ ఖరారు ప్రక్రియపై స్టే ఇవ్వాలని అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తూ.. పిటిషనర్లది ఆందోళన మాత్రమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలు, కులాలను గుర్తించి వారికి రాయితీపై మద్యం దుకాణాలు కేటాయించేందుకు ఎక్సైజ్‌చట్టంలో వెసులుబాటు ఉందన్నారు. 2024లో తీసుకొచ్చిన మద్యం పాలసీలో గీత కార్మికులకు రాయితీపై 10శాతం షాపుల కేటాయింపు విషయం స్పష్టంగా ఉందని, అన్ని విషయాలు తెలుసుకొనే పిటిషనర్లు మద్యం దుకాణాల లైసెన్స్ వేలంలో పాల్గొన్నారని తెలిపారు. కల్లుగీత వర్గానికి 340 దుకాణాలు కేటాయించడం వల్ల 3000 మంది దుకాణాల యాజమానులకు నష్టం జరిగితే, వారి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.





అధరగొట్టిన ఒంగోలు జాతి ఆవు

- బ్రెజిల్ వేలంలో రూ. 41 కోట్లు ధర
- అత్యంత ఖరీదైన గోవుగా ప్రపంచ రికార్డు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఒక ఆవు సాధారణంగా వేలల్లో ధర పలుకుతుంది. పాలు ఎక్కువ ఇచ్చే కొంచెం మంచి జాతి అయితే ఓ రెండు లక్షల రూపాయల వరకు ఉండొచ్చు. కానీ ఒక ఆవు రూ. 41 కోట్లు ధర పలికితే.. అమ్మో అని నోరెళ్లబెట్టాల్సిందే. ఇటీవల బ్రెజిల్‌లో జరిగిన వేలంలో వియాటినా-19 అనే పేరు గల ఆవు 4.8 మిలియన్ డాలర్లు (సుమారు రూ.41 కోట్లు) ధర పలికి ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా నిలిచింది. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే.. అది మన ఒంగోలు జాతికి చెందిన ఆవు కావడం. ఇప్పటి దాకా అత్యంత ఖరీదైన జాతులుగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జపాన్‌కు చెందిన వాగ్యు, భారత్‌కు చెందిన బ్రాహ్మణ్‌లను బ్రెజిల్‌లోని మినాస్ గెరెయిస్‌లో పుట్టి పెరిగిన వియాటినా ఈ వేలంతో వెనక్కినెట్టింది. అంతేకాకుండా పశువుల పరిశ్రమలో ఇప్పటి వరకు ఉన్న అన్ని రికార్డులను తుడిచిపెట్టేసింది. ఒంగోలు జాతికి ఉండే అద్వితీయమైన శరీర సౌష్టవం, జాతి లక్షణం వియాటినాను ప్రత్యేక స్థానంలో నిలిపాయి. శరీరం అంతా తెల్లటి రంగులో మిలమిల మెరుస్తూ ఉంటుంది. పైచర్మం వదులుగా ఉండటంవల్ల ఇది ఎంతటి ఉష్ణ వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుంటుంది. విశేషంగా ఉండే మూపురం, బలిష్టమైన కండరాల నిర్మాణం వియాటినాకు ప్రత్యేకం. దీని అసాధారణ జన్యు నిర్మాణం పాడి పశువుల ఉత్పత్తిని మరో మలుపుతిప్పుతుందని భావిస్తున్నారు.

మిస్ సౌత్ అమెరికా కిరీటం..

- ఒంగోలు జాతి ఆవు కంటే డబుల్ సైజులో వియాటినా ఉంటుంది. 1,101 కిలోల బరువుంది.
- అత్యంత ఖరీదైన ఆవుగా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో చోటు సాధించింది.
- బలిష్టమైన శరీరాకృతితో, అందమైన మూపురంతో చూపరులను ఆకట్టుకునే వియాటినా.. ఆవుల చాంపియన్ ఆఫ్ ది వరల్డ్ పోటీలో మిస్ సౌత్ అమెరికా కిరీటాన్ని దక్కించుకుంది.

పైవాళ్లకివ్వాలి.. పదివేలు ఇవ్వండి

ప్రతి మద్యం షాపు నుంచి మామూళ్లు

ఎక్సైజ్ కమిషనరేట్‌లోనే లంచాల పర్వం

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): 'పైస్థాయిలో ఇవ్వాలి. ప్రతి మద్యం షాపు లైసెన్సీ రూ. 10 వేలు ఇవ్వండి' అంటూ ఎక్సైజ్ కమిషనరేట్‌లోనే వసూళ్ల పర్వానికి తెరతీశారు. రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చిన నేపథ్యంలో ఓ అధికారి ద్వారా ఈ వసూళ్లను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 3,396 మద్యం షాపులుండగా రూ.3.3 కోట్ల వసూళ్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే రూ.2 కోట్లకు పైగా వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం ఇటీవల ఉన్నతాధికారుల దృష్టికి కూడా వచ్చింది. కమిషనరేట్ పేరుతో వసూళ్లు చేస్తున్నట్లు వారు గుర్తించారు. దీనిపై ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాల అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. కమిషనరేట్‌లోని ఓ అధికారి ఈ వసూళ్ల పర్వాన్ని ఎలా చేపట్టారనే దానిపై కూడా అనుమానాలు ఉన్నాయి. జిల్లాల్లో వసూళ్లకు పాల్పడితే అవి కమిషనరేట్ దృష్టికి రావు. కానీ స్వయంగా కమిషనరేట్ నుంచే వసూళ్ల వ్యవహారం కొనసాగితే ఇంతకాలం ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు వెళ్లలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఇదంతా జిల్లాల అధికారుల పని అని, కమిషనరేట్‌కు సంబంధం లేదని చెప్పే ప్రయత్నాలు కూడా మొదలయ్యాయి. కమిషనరేట్ అధికారులను కాపాడేందుకు ఈ వసూళ్ల వ్యవహారాన్ని జిల్లాల అధికారులపైకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలోనూ ఎక్సైజ్‌లో వసూళ్ల వ్యవహారాలు కనిపించేవి. అయితే అవి జిల్లా స్థాయిలకే పరిమితం అయ్యేవి. ఎక్సైజ్ స్టేషన్ల వారీగా చేసిన వసూళ్లు జిల్లా స్థాయి, ఆ పైస్థాయికి చేరేవి. ఇందులో కమిషనరేట్ అధికారులు, ఉద్యోగులు జోక్యం చేసుకునేవారు కాదు. కానీ ఇప్పుడు నేరుగా కమిషనరేట్ నుంచి వసూళ్లకు దిగారు. దీనిని చూసి జిల్లాల అధికారులు కూడా అవాక్కయ్యారు.

మా దృష్టికి వచ్చింది: నిషాంత్‌కుమార్

దీనిపై ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్‌కుమార్‌ను వివరణ కోరగా ఆయన స్పందించారు. "సంక్రాంతి పండగ సమయంలో ఈ విషయం మా దృష్టికి వచ్చింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌తో కలిసి వెంటనే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేశాం. కమిషనరేట్‌లో ఇవ్వాలని చెప్పి వసూళ్లు చేస్తున్నట్లు తెలిసింది. ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళ్లినప్పుడు ఈ విషయంపై సీరియస్ వార్నింగ్ ఇచ్చాం. త్వరలో మరికొన్ని జిల్లాల్లోనూ పర్యటించి దీనిపై చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.

పేస్‌మేకర్ రోగికి.. ఎంఆర్ఐ

- మిషన్‌లోనే గిలగిల్లాడుతూ ప్రాణాలు విడిచిన మహిళ
- పరికరం ఉందన్నా స్కానింగ్‌కు పంపిన వైద్యులు
- వివరాలేమీ అడగకుండా స్కానింగ్ చేసిన సిబ్బంది

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆమెకు గుండె జబ్బు ఉంది. గతంలో ఆపరేషన్ చేసిన వైద్యులు పేస్‌మేకర్ కూడా అమర్చారు. ఇలాంటి రోగులకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఎంఆర్ఐ స్కానింగ్ చేయకూడదు. కానీ.. ఈ వివరాలేమీ పట్టించుకోకుండా ఆమెకు ఎంఆర్ఐ స్కానింగ్ చేశారు. అంతే.. స్కాన్ తీస్తుండగా ఆమె ఆ మిషన్లోనే గిలగిలా కొట్టుకుంటూ భర్త కళ్లెదుటే ప్రాణాలు విడిచింది. ఈ ఘటన ఏలూరు సుస్మిత డయాగ్నస్టిక్ సెంటర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రత్తికోళ్లలంక గ్రామానికి చెందిన నల్లగచ్చు రామతులసి (60)కి గతంలో పేస్‌మేకర్ అమర్చారు. అయితే కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆమెకు 2 నెలల నుంచి ఏలూరులోని ఒక ఆస్పత్రిలో డయాలసిస్ చేయిస్తున్నారు. తనకు పేస్‌మేకర్ అమర్చిన విషయాన్ని అక్కడి వైద్యులకు తెలియజేశారు. తలనొప్పిగా ఉందని చెప్పడంతో డాక్టర్లు సుస్మిత డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఎంఆర్ఐ స్కాన్ తీయించుకురావాలని సూచించారు. మంగళవారం ఉదయం రామతులసి, ఆమె భర్త కోటేశ్వరరావు డయాగ్నస్టిక్ సెంటర్‌కు వెళ్లారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు ఏమైనా ఆపరేషన్లు జరిగాయా, ఐరన్ రాడ్లు ఉన్నాయా, ఎలర్జీలు ఉన్నాయా వంటి వివరాలు తెలుసుకుని ఆపై స్కానింగ్ చేయాలి. అవేమీ లేకుండా వెంటనే స్కానింగ్ మిషన్‌లోకి పంపించారు. అక్కడ ఆమె భర్తను ఉంచారు. మిషన్‌లోకి వెళ్లిన క్షణాల్లోనే ఆమె కాళ్లు కొట్టుకుంటూ విలవిల్లాడింది. నిర్వాహకులకు తెలిపినా.. ఏమీ కాదు కాళ్లు కదలకుండా పట్టుకోవాలని సూచించారు తప్ప ఒక్కరు కూడా మిషన్ వద్దకు రాలేదు. దీంతో భర్త కళ్లెదుటే ఆమె ప్రాణాలు విడిచింది. అయినప్పటికీ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు ఆమె బతికే ఉందని, ఆస్పత్రికి తీసుకువెళ్లాలని అంబులెన్సు ఏర్పాటు చేశారు. అప్పటికే ఆమె మృతి చెందిన విషయం గ్రహించిన బంధువులు ఆస్పత్రికి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్కాన్ సెంటర్ నిర్వాహకులపై కేసునమోదు చేశారు. కాగా, స్కానింగ్ తీసే సమయంలో అర్హత కలిగిన టెక్నీషియన్ లేరని, రేడియోలజీ వైద్యులు కూడా ఆస్పత్రికి రాలేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారిణి నాగరత్నం అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె సుస్మిత స్కాన్ సెంటర్‌ను పరిశీలించారు. సెంటర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయనున్నట్టు వెల్లడించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి

15

నవ్య

కుటుంబ కదంబం

బుధవారం • 5 ఫిబ్రవరి 2025

కాటన్ వస్త్రాల్లో 'బగ్రు' ప్రింట్లకు ప్రపంచవ్యాప్త ఆదరణ ఉంది. వేసవి కాలం రాబోతోంది కాబట్టి ఆకట్టుకునే డిజైన్లలో రూపొందుతున్న బగ్రు కాటన్ కుర్తీల గురించి తెలుసుకుందాం!

భలే బగ్రు



ఇలా మ్యాచ్ చేయాలి

మొక్కలు, మట్టి, సేంద్రియ పదార్థాల నుంచి సేకరించిన రంగులతో భిన్నమైన డిజైన్లను ముద్రించుకున్న బగ్రు కుర్తీలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. మెత్తగా, సౌకర్యంగా ఉండే ఈ కుర్తీలను లెగింగ్, జీన్స్‌తో కలిపి ధరించవచ్చు. ఎక్కువగా ముదురు రంగులను కలిగి ఉండే బగ్రు కుర్తీలు అన్ని వయసుల మహిళలకూ అనువుగా ఉంటాయి. టెర్రకోటా, ఆక్సిడైజ్డ్ జ్యువెలరీ ఈ రకం దుస్తులకు చాలా బాగా నప్పుతుంది. ఒంటె తోలుతో తయారయ్యే రాజస్థానీ జూతీలు ఇలాంటి కుర్తీలకు బ్రహ్మాండంగా మ్యాచ్ అవుతాయి. ప్రింటెడ్ కాటన్‌ను ఇష్టపడేవాళ్లు, ఉద్యోగస్తులు వెలసిపోని, మన్నికైన, సౌకర్యవంతమైన బగ్రు కుర్తీలను నిస్సందేహంగా ఎంచుకోవచ్చు.

బగ్రు ప్రింట్ ఒక రకానికి చెందిన హ్యాండ్ బ్లాక్ ప్రింట్. వందేళ్ల క్రితం చిప్ప అనే కులానికి చెందినవాళ్లు, సహజ రంగులను ఉపయోగించి ఈ ప్రింట్లను ముద్రించడం మొదలుపెట్టారు. రాజస్థాన్‌లోని బగ్రు అనే ప్రాంతానికి పరిమితమైన ఈ బగ్రు ప్రింట్లు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందాయి. వీటిని ముద్రించడం కోసం, డిజైన్లతో కూడిన చెక్క బ్లాకులను ఉపయోగించడం విశేషం. ప్రింట్లు వినూత్నంగా ఉండడం, వాటి కోసం సహజ రంగులను ఉపయోగించడం, కాటన్ వస్త్రాల మీదే ప్రింట్లను ముద్రించడం వల్ల, ప్రత్యేకించి వేసవిలో బగ్రు ప్రింట్ల దుస్తులకు ఆదరణ పెరుగుతూ ఉంటుంది.



ఇలా గుర్తించాలి

బగ్రు వస్త్రాలు పక్షులు, పూలు, వాటిని కలుపుతూ అల్లుకునే లతల డిజైన్లతో రూపొందుతూ ఉంటాయి. జామెట్రిక్ డిజైన్లలో కూడా ఈ వస్త్రాలు రూపొందుతూ ఉంటాయి. అయితే పెద్ద ప్రింట్లు ఉండేవే అసలైన బగ్రు అని గుర్తించాలి. అలాగే ప్రింట్ చుట్టూరా కొట్టొచ్చినట్టుండే నల్లని గీత గీసి ఉంటుంది.

- ఉన్నతి సిల్క్స్ సౌజన్యంతో...

పల్లె వెలుగు

అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె ఎన్నో అవహేళనలు ఎదుర్కొన్నారు. ఒత్తిడులను, వేధింపులను తట్టుకొని నిలబడ్డారు. నిధులకోసం కోర్టు మెట్లు సైతం ఎక్కారు.అందుబాటులో ఉన్న వనరులన్నిటినీ సద్వినియోగం చేసుకున్నారు. అన్ని పనుల్లో స్వయంగా శ్రమిస్తూ, గ్రామాన్ని ప్రగతి పథంలో నిలిపారు. తన కృషికి గుర్తింపుగా ఇటీవల కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నుంచి పురస్కారం అందుకున్న గుంటూరు జిల్లా గొడవర్రు గ్రామ సర్పంచ్ బీరం జానకీదేవితో 'నవ్య' సంభాషణ.

"సర్పంచ్‌గా గెలవగానే అభినందనలతోపాటు అవహేళనలు కూడా నాకు తీవ్రంగానే ఎదురయ్యాయి. "చదివింది ఇంటర్. పరిపాలన ఏం చెయ్యగలవు?" అని కొందరు, "మహిళవు. ఊరికోసం చొరవ తీసుకొని కష్టపడలేవు" అని ఇంకొందరు... ఇలా ఎంతో మంది నిరుత్సాహపరిచారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే... "ప్రతి వివరం మీతో చెప్పలేం కదా! అయినా కార్యాలయాల చుట్టూ మీరెక్కడ తిరుగుతారు? ఎవరినైనా పంపవచ్చు కదా" అనే సలహాలు వినిపించేవి. ఈ మాటలన్నీ నాలో పట్టుదల పెంచాయి. సాధారణంగా మహిళలు పదవుల్లో ఉంటే... పెత్తనం, పాలన పురుషులు చేస్తూ ఉంటారు. ఈ సంస్కృతికి నేను వ్యతిరేకం. ఇల్లు చక్కదిద్దగలిగే మహిళలకు ఊరు బాగు చేయడం కూడా తెలుసని నిరూపించాలని నిశ్చయించుకున్నాను.



కత్తిమీద సాము...

మాది గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని గొడవర్రు గ్రామం. మా నాన్న ఇక్కుర్తి శివనాగేశ్వరరావు, తల్లి ఉమామహేశ్వరి. వ్యవసాయమే జీవనాధారమైన మధ్యతరగతి కుటుంబం. నన్ను ఇంటర్ వరకూ చదివించాక... పెళ్లి చేశారు. నా భర్త వెంకటేశ్వరరావు కూడా రైతే. మాకున్న ఎకరా పొలంతోపాటు మరి కొంత భూమి కౌలుకు తీసుకున్నాం. ఇంటి పనులు, పొలం పనులతో కాలం గడిచేది. కాగా... మా మామగారు 1995లో... గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. అప్పటినుంచి మా కుటుంబం రాజకీయాలకూ దూరంగానే ఉంటూ వచ్చింది. కానీ మా కుటుంబంలో ఎవరో ఒకరు సర్పంచ్ కావాలనేది ఆయన బలమైన కోరిక. కిందటి ఎన్నికలలో ఆ అవకాశం నాకు అనూహ్యంగా, నన్ను వెతుక్కుంటూ వచ్చింది. మొదట వద్దనుకున్నాను. కానీ కుటుంబం, సన్నిహితులు ప్రోత్సహించడంతో పోటీ చేశాను. ప్రజలు కూడా మద్దతు ఇచ్చారు. పార్టీలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలవారు ఓటు వేసి గెలిపించారు. పదవి అంటే అలంకారప్రాయం కాదనీ, ఎన్నో రాజకీయాలను, కుట్రలను ఎదుర్కొవాల్సి ఉంటుందని, జనం మెప్పు పొందడం కత్తి మీద సాము అని తక్కువ కాలంలోనే తెలుసుకున్నాను.

కూలీగా వెళ్లాను...

మాది మూడువేల మంది జనాభా ఉన్న గ్రామం. అయితే ఏ పని చెయ్యాలన్నా గత ప్రభుత్వ కాలంలో నిధులు లేని పరిస్థితి. దీంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్‌జీవన్ మిషన్, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ సద్వినియోగం చేసుకోవాలనుకున్నాను. అయితే వాటిని కూడా సరిగ్గా అందనివ్వలేదు. దానికోసం పోరాడాను. అధికారులను నిలదీశాను. చివరకు ఒక దశలో... పంచాయతీలకు దామాషా ప్రకారం అందాల్సిన నిధుల కోసం కోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. న్యాయపరంగా పోరాడి నిధులు సాధించుకోగలిగాం. మరోవైపు గ్రామాన్ని పీడిస్తున్న సమస్యల పరిష్కారం మీద దృష్టి పెట్టాను. గ్రామానికి వస్తున్న నీరు ఆకుపచ్చగా, దుర్గంధభరితంగా ఉండడంతో... వాటిని తాగినవారు రోగాల బారిన పడేవారు. ఇది నన్ను తీవ్రంగా కలచివేసింది. సురక్షిత జలాల సరఫరా కోసం జల్‌జీవన్ మిషన్ నిధులు రూ .4.8 లక్షలతో 980 మీటర్ల పొడవున కొత్త పైప్‌లైన్లు, కొత్త కొళాయిలు వేయించాం. చెరువులో నీటిని శుద్ధి చేసి పంపడానికి కావలసిన ఫిల్టర్ బెడ్స్ దెబ్బతిన్నాయి. వాటిని బాగుచేయించడానికి నిధులు అడిగితే పట్టించుకున్నవారు లేరు. ఆఖరుకు దాతల సహకారంతో తాత్కాలిక మరమ్మతులు చేయించి, సురక్షిత నీటిని అందించగలిగాం. జల్‌జీవన్ మిషన్ నిధులను సద్వినియోగం చేసుకొని, అభివృద్ధి సాధించిన సర్పంచ్‌లుగా... ఆంధ్రప్రదేశ్ నుంచి అయిదుగురు ఎంపికైతే... వారిలో నేనూ ఉన్నాను. ఇక, ఉపాధిహామీ నిధులతో చెరువును బాగుచేయాలనుకున్నప్పుడు మరో సమస్య ఎదురయింది. కూలీల హాజర్లు పడుతున్నాయి, పనులు మాత్రం జరగడం లేదు. అలా వదిలేస్తే లాభం లేదని... నేను కూడా ఒక కూలీగా వెళ్లి, వారితో కలిసి పని చేశాను. పూడిక తీత, చెరువు కట్టలను పటిష్టం చేయడం లాంటి పనులన్నీ వారి వెంటే ఉండి చేయించాను. ఈ పథకంతో ఒక క్లినిక్ కూడా నిర్మించుకోగలిగాం. ఉపాధి హామీ నిధులతో సాధించిన అభివృద్ధిలో... రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచాం. గ్రామంలో... రూ. 50 లక్షలతో మొత్తం సిమెంట్ రోడ్లను దాదాపు పూర్తి చేశాం. కాలువల అంచులపై గడ్డి మొలవకుండా... నేనూ వెళ్లి మందులను పిచికారీ చేస్తాను. అవసరమైతే నీరు కూడా మోసుకొస్తాను. ఏదీ నామోషీగా భావించను.

రాజకీయంగా దెబ్బతియ్యాలని చూశారు..

గత ప్రభుత్వ కాలంలో... రెండున్నరేళ్ల క్రితం ఒక్క రూపాయైనా పంచాయతీ దగ్గర లేకపోవడంతో... మాకు రావలసిన నిధుల కోసం పోరాడాను. అప్పుడు కొందరు కక్షగట్టి, రాజకీయంగా దెబ్బతియ్యాలని చూశారు. నా చెక్ పవర్ రద్దు చేయించటానికి ప్రయత్నించారు. సర్పంచ్‌గా గెలిచినప్పుడు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుగారిని కలిశాం. సర్పంచ్‌లందరం టీడీపీ కండువాలు వేసుకుని వెళితే... ఆయన కండువాలు తీయించేశారు. "మీరు సర్పంచ్‌లు. ఊరికోసం పాటుపడండి. రాజకీయాలు పక్కనపెట్టండి" అన్నారు. ఆ స్ఫూర్తితో... నన్ను శత్రువుగా భావించినవారినికూడా సొంతవారిగా మార్చుకోగలిగాను. 'వైఎస్ఆర్ ఆసరా' అందాల్సిన అర్హులను తొలగించినప్పుడు, సచివాలయాన్ని ఆలయ భూముల్లో ఊరికి దూరంగా నిర్మించేందుకు ప్రయత్నించినప్పుడు ప్రతిఘటించాను. తమకు అనుకూలంగా తీర్మానం చెయ్యాలని అనేక విధాలుగా ఒత్తిడి తెచ్చారు. బెదిరించారు. భయపడలేదు. కోర్టుకు వెళ్లి 'ఆసరా'ను మంజూరు చేయించగలిగాను. ఇవన్నీ చూశాక నాపై గ్రామస్తులకు చాలా నమ్మకం కలిగింది. ఒకానొక సమయంలో ఊరికోసం వ్యతిరేకంగా పనిచేసేవారిని ఒప్పించడం కోసం... వారి కాళ్లు పట్టుకోటానికి కూడా వెనకాడలేదు.



ఎన్నారైల చొరవతో...

మా గ్రామం చిన్నది కావటంతో జనాభా ప్రాతిపదికన వచ్చే నిధులు చాలక దాతల సహకారం తప్పనిసరి అయింది. దూర ప్రాంతాల్లో స్థిరపడిన మా గ్రామస్తులు, ముఖ్యంగా ఎన్నారైలు ఎప్పుడు ఊరికి వచ్చినా... గ్రామాభివృద్ధి కోసం సాయం చేయమని నిర్మొహమాటంగా అడుగుతాను. ఇటీవలే ఎన్నారై మద్దినేని శ్రీనివాస్ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు గుర్తించి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ. 10 లక్షలు సాయం చేయటానికి ముందుకు వచ్చారు. నా సోదరుడు, మరికొందరు కలసి గ్రామంలో ఎల్.ఇ.డి లైట్లన్నీ రూ. 3 లక్షలతో వేయించారు. మైకులు పెట్టించి వాటిద్వారా జనానికి సమాచారం ఇవ్వటం, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల వివరాలు తెలియచెయ్యటం లాంటివి చేస్తున్నాం. ఇటీవలే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుగారిని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌గారిని కలిశాం. గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని కోరాం. వారినుంచి సానుకూల స్పందనే వచ్చింది. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ గణతంత్ర దినోత్సవం రోజున... దేశంలోని వివిధ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు పురస్కారాలు అందించింది. స్వచ్ఛ భారత్, జాతీయ ఉపాధి హామీ పథకం, జల్‌జీవన్ మిషన్ లాంటి వాటిని సద్వినియోగం చేసుకుని గ్రామాన్ని ఉన్నత స్థానంలో నిలిపినందుకు వీటిని ఇచ్చారు. మిగిలిన సర్పంచ్‌లంతా స్వచ్ఛ పురస్కారాలను అందుకుంటే, నాకు అదనంగా కేంద్ర జలవనరుల శాఖ నుంచి కూడా పురస్కారం దక్కింది. ఈ గౌరవం గ్రామాభివృద్ధికి సహకరించినవారందరికీ చెందుతుంది."

• **తిరుమలశెట్టి శేషగిరిరావు**, తెనాలి

ఫొటోలు: **ధూళిపాళ్ల శ్రీధర్**

నకిలీ కుంకుమ పువ్వుని గుర్తించండి ఇలా..!

తీపి పదార్థాలతోపాటు కొన్ని రకాల గ్రేవీల తయారీలో కుంకుమపువ్వును ఉపయోగిస్తుంటారు. కుంకుమ పువ్వు... ఘాటైన వాసనతో కొద్దిపాటి చేదు రుచితో ఉంటుంది. ఈ కారణంగానే ఆహార పదార్థాలకు ప్రత్యేక రుచి చేకూరుతుంది. నకిలీ కుంకుమపువ్వు వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉంటుంది. కొన్ని చిట్కాల ద్వారా నకిలీని గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- ఒక చిన్న గ్లాసు నీటిలో కుంకుమపువ్వు రేకులు మూడింటిని వేసి కలపాలి. నీళ్ల వెంటనే రంగు మారితే అవి నకిలీవని గుర్తించాలి. నిజమైన కుంకుమపువ్వు రేకులు రంగు విడవడానికి చాలా సమయం తీసుకుంటాయి. ఇవి పాలు, నీళ్ల సహా ఏ ద్రవంలోనూ కరగవు.
- కుంకుమ పువ్వు రేకులు ఎరుపు రంగులో ఉంటాయి. కానీ వాటిని ఆహార పదార్థాల్లో కలిపినప్పుడు లేత పసుపు రంగుని విడుస్తాయి. రేకులు వేసిన నీళ్ల లేదా పాలు ఎరుపు రంగులోకి మారినా రేకులు రంగు వెలిసి కనిపించినా అవి నకిలీవని తెలుసుకోవచ్చు.
- రెండు రేకులను నోట్లో వేసుకుని నమిలితే నోరంతా చేదుగా అవుతుంది. అలా కాకుండా నాలుకమీద తీపిదనం తెలిస్తే అవి నకిలీవని గుర్తించాలి.
- రేకులకు నిప్పు పెడితే అవి మండని పక్షంలో శుద్ధమైన కుంకుమ పువ్వుగా గుర్తించాలి. నకిలీ రేకులు వెంటనే మండిపోతాయి.



- శుద్ధమైన కుంకుమ పువ్వు ...మట్టి, గడ్డి, తేనె వాసనల కలయికతో ఉంటుంది. నకిలీదానికి ఎటువంటి వాసన ఉండదు.
- ఒక కప్పు నీటిలో రెండు కుంకుమ పువ్వు రేకులు వేసి పది నిమిషాలు నానబెట్టాలి. తరవాత ఈ రేకులను నీళ్లలో నుంచి తీసి వేళ్లతో నలిపితే అవి చిన్న ముక్కలు కాని పక్షంలో శుద్ధమైనవని గుర్తించాలి. రేకులు తెగిపోతుంటే మాత్రం నకిలీవని తెలుసుకోవచ్చు.

గోరింటాకుతో కురులు ఆరోగ్యంగా...

గోరింటాకులో యాంటీ ఫంగల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శిరోజాలు ఆరోగ్యంగా పెరగడానికి దోహదం చేస్తాయి. గోరింటలోని ఫ్రీరాడికల్స్... మాడు మీద హానికారక సూక్ష్మక్రిములను నాశనం చేస్తాయి. గోరింటాకుతో శిరోజాలను అందంగా ఎలా మార్చుకోవాలో తెలుసుకుందాం!

- గోరింటాకును మెత్తగా రుబ్బి తలకు పట్టించాలి. అరగంటసేపు ఆరిన తరవాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే శిరోజాలకు పోషణ అంది చక్కగా పెరుగుతాయి. మాడు మీద దురద, చుండ్రు, కురుపులు లాంటి సమస్యలు రావు.
- గుప్పెడు గోరింట ఆకులను ఒక కప్పు కొబ్బరి నూనెలో వేసి బాగా మరిగించి వడకట్టాలి. రాత్రి పడుకునే ముందు ఈ నూనెని చేతి



వేళ్లతో తీసుకుని మాడుకు పట్టేలా మర్దన చేయాలి. పలుచని వస్త్రాన్ని తలకు కట్టుకోవాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తల స్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే వెంట్రుకల కుదుళ్ల గట్టిపడి జుట్టు రాలడం, నెరవడం లాంటి సమస్యలు తగ్గుతాయి.
- ఒక కప్పు గోరింటాకు పొడిలో రెండు చెంచాల మెంతి పొడి, ఒక చెంచా శీకాయ పొడి, ఒక చెంచా ఉసిరి పొడి వేసి అర కప్పు టీ డికాషన్‌తో ముద్దలా కలపాలి. దీనిని తల వెంట్రుకలకు, మాడుకు పట్టించాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీళ్లతో తల స్నానం చేస్తే శిరోజాలు రాలడం తగ్గి నల్లగా ఒత్తుగా నిగారిస్తాయి.
- ఒక కప్పు గోరింటాకు పొడిలో రెండు చెంచాల కాఫీ పొడి, ఒక చెంచా మందార నూనె వేసి నీళ్లతో కలిపి తలకు పట్టిస్తే జుట్టు నెరవడం తగ్గుతుంది.
- గోరింట పొడిని గుడ్డు తెల్ల సొనతో కలిపి తలకు పట్టించి రెండు గంటల తరవాత శీకాయ పొడితో తలస్నానం చేస్తే తల వెంట్రుకలు నున్నగా మెత్తగా మెరుస్తాయి.
- ఒక కప్పు బ్లాక్ టీలో అర కప్పు గోరింట పొడిని కలిపి రాత్రంతా నాననివ్వాలి. ఉదయాన్నే ఈ మిశ్రమంలో కొద్దిగా పెరుగు కలిపి తలకు పట్టించి ఇరవై నిమిషాల తరవాత తలస్నానం చేస్తే జుట్టు రాలడం తగ్గుతుంది.

విజేత



ప్రియమైన విజయం

ప్రియాంక ఇంగ్లే... నిన్నటివరకు ఈ పేరు పెద్దగా తెలియదు. కానీ మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్ గెలిచిన జట్టు సారథిగా ఇప్పుడామె దేశమంతటికీ సుపరిచితురాలు. అనుభవం... నైపుణ్యం... పటిష్టమైన వ్యూహాలతో భారత మహిళా జట్టుకు అపురూప విజయాన్ని అందించిన ఆమె... ఈ స్థాయికి రావడానికి ఎన్నో సవాళ్లను అధిగమించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా... అహర్నిశలూ శ్రమించి తన కలను నిజం చేసుకున్న 24 ఏళ్ల ప్రియాంక కథ ఇది.

'ఎంతో గర్వంగా అనిపిస్తోంది'... భారత మహిళల జట్టు మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్ గెలిచిన తరువాత ప్రియాంక ఇంగ్లే ఉద్వేగంగా చెప్పిన మాటలివి. వాస్తవానికి దానికి మించిన ఆనందం ఆమెకు మరొకటి ఉంది. అదే ఖోఖోకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రావడం... తనలాంటి గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను నిరూపించుకోవడానికి అద్భుతమైన అంతర్జాతీయ వేదిక ఒకటి అవతరించడం. గత నెల ఢిల్లీలో జరిగిన ఈ మెగా టోర్నీలో పాతిక దేశాలు తలపడ్డాయి. ప్రియాంక నేతృత్వంలోని భారత జట్టు... మ్యాచ్ మ్యాచ్‌కూ పరిణతి కనబరుస్తూ... వరుస విజయాలతో దూసుకుపోయింది. ప్రపంచ కప్‌ను ముద్దాడింది. 'ఇంతకుముందు చాలామందికి ఈ ఆట గురించి తెలియదు. ఖోఖో అనగానే అదేదో పాఠశాల స్థాయి క్రీడగా భావించేవారు. ఇప్పుడు దీనికి మంచి వేదిక దొరికింది. ముఖ్యంగా మన ఆటకు ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కింది. అందుకే నా దృష్టిలో ఇది ఒక చారిత్రక విజయం. ఇది గ్రామీణ క్రీడాకారుల్లో ఎనలేని స్ఫూర్తి నింపుతుంది' అంటూ తన సంతోషాన్ని పంచుకుంది ప్రియాంక.


రైతు బిడ్డ...

మహారాష్ట్రలోని కరువు ప్రాంతమైన బీడ్ జిల్లాకు చెందిన ప్రియాంక కుటుంబం... తరువాత పూణె శివారు దిఘికి వలస వెళ్లింది. ఆమె తల్లితండ్రులు హనుమంత్, సవిత చిన్నకారు రైతులు. సొంత ఊళ్లో సాగు లేకపోవడంతో దిఘికి వచ్చి చిన్న పనుల్లో చేరారు. వచ్చే ఆదాయం ఇంటి ఖర్చులకు సరిపోయేది కాదు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు. ఒకేఒక్క ఇరుకు గదిలో కుటుంబమంతా తల దాచుకునేది. కానీ ఇవేవీ ప్రియాంక ఆకాంక్షకు అవరోధం కాలేదు. తనకు ఇష్టమైన ఖోఖోలో అత్యున్నత స్థాయికి చేరాలని కలలు కన్నది. ఐదో తరగతిలోనే ఆట మొదలుపెట్టింది. క్రమంగా అదే తన లోకం అయింది. 'చిన్నప్పుడు స్కూల్లో ఆడుతుంటే చూశాను. అప్పటి నుంచీ ఖోఖో తప్ప ఇక నాకు ఏ ఆటా నచ్చలేదు. మొదట్లో మా స్కూలు జట్టుకు ఆడాలని తపించేదాన్ని. అక్కడ మెరుగ్గా రాణించాను. ఆటపై పట్టు దొరికింది. నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అది నా ఆలోచనల్ని మార్చేసింది. జాతీయ స్థాయిలో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. కష్టపడ్డాను. ఆ కల నిజమైంది. భారత జట్టుకు ఎంపికయ్యాను. నేడు ప్రపంచ కప్ గెలవడం నా జీవితంలోనే అత్యంత విలువైన, ప్రత్యేకమైన సందర్భం' అంటుంది ఆమె.

చదువులోనూ ముందే...

'శ్రీ సయాజీనాథ్ మహారాజ్ విద్యాలయ'లో ఐదో తరగతి చదువుతుంగా ఖోఖో మొదలుపెట్టిన ప్రియాంక... స్కూల్ జట్టులో చేరాలనుకుంది. కానీ అందుకు ఆమె తల్లితండ్రులు ఒప్పుకోలేదు. 'ఆటవల్ల నా చదువు దెబ్బతింటుందని అమ్మానాన్న భావించారు. మా బంధువుల్లో ఒకరు డాక్టర్. తనలా నన్ను కూడా ఎంబీబీఎస్ చదివించాలని అనుకున్నారు. అయితే ఆటలో నేను బాగా రాణిస్తుండడంతో మనసు మార్చుకున్నారు. నన్ను ప్రోత్సహించారు. మా నాన్న కోరుకున్నట్టు డాక్టర్‌ను కాలేదు కానీ... చదువులో కూడా నేను ముందున్నాను. ఎనభై శాతం మార్కులతో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాను. పన్నెండో తరగతిలో, ఆ తరువాత డిగ్రీలో కూడా మంచి మార్కులే తెచ్చుకున్నాను' అంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చిన ప్రియాంక ఎంకాం పూర్తి చేసింది.

విజయాలకు గుర్తుగా...



ఖోఖోనే తన ప్రపంచంగా సాగిపోతున్న ప్రియాంక... ఎన్నో అపురూప విజయాలను తన ఖాతాలో వేసుకుంది. వీటికి గుర్తుగా రెండేళ్ల కిందట మహారాష్ట్ర ప్రభుత్వం 'రాణి లక్ష్మీబాయి అవార్డు'తో పాటు 'శివ్ ఛత్రపతి స్టేట్ స్పోర్ట్స్ అవార్డు'నిచ్చి గౌరవించింది. అంతకముందు సబ్‌జూనియర్ జాతీయ ఖోఖో టోర్నీలో కనబరిచిన ప్రతిభకు గానూ... ఉత్తమ క్రీడాకారిణి అవార్డు గెలుచుకుంది. ఇవికాకుండా స్థానికంగా ఎన్నో పురస్కారాలు, ప్రశంసలు అందుకుంది. ప్రపంచ కప్ గెలిచాక ప్రియాంకతో పాటు జట్టు సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ ప్రకటించారు.

పదిహేనేళ్లుగా...

ఈ ప్రయాణంలో అడుగడుగునా ఇబ్బందులు ఎదురైనా లక్ష్యం నుంచి పక్కకు తప్పుకోలేదు ప్రియాంక. కుటుంబ పరిస్థితులు, చదువు పేరు చెప్పి తప్పించుకొనే ప్రయత్నం చేయలేదు. పట్టుదలగా ప్రయత్నించి పదిహేనేళ్లుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తోంది. ప్రొఫెషనల్ క్రీడాకారిణిగా అదరగొడుతోంది. పన్నెండేళ్లకే రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆమె పేరు... జాతీయ సబ్‌జూనియర్ ఖోఖో టోర్నమెంట్‌తో వెలుగులోకి వచ్చింది. ఆ టోర్నీలో అత్యుత్తమ క్రీడాకారిణిగా అవార్డు అందుకుంది. 2016 ఆసియా ఖోఖో చాంపియన్‌షిప్ ప్రియాంక కెరీర్‌లోనే పెద్ద మలుపు. అందులో భారత జట్టు స్వర్ణ పతకం గెలుచుకుంది. తరువాతి ఎడిషన్‌లో రజతం సాధించింది. ఇప్పటివరకు 23 జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొంది. ఎనిమిదేళ్లుగా అంతర్జాతీయ వేదికపై సత్తా చాటుతోంది.

ఆటలో తిరుగులేదు...

అపార అనుభవంతో పాటు మెరుపు వేగం, నైపుణ్యం, ప్రత్యర్థులను చిత్తు చేసే వ్యూహాలు రచించడంలో ప్రియాంక దిట్ట. ఇవే ఆమెను తిరుగులేని క్రీడాకారిణిగా నిలిపాయి. ప్రపంచ కప్‌లో భారత జట్టును నడిపించే బాధ్యతను అప్పజెప్పాయి. 'మొదటి ప్రపంచ కప్. అందులో పాల్గొనే మన దేశ జట్టు నాయకత్వ బాధ్యతలు నాకు అప్పగించడం... నిజంగా ఇది అద్భుతమైన అనుభూతి' అంటూ టోర్నీకి ముందు ప్రియాంక భావోద్వేగానికి లోనైంది. భారత్‌లో ఖోఖో భవిష్యత్తుకు ఈ టోర్నీ బంగారు బాట వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేసిన ఆమెను మహారాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది.